Pubilshed from Kakinada

PRGI NO : APTEL/25/A1470

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




కాకినాడ KAKINADA | సంపుటి : 02 Vol.No : 02 | సంచిక : 267 Issue No : 267 | మంగళవారం Tuesday | ఆగస్టు 25, 2026 25 AUGUST 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



ఏడాదికి మూడు ఎల్‌పిజి సిలిండర్ల ఖర్చు తిరిగి

## చెల్లింపు

**తమిళనాడు సిఎం**

చెన్నై : వచ్చే ఏడాది సంక్రాంతి నుంచి అర్హులైన కుటుంబాలకు ఏడాదికి మూడు ఎల్‌పిజి సిలిండర్ల ఖర్చును ప్రభుత్వం తిరిగి చెల్లించనున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ సోమవారం అసెంబ్లీలో ప్రకటించారు. 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' పథకం కింద ఈ ప్రయోజనాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఏడాదికి రూ.2.5 లక్షలలోపు ఆదాయం ఉన్న కుటుంబాలు ఈ పథకానికి అర్హులని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.30 కోట్ల కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నాయని తెలిపారు. ఇందు కోసం ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ.4,000 కోట్లు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు.

- మిగతా 2లో..

**ఆమె ఉద్యోగ ప్రస్థానమంతా స్వర్ణ మయమే..**

- అడిషనల్ డైరెక్టర్ ఇంచార్జి గా అమోఘ సేవలు అందించి..
- అనర్హులకు పెద్దపీట వేసేలా..
- అర్హతలతో పనిలేకుండా అన్నింటిని ఎంపానల్మెంట్ చేసి..
- ఎందుకు 75..34 అయ్యాయి..
- 34 ...23 ఎలా అయ్యాయో..
- 23 నుంచి దశల వారీగా ఎలా పెరుగుతూ వచ్చాయో... లివీటన్నిటిపై విచారణ చేసిందెవరు..
- అసలు రెగ్యులారిటీ లేదని యాడ్స్ ఆపినట్లు అంతా మాయ చేసి..
- వాటి ఎంప్యానల్మెంట్ రద్దు చేయకుండా..
- రద్దు చేయకుండానే పునరుద్ధరించి..
- అన్నిటికి నోటి మాటలే ప్రాతిపదిక గా..
- నోట్ల కట్టలకోసం నోటి మాటలను ప్రామాణికం చేసుకుని...
- కాగితాలు సమాధానం చెప్పే పరిస్థితి ఉందా..అంటే...?
- కాగితాల సమాధానం ఉంటే కోర్టుల్లో కేసులెందుకు నమోదు అవుతున్నాయి...?
- ప్రశ్నిస్తే పై అధికారులకు పోసుపోనీ మాటలు చెప్పడం.. లిపిర్యాదు లిస్తే గా
- మాటలని కోర్టులకు రాయడం..
- పీర్ జి ఐ ఉన్న ప్రింటింగ్ ప్రెస్ లు కార్యాలయాలు లేక పోయినా..
- పైసలిస్తే ఫైల్స్ పరుగులు తీస్తాయన్నట్లుగా..
- పైసలు తీసుకోకుంటే పద్ధతి తప్పి పనులు ఎలా చేశారు..
- విజిలెన్స్ అధికారుల లేఖలు బుట్టదాఖలు చేస్తూ..
- సమాచార శాఖకు ప్రత్యేక చట్టం ఉందనేలా..
- ఇలాంటి ఉద్యోగుల కోసం పేదల రక్తం చిందించి..
- ఇంత పద్ధతి తప్పిన అధికారులపై చర్యలు లేకపోతుంటే..
- వీరికి రాజ్యాంగ హక్కు ప్రత్యేకంగా ఉందా అనే..!
- ఐ ఏఎస్ లను కూడా బురిడి కొట్టిస్తుంటే..
- వీరి బ్రతుక కోసం ఇంకెన్ని బ్రతుకులను బలిచేస్తారో..
- ప్రజాధనమంటే అంత చులకనగా ఉంటుందా..
- చేసేది అవినీతి చెప్పేది శ్రీరంగ నీతులా..!
- ఏ ప్రభుత్వమూ ఈ ప్రబుద్ధులను పద్ధతిలో పెట్టలేకపోతుంటే..
- ఎంప్యానల్మెంట్ పై హైకోర్టుకు వెళ్ళాలా..
- న్యాయం అంగడిలో సరుకు అవ్వలేదుగా


# మేడం స్వర్ణలత..

# స్వర్ణలతమేడం నే..!




**( రామమోహన్ రెడ్డి )**

'నిగ్గదీసి అడుగు ఈ సిగ్గులేని జనాన్నిఅగ్గి తోటి కడుగు ఈ సమాజ జీవచ్ఛవాన్నిమారదు లోకం మారదు కాలందేవుడు దిగిరాని ఎవ్వరు ఏమయిపోని మారదు లోకం మారదు కాలం"అని సిరివెన్నెల సీతారామ శాస్త్రి మూడు దశాబ్దాల క్రితమే ఈ సమాజ స్థితిగతులపై చక్కటి విప్లవ గీతం ద్వారా తెలియపరిచారు.కారణం అవినీతి పరుల సామ్రాజ్యంలో నీతిమాలిన వారికి అవినీతి పరులకే పెద్ద పీట వేస్తూ ఉన్నారనే కోణం లో ఈ విప్లవ గీతం గాయం సినిమా ద్వారా తెలుగు లోకానికి అందించడం జరిగింది. సరిగ్గా నేడు కూడా ఇక్కడ ఈ వార్త కథనం లో చెప్పుకోబోయే అవినీతి అధికారుల తీరుతో ఈ రాష్ట్రం లో ఉన్న సంపాదకుల జీవితాలను అనేక గాయాలు చేస్తున్నారు. సమాచార శాఖ అంటే అవినీతి అక్రమాలు ఉండవని సభ్య సమాజం అనుకుంటే అది చాలా పొరపాటు అవుతుందనేది యదార్థం.ఈ శాఖలో ఉన్న అవినీతి చాపకింద నీరులా నీతి నిబద్ధత నిజాయితీ గా ఎంతో కొంత మేర నడిపే పత్రికల మనుగడకి పెను ప్రమాదం తెచ్చిపెడుతున్నారని అనడంలో సందేహం అక్కర్లేదు.ఇంతకీ ఏమిటా ఈ సమాచార శాఖ అధికారుల అవినీతి బాగోతం అంటే..



స్వర్ణలత ఈ పేరు సమాచార పౌర సంబంధాల శాఖలో పనిచేసే అధికారులతో పాటుగత వైసిపి ప్రభుత్వం లోని కీలక నేతలకు , ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కొంతమందికి మాత్రమే పరిచయస్తురాలుగా అడిషనల్ డైరెక్టర్ ఇంచార్జి, ప్రకటనల విభాగం ఇంచార్జి,

2 పేజీలో..

నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను కేంద్రం

# అవమానించింది

- తెలంగాణ సీఎం రేవంత్
- అమెరికా పర్యటనకు అనుమతిపై రేవంత్ తీవ్ర ఆగ్రహం
- ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్య
- విదేశాల్లో స్పందిస్తే దేశద్రోహి అనేవారని వెల్లడి
- అమెరికాకు తెలంగాణ అధికారులను పంపినట్లు ప్రకటన
- ఆక్స్‌ఫర్డ్‌తో తెలంగాణ ఒప్పందం చేసుకోనుందని వెల్లడి

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్ : అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తనకు జరిగిన అవమానం కాదని.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానమని అన్నారు. కేంద్రం తీరు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని విమర్శించారు. బ్రిటన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు.బ్రిటన్ పర్యటనకు అనుమతించారని, కానీ అమెరికా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వలేదన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్‌తో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నామని చెప్పారు.



వివరాలు 2లో..



## ఏపీ మద్యం రవాణా కేసు..

- నాంపల్లి కోర్టుకు కారుమూరి నాగేశ్వరరావు
- మద్యం రవాణా కాంట్రాక్టుల్లో అక్రమాలు జరిగాయంటూ కేసు
- కోర్టుకు తీసుకెళ్లే ముందు గాంధీ ఆసుపత్రిలో కారుమూరికి వైద్య పరీక్షలు
- ఇప్పటికే అరెస్ట్ అయిన కారుమూరి కుమారుడు సునీల్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కుంభ కోణం కేసులో అరెస్టయిన వైసీపీ నేత, మాజీ మంత్రి

- మిగతా 2లో..

ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు విలువ

# జోడిద్దాం



- అంతర్జాతీయ మార్కెట్లకు మన వ్యవసాయ ఉత్పత్తులు
- ఆంధ్రా పాప్ కార్న్, అరకు కాఫీ, కోస్తా కోకో గ్లోబల్ బ్రాండ్లుగా మారాలి
- దేశీయ రకం హైబ్రీడ్ పాప్ కార్న్ మొక్కజొన్న విత్తనాలు విడుదల
- ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు

ప్రజాభూమి ప్రతినిధి,నూజివీడు:

మన రాష్ట్రంలోని వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి విలువ జోడించే ప్రక్రియను చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు పిలుపునిచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రక్రియ ద్వారా ఉత్పత్తులకు విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలిగి సంపద సృష్టికి ఆస్కారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని సీఎం స్పష్టం చేశారు.

- మిగతా 2లో..

ఏలూరు జిల్లా ముసునూరు వద్ద గార్మె పాప్ కార్నికా నాన్ జీఎంఓ హైబ్రీడ్ మెయిజ్ విత్తనాలను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. గార్మె పాప్ కార్నికా సంస్థ ఏర్పాటు చేసి దేశంలోనే అతిపెద్ద జన్యుమార్పిడి కాని ఎక్స్ పాండబుల్ పాప్ కార్న్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఉపరాష్ట్రపతితో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ..." రైతులపై ఉన్న ప్రేమ, అభిమానంతో



భవనాలపై దుబారా వ్యయాన్ని తగ్గించి, పాఠశాలలను బాగు

## చేయండి

**సిజెపి**

న్యూఢిల్లీ : భవనాలపై దుబారా వ్యయాన్ని తగ్గించి, పాఠశాలల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర మంత్రుల అధికారిక నివాసాల నిర్వహణ కోసం గత ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ. 92.35 కోట్లు ఖర్చు చేశారని, ఆ నిధులతో 10 కొత్త ప్రభుత్వ పాఠశాలలను నిర్మించి ఉండవచ్చని 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) పేర్కొంది. కేంద్రం తప్పుడు ప్రాధాన్యతలకు పెద్దపీట వేస్తోందని మండిపడింది.

- మిగతా 2లో..

ప్రజలకు నీటి కొరత లేకుండా చర్యలు

# తీసుకుంటున్నాం

**నిమ్మల రామానాయుడు**

- హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ కాలువల ద్వారా రైతులకు నీటిని అందించామన్న నిమ్మల
- ప్రజలకు నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడి
- కర్నూలు జిల్లాకు 10 గురుకుల పాఠశాలలు మంజూరయ్యాయన్న మంత్రి



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఎల్‌నినో ప్రతికూల ప్రభావం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతన్నలను ఆదుకునేందుకు హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ కాలువల ద్వారా సాగు, తాగునీటిని అందించామని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రజలకు ఎటువంటి నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. రైజింగ్ స్టార్‌గా నిలిచిన నారా లోకేశ్ నాయకత్వంలో డ్రోన్ హబ్‌తో పాటు పలు పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. డీఎస్సీ ద్వారా త్వరలోనే మరిన్ని ఉద్యోగ నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. కర్నూలు జిల్లాకు రెండు విడతల్లో 10 గురుకుల పాఠశాలలు

2 లో



పులివెందుల తాగునీటి

# పథకానికి పునరుజ్జీవం

**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో తీరుతున్న పులివెందుల ప్రజల దాహార్తి**

- గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన మెగా వాటర్ గ్రిడ్ పథకంపై ఉప ముఖ్యమంత్రివర్యుల ప్రత్యేక దృష్టి
- జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధారల కింద సుమారు రూ. 280 కోట్ల కేటాయింపులు
- 96 శాతం ఓవరాల్ ప్రాజెక్టు పనులు.. 99 శాతం పైప్‌లైన్ నిర్మాణం పూర్తి - తుది అంకానికి నీటి శుద్ధి ప్లాంట్ పనులు
- పులివెందుల పట్టణం, గ్రామీణం, సింహాద్రిపురం మండలాల్లో 100 శాతం పూర్తయిన పనులు
- లింగాల మండల పరిధిలో 24 ఆవాసాలకు తాగునీటి సరఫరా

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి: జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార కింద రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన తాగునీటి ప్రాజెక్టులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించి నిర్లక్ష్యం చేసిన పథకాలకు సైతం ప్రత్యేక ప్రాధాన్యమిచ్చి ముందుకు తీసుకువెళుతున్నారు. వైఎస్సార్ కడప జిల్లా, పులివెందుల నియోజకవర్గంతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేసేందుకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను తిరిగి గాడిలో పెట్టి వేగవంతంగా పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దాదాపు రూ. 426 కోట్ల విలువైన 96 శాతం పనులు పూర్తి చేసి నిబద్ధత చాటుకున్నారు.

2 పేజీలో..

ప్రజాభూమి
మంగళవారం, ఆగస్టు 25, 2026


## సంపాదకీయం

### ధరాఘాతంపై సమీక్షించని పాలకులు

పాలక పార్టీలకు రాజకీయాలు తప్ప ప్రజల సమస్యలు పట్టడం లేదు. ఓట్లకోసం పథకాలను తీసుకుని వెళ్లడం, మధ్యతరగతి ప్రజలపై భారం మోపం తప్ప కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరు మారడం లేదు. రాజకీయ పార్టీలు కూడా ఉచిత హామీలపై పాలక పార్టీలను నిలదీయడం తప్ప, ధరలఅపై ధర్నాలు చేసిన సందర్భాలు కనిపించడం లేదు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెవలడమెలా అన్న ప్రణాళికలు సిద్ధం చేసుకుంటు న్నారు. ఇందుకు అధికారంలో ఉన్న ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. కేంద్రంలోని బిజెపి నేతృత్వం లోని ఎన్‌డిఎ తీరు కూడా అదే విధంగా ఉంది. తాము చేసిందే పాలన అన్న విధంగా ప్రచారం చేసుకుంటు న్నాయి. నిత్యావసర ధరలు మొదలు, సిమెంట్, విమానయాన ధరుల అందనంత ఎత్తుకు పోతున్నాయి. దీంతో పేద మధ్యతరగతి ప్రజలు నకరయాతన పడుతున్నారు. ఒకటని లేకుండా క్రమంగా ధరలు పెంచే స్తున్నారు. చక్కెర, బెల్లం, పూలు, పండ్లు.. ఇలా ప్రతి వస్తువు ధర అమాంతం పెరిగిపోతోంది. ఎల్‌నినో బూచి చూపి ఫైన్ రైస్ రకం బియ్యం అమాంతంగా పెంచేశారు. కిలో 80 రూపాయాలకు బియ్యం ధరలు ఎగబాకాయి. బహిరంగ మార్కెట్లో సన్నరకాల ధాన్యం లభ్యత తగ్గడం..కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటి ఇతర రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరగడం, సరఫరా వ్యవస్థలో ఒత్తిడి.. ధరల పెరుగుదలకు కారణాలని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మరోవైపు పౌరసరఫరాల సంస్థ అవసరాలకు మించి సేకరించిన ధాన్యం సుమారు 20 లక్షల టన్నుల వరకు ఉండగా..అందులో అధిక మొత్తంలో సన్నాలే ఉన్నాయి. ఈ వడ్లను వేలంలో అమ్మే పక్రియకు స్పందన రాకపోవడంతో సరకంతా మిల్లర్లు, గోదాముల దగ్గరే ఉండటం కూడా మరో కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. చింతపండు రెండువందలకు పైనే పెరిగింది, చక్కర ధరలు కూడా మెల్లగా పెంచుతూ.. అనూహ్యంగా పెరిగాయి. అందరూ ప్రీ డయాబిటిక్ కనుక వీటి ధరలు పెరిగినా ఫర్వాలేదని బీహార్‌కు చెందిన ఓ మంత్రి ఎకసక్కెంగా మాట్లాడారు. నిజానికి పాలకులు చేస్తున్న దుబారా ఖర్చులకు మాత్రం కళ్లెం పడడం లేదు. ఇలా చెప్పకుంటూ పోతే ఒక్కటేంటి వంటకు,పూజలకు ,పెళ్ళిళ్ళ వరకు అవసరమయ్యే అన్ని వస్తువుల ధరలు భగ్గుమంటున్నాయి. ఉల్లిగడ్డ నెలరోజుల్లోనే దాదాపు రెట్టింపైంది. జులై నాలుగో వారంలో కిలో రూ.22-26 ఉంటే.. ఇప్పుడు రూ.45-52కి చేరింది. జూన్ మొదటి వారంతో పోలిస్తే వెల్లుల్లి కిలో ధర రూ.120-130 నుంచి రూ.250 అంటే దాదాపు వంద శాతం వరకు పెరిగింది. ఎండుమిర్చి రూ.240 నుంచి రూ.300కి చేరింది. వంటనూనెల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. లీటర్ నూనె ప్యాకెట్ 175కు చేరింది. బెల్లం కేజీకి రూ.55 నుంచి రూ.70-75కి పెరిగింది. పండగలు, శుభాకార్యాల్లో పిండివంటలు తప్పనిసరైన నేపథ్యంలో ఇది మరో భారమైంది. ఇక పెళ్లిళ్లు.. బోనాలు, శ్రావణమాస పూజల నేపథ్యంలో పూలకు గిరాకీ ఏర్పడగా..వ్యాపారులు దాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. బోనాలు ఒక్కో ప్రాంతంలో ఒక్కోసారి జరుగుతుండటంతో ఆ సమయాల్లో ప్రాంతాల వారీగా పెంచేస్తు న్నారు. బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కనీసం పుస్తెలు చేయించే పరిస్తితి కూడా లేకుండా పోతోంది. బంగారనం ధరల మాఫియా ప్రపంచాన్ని శాసిస్తోంది. బంగారం షాపుల వారు కల్తీల, తరుగు, జిఎస్టీ పేరుతో దోచేస్తున్నారు. పెళ్లి బడ్జెట్‌లో బంగారం పెద్ద భాగం. పెరిగిన ధరలతో మంగళసూత్రం సహా ఆభరణాల కొనుగోలు ఖర్చు తలచుకుంటేనే భయమేస్తోందని పెళ్లిళ్లు చేసే కుటుంబాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి. ఇక నిత్యం వాడుకునే ఉల్లిగడ్డ ధరలు కూడా అనూహ్యంగా పెరిగాయి. కిలో 45కు తక్కువగా అమ్మడం లేదు. ఇదే కోవలో ఎండుమిర్చి, వెల్లుల్లి ధరలు కూడా భయపెడుతున్నాయి. ఇలా చెప్పకుంటూ పోతే ధరల జాబితా చాంతాండంత తయార వుతోంది. ఇక ఇల్లు కట్టుకునాలనుకునే వారికి సిమెంటు,స్టీలు, ఇటుక, ఇసుక ధరలు చిర్రెత్తిస్తున్నాయి. ఇకపోతే మందుల ధరలు, ఆస్పత్రుల ఖర్చులు చెప్పాల్సిన పనిలేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే నిత్యావసర ధరల పెరుగుదల కారణంగా సామాన్యుడి నెలవారీ ఇంటి ఖర్చు అమాంతంగా పెరగడంతో తలపట్టుకునే పరిస్థితి వచ్చింది. అయితే ఉత్పత్తి తగ్గడం, సరఫరా ప్రభావం వంటికారణాలతో వ్యాపారులు రోజుకో లెక్క చెబుతున్నారు. ఇలా ధరలు పెరుగుతున్నా కేంద్ర రాష్ట్రాలు సమీక్షించడం లేదు. ధరల అదుపునకు చర్యలు తీసుకోవడం లేదు. వ్యాపారులను నిలదీయడం లేదు. జనాభాకు తగ్గట్లుగా పంటుల పండుతున్నాయా లేదా అన్నది చూడడం లేదు. దేశంలో ఏయే పంటలు ఎంత పండుతున్నాయి..ఎంతెంత నిల్వలు ఉంటున్నాయో లెక్కలు వేయడం లేదు. ఏ సరుకు ఎక్కడి నుంచి ఎక్కడికి పోతేందో గమనించడం లేదు. బ్లాక్ మార్కెటీర్లను అదుపు చేయడం లేదు. ఇక విమాన ప్రయాణాన్ని సామాన్యులకు చేరువ చేస్తామిన గొప్పలు చెబుతున్న మోడీ సర్కార్ విమాన ధరలను గమనించడం లేదు. విమాన సంస్థలు మూతపడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇలాంటి వారంతా పాలకులుగా ప్రజలకు ఏం సందేశం ఇస్తారో చెప్పాలి. నిరసనలు చేసేవారు ధరల పెరుగుదలపై నిలదీయాలే తప్ప రాజకీయ ప్రయోజానాల కోసం కాదు. విపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తన బాధ్యతను పూర్తిగా విస్మరించింది. పార్లమెంట్ సమావేశాలను కేవలం ఆందోళనతో భ్రష్టు పట్టించింది. ఇది కూడా ప్రజలపై భారం మోపే చర్య తప్ప మరోటి కాదు. ఇవన్నీ కూడా ప్రజలు గమనించాలి. ప్రజాప్రతినిదులు వచ్చినప్పడు ప్రలే నిలదీయాలి. అప్పడైనా చలనం వస్తుందేమో చూడాలి.

# మేడం స్వర్ణలత..స్వర్ణలతమేడం నే..!

జోన్ 2 ఆర్జేడీ గా బాధ్యతలు వెలగబెట్టి కొన్ని పత్రికల సంపాదకుల జీవితాలతో చెలగాటం ఆడుకుని కనపడని పత్రికలకు , ప్రింటింగ్ లేకుండా డిజిటల్ జిరాక్స్ పేపర్స్ ఇస్తే పుచ్చుకుని ఇచ్చినమ్మ వాయనం అంటే పుచ్చుకున్న వాయనం అనే రీతిలో తన ఉద్యోగ చరమాంకం లో చేసిన పనులు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పత్రికా ప్రపంచం సిగ్గుతో తలదించుకుని అసహ్యాహించుకునేలా పరిస్థితి తయారు కావడానికి కారణం అయ్యిందనన్న అపవాదు మూటగట్టుకుని దుశ్శా ళువాతో సన్మానం పొంది హాయిగా శేష జీవితం గడుపుతూ కొందరి జీవితాల్లో చీకటి నింపిన గొప్ప మహనీయురాలని చెప్పక తప్పడం లేదు. ఇలా ఎందుకు అనాల్సి వస్తుందయ్యా అంటే అందుకు గల కారణాలుగా ఆమె పరిపాలన స్వర్ణయుగంలా చేయడం మూలాన సమాచార శాఖ కు ఏవిధమైన గొప్ప ప్రతిష్టాత్మక అవార్డు లు ఇవ్వాలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆలోచన లో పడి అందుకోసం ఇప్పటికీ సమాలోచనలు చేస్తున్నారన్న ప్రచారం జరుగుతూ ఉందని ఈ రాష్ట్రం లో ఉండే సంపాదకీయ వర్గంలో తీవ్ర చర్చ జరుగుతోంది. మరి ఇప్పుడే ఇవన్నీ బహిర్గతం అవ్వడానికి గల కారణాలు ఏమిటో అన్న వాదన కూడా అడ్డగోలు గా లబ్ది పొందుతున్న పొందిన అలా లబ్ది పొందడానికి సమాచార శాఖ అధికారుల నియమించుకున్నారో లేదో తెలియదు కానీ చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్న చందాన ఎంప్యానల్మెంట్ తామే చేయిస్తున్నామని సమాచార శాఖ మంత్రి తమ జాతి బిడ్డ అని వృద్ధ నారీమనుడు ఒకడు గత డైరెక్టర్ ఉండి ఉంటే అక్రెడిటేషన్ కమిటీలో ఆకు ఇంకొకటి లేని యునియన్ పేరుతో ఉత్తుత్త ఉత్తరాలు రాస్తూ ఇస్తూ అన్ని రకాల పనులు చేస్తూ ఎవరికి ఎంత ముట్ట చెప్పాలో తెలియ జేస్తూ ఏ అధికారి హోదా కు ఏమి ఇవ్వాలో వివరిస్తూ లేచింది మొదలు నిద్రపోయే వరకు అన్ని రకాలుగా బ్రోకరిజం చేస్తూ సమాచార శాఖ అధికారులను సగం అభాసుపాలు చేస్తూ పబ్బం గడుపుపుకుంటున్న వాడు ఇంకొకడు. వీరందరికీ ముఠా నాయకుడు ఇంకొకరు ఆయన కులం మతం జాతి అంటూ జాగ్రత్తగా మధ్యర్తిత్వం చేస్తూ సమాచార శాఖ అధికారుల కు పత్రికా యజమానులు మధ్య సఖ్యత లేకుండా చేసి అయోచిత లబ్ది పొందుతూ అక్రమార్కులకు అండగా ఉంటున్నారనే ప్రచారం జరుగుతూ ఉందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ గత రెండు రోజుల క్రితం హైకోర్టులో సమాచార శాఖ పై రిట్ పిటిషన్ దాఖలయైన తరువాత అదికూడా సీబీఐ లేదా విజిలెన్స్ అధికారుల ద్వారా ఖచ్చితమైన విచారణ జరిపించి ప్రకటనల ద్వారా అక్రమార్కులకు కట్టబెడుతున్న ప్రజాధనాన్ని నియంత్రించి ఇప్పటికే కట్టబెట్టిన దాదాపు యాభై లక్షల రూపాయలు ప్రజాధనాన్ని రికవరీ చేసి సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరగా హైకోర్టులో పరిశీలన ఉండగా పైన చెప్పబడిన అంశాలకు ప్రాధాన్యత సంతరించుకున్నదనే భావన వ్యక్తం అవుతోంది. ఇక అసలు విషయం లోకి వస్తే మేడం స్వర్ణలత ఎలా తన పాలనలో పత్రికల ద్వారా స్వర్ణమయం స్వర్ణమయం చేసుకున్నారో లోతుగా అధ్యయనం చేస్తే కూటమి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా సమాచార శాఖ లో ఏంఫ్యానల్ అయి ఉన్న డెబ్బైఐదు చిన్న పత్రికలకిప్రకటనలు ఇవ్వగా అందులో ముప్పై నాలుగు పత్రికల వారు మాత్రమే ప్రచురణ చేసి ఆయా పత్రికలను సమాచార శాఖ డైరెక్టరేట్ కు సమర్పించడం జరిగిందని మిగిలిన నలభై ఒక్క పత్రికలకు అసలు ఈ ప్రకటనలు ఇచ్చారనే విషయం కూడా తెలియకపోయిందని వారికి పంపిన మెయిల్స్ కూడా పనిచేయడం లేదనే విషయాన్ని సదరు అధికారులు గుర్తించినట్లు కింది సిబ్బంది తెలిపిన్ సమాచారం ప్రకారం తెలుస్తోంది. ఇదే క్రమంలో రెండవ ప్రకటన విడుదల చేసినప్పుడు 28 పత్రికలే రెగ్యులర్ గా ఉన్నట్లు బహిర్గతం అయినట్లు కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. ఈ రెండు ప్రకటనలు కూడా జాయింట్ డైరెక్టర్ కస్తూరి హయంలో ఇచ్చినట్లు చెప్పక వస్తున్నారు. ఆ తదనంతరం జోన్ 2 ఆర్జేడీ గా ఉన్న స్వర్ణలత అడిషనల్ డైరెక్టర్ ఇంచార్జి గా అసీనులు అవ్వడం కస్తూరిని వైసిపి సానుభూతి పరుల జాబితాలో చేర్చి ఆ శాఖ అధికారుల తప్పుడు ప్రచారం తో పదకొండు నెలలు ఉద్యోగం లేకుండా ఇంటికే పరిమితం చేసిన విషయం తెలిసిందే. ఇక డైరెక్టరేట్ కార్యాలయం లో కేవలం జేడి అడ్మిన్ కిరణ్ కుమార్,జేడి మీడియా రిలేషన్స్ సూర్యచంద్ర రావు ఉండగా జేడి ప్రకటనలు , అడిషనల్ డైరెక్టర్ ఇంచార్జి,జోన్ 2 ఆర్జేడీ కూడా మేడం స్వర్ణలత తన హవ్వా కొనసాగింపు లో బాగంగా అసలు రెగ్యులారిటీ అనే వాటి మీద కంప్లైంట్ లేకుండానే విచారణ చేయడం జరిగిందని ఆ విచారణ లో గత ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో కేవలం ఇరవై మూడు పత్రికలే చావు బతుకులు మధ్య రెగ్యులర్ గానే ఉన్నాయని తేలినట్లు మేడం స్వర్ణలత నిర్ధారణ వచ్చారని చెబుతూ రెగ్యులర్ లేని వారికి నోటీసులు కానీ , ఏంఫ్యానల్ రద్దు చేయడం కానీ జరగకుండా విడతల వారిగా యాబై పత్రికలను రెగ్యులరైజ్ చేస్తూ ప్రకటనలు ఇచ్చారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ ప్రధానంగా ఆలోచన ,ఆచరణ చేసే విషయం ఏమిటంటే ఏ కార్యాలయం అయినా ఏ పని అయినా ఒక ప్రభుత్వ అధికారి కానీ ప్రవేటు కంపెనీ కానీ ప్రజా ఉపయోగాల కోసం చేస్తున్నపుడు ప్రతిదీ కూడా కాగితం రూపంలో ఉంటుంది. పలాన పని పై విదంగా ...ఆ నిమిత్తం ఇలా విచారణ చేయడం జరిగిందని ఇందులో వాస్తవాలు ఇలా ఉన్నాయని పుస్తకం సమాధానం చెప్పే విధంగా ఉండడం అనేది ఆయా శాఖల అధికారుల పారదర్శక పాలన కు నిదర్శనంగా ఉంటుందనేది బహిరంగ సత్యం. కానీ ఒక్క సమాచార శాఖ డైరెక్టరేట్ కార్యాలయం లో మాత్రమే నియంత పాలన అనాలో లేక లెక్కలేని తనమో లేక ఇంకేదయినా అనాలో తెలియదు కానీ ఒక ఆరోపణ,విమర్శ వస్తె అవి కూడా ఆధారసహితంగా ఉన్నా కూడా ఈ అధికారుల నుంచి కనీస చర్యలు కానీ సమాధానం చెప్పే పరిస్థితి లేక పొగ పలానా వ్యక్తి ఈ ప్రభుత్వం అధికారంలో ఉంటే ప్రతిపక్ష పార్టీ నేతల బంధువని,లేదా బ్లాక్ మెయిల్,వైట్ మెయిల్ ,లేదా గాలి మాటలని,గాలి వార్తలని నిస్సిగ్గుగా ఉన్నతాధికారులను కూడా బురిడి కొట్టించి ఐఏఎస్ లను కూడా చివరికి పత్రికల వారి దృష్టిలో చెడు భావన కలిగే విధంగా చేయడం ఈ శాఖ అధికారులకే చెల్లుబాటు అయినట్లు ఈ రాష్ట్రం లో ఉన్న ఏ ఇతర శాఖల కు వర్తించదని చెప్పడం లో సందేహం అక్కర్లేదు. ఈ విషయాలపై వివరణ కోరినా లేక కింది స్థాయి సిబ్బందిని అడిగినా ఎవరి వారి వారి స్వలాభం కోసం ఫోన్ పే క్యాస్ పే ఇలా జేబులు నింపుకుంటూ చెప్పేది శ్రీరంగ నీతులు చేసేది .... అన్నట్లు గా పరిస్థితి దాపురించిందని చెప్పక తప్పదు. ఇక పోతే మేడం స్వర్ణలత పరిపాలన స్వర్ణయుగంలా చేసుకుని చివరి పది రోజుల్లో నిస్సిగ్గుగా అడ్డగోలుగా అర్హత అన్న మాట లేకుండానే అడిగేవాడు లేడన్న రీతిలో మేడంతో లాలూచీ పడ్డ వారికి ఎంప్యానల్మెంట్ చేసి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయాలని చూసిందని కొంతమంది హైకోర్టు లో రిట్ పిటిషన్ దాఖలు చేస్తూ గతంలో లోకాయుక్తా లో కేసు విచారణ ఉన్నా ముఖ్యమంత్రి కార్యాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సమాచార శాఖ ప్రధాన కార్యదర్శి, సమాచార శాఖ డైరెక్టర్ , విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులకు పిర్యాదు చేసిన ఈ సమాచార శాఖ అధికారులకు నిమ్మకు నీరెత్తినట్లు ఉందని కూటమి ప్రభుత్వం వచ్చాక ఇరవై మూడు పత్రికల నుంచి నేటి వరకు ప్రకటన ద్వారా లబ్ధి పొందుతూ ఉన్న వారి పత్రికలపై సిబిఐ లేదా విజిలెన్స్ అధికారులు ద్వారా సమగ్ర విచారణ జరిపి ప్రింటింగ్ పత్రికల ముసుగులో డిజిటల్ జిరాక్స్ పేపర్స్ ఇస్తూ లోపాయి కారి ఒప్పందం కుదుర్చుకున్న అధికారుల అవినీతి బాగోతం బట్టబయలు చేసి తగిన చర్యలు తీసుకుని నాల్గో స్తంభం ముసుగులో దోపిడీ చేస్తున్న వారిని కూడా శిక్షించాలని అసలు రెగ్యులారిటీ విషయం లో పేపర్ ప్రింటింగ్ ప్రెస్ ద్వారా ముద్రణ అయ్యిందా లేదా అన్న నిర్ధారణ కోసం పీఆర్జీ ఐ డైరెక్టర్ ను కూడా పార్టీని చేసినట్లు కూడా తెలుస్తోంది. మరి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు ఏ విధంగా ఉండబోతుందనేది వేచిచూడక తప్పదు.

# ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు విలువ జోడిద్దాం

ఏలూరు జిల్లాకు వచ్చి రైతులు పండిస్తున్న జన్యుమార్పిడి జరగని మొక్క జొన్న విత్తనాలను ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు. గార్మె పాప్ కార్న్ సంస్థ భారత నేలపైనే దేశీయంగా జన్యుమార్పిడి జరగని విత్తనాలను రైతులతో కలిసి ఉత్పత్తి చేస్తోంది. మన నూజివీడు గడ్డ నుంచే పండే పాప్ కార్న్ మొక్క జొన్న దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలతో పాటు ఇతర దేశాలకూ ఎగుమతి అవుతుంది. గార్మె పాప్ కార్న్ దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ఉత్పత్తి సంస్థగా అవతరించింది. ఈ సంస్థ ప్రతినిధుల్ని అభినందిస్తున్నాను. 17,500 మంది రైతులతో 40 వేల ఎకరాల్లో ఈ నాన్ జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్న ఉత్పత్తి చేస్తున్నారు. నూజివీడు సమీపంలోని ముసునూరు వద్ద దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ప్రాసెసింగ్ ప్లాంట్ ను ఏర్పాటు చేయటం సంతోషదాయకం. దేశవ్యాప్తంగా పాప్ కార్న్ ఉత్పత్తిలో 70 శాతం వాటాను కలిగి ఉన్న గార్మె సంస్థకు అభినందనలు. యాంత్రీకరణ, విత్తనాలు, సాగులో సాంకేతికత, రైతుల నుంచి మొక్క జొన్న కొనుగోలు ఇలా అన్నీ వ్యవస్థీకృతంగా ఉన్నాయి. ఇప్పటి వరకూ మనం కొనుగోలు చేసిన పాప్ కార్న్‌పై పెద్ద ఎత్తున బ్రెజిల్ సహా ఇతర దేశాలకు వెళ్లింది. ఇక నుంచి మన దేశంలోనే ఈ సంపద ఉంటుంది. ఒక్క ఆసియానే కాదు గ్లోబల్ మార్కెట్ కు కూడా మన పాప్ కార్న్ ఎగుమతి కావాలి. ఆంధ్రా పాప్ కార్న్, అరకు కాఫీ తాగేలా రైల్వే స్టేషన్లలోనూ కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం. కొండవీటి కొయ్య బొమ్మలు లాంటి స్వదేశీ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు వెళ్లాలి. కేంద్రం, రాష్ట్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ఆర్ధిక శక్తిగా, రైతుల్ని ఎంట్రప్రెన్యూర్లుగా చూస్తున్నాం. రైతులు ఉత్పత్తి చేసిన పంటలకు విలువ జోడించి ఎగుమతి చేయాలన్నదే మా లక్ష్యం. పసుపు, మిరప, మొక్క జొన్న, ఆక్వా తదితర ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌కు చేరాలి. వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెస్ చేసి విలువ జోడించి ఓ మంచి బ్రాండ్‌తో అంతర్జాతీయ మార్కెట్లకు తరలిద్దాం. అప్పుడే విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుంది.” అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ప్రాసెసింగ్ పెరిగితేనే ఉత్పత్తులకు విలువ :**

“ప్రస్తుతం మన రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న వాటిలో కేవలం 10 శాతం మాత్రమే ప్రాసెసింగ్ చేయగలుగుతున్నాం. ప్రాసెసింగ్ పెంచితే అధిక సంపదను ఆర్జించే అవకాశం ఉంటుంది. ప్రత్యేకించి యువత ఈ రంగంపై దృష్టి పెట్టాలి. ప్రతి కుటుంబంలో ఓ పారిశ్రామిక వేత్త రావాలి. మన వద్ద ఉత్పత్తి అయ్యే వాటిని గ్లోబల్ ప్రాడెక్టుగా అభివృద్ధి చేయాలి. ఆహారపు అలవాట్ల అనుగుణంగా పంటలు కూడా మారాలి. నూజివీడు వద్ద ఇప్పుడు పామాయిల్, కోకో ఆక్వా లాంటి వాణిజ్య పంటలు పెరిగాయి. వ్యవసాయంతో పాటు ఉద్యాన పంటల్లో మనం అగ్రగామిగా మారాం. వచ్చే 20-30 ఏళ్లలో ఎలాంటి పంటలు ఉండాలి, ఎలాంటి ఆర్ధిక వ్యవస్థ ఉండాలో మనం నిర్దేశించు కుందాం. రాయలసీమను కూడా ఉద్యాన పంటల హబ్ గా మార్చేలా కార్యాచరణ చేపట్టాం. రూ.1 లక్ష కోట్ల వ్యయంతో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమను అభివృద్ధి చేస్తున్నాం. రూ.35 వేల కోట్లతో 36 సాగు ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేస్తాం. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉన్నా గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి పంటలను కాపాడాం. చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేస్తే ఈ ప్రాంత భవిష్యత్తు కూడా మారుతుంది. వెలిగొండ ప్రాజెక్టు ను ఈ నెలాఖరులోనే ప్రారంభించి మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాకు నీరు ఇస్తాం. ఎల్ నినో వల్ల నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉంది. పప్పు ధాన్యాల లాంటి ప్రత్యామ్నాయ పంటలు వేసేలా చర్యలు చేపట్టాం.

రైతులు కూడా సహకరించి సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిస్తున్నాను. నీటి భద్రత సాధించి ప్రతి ఎకరాకూ నీరు ఇచ్చేలా చర్యలు చేపడతాం. దేశం అంతా నదుల అనుసంధానం జరిగి నీటి సద్వినియోగం జరగాలన్నది ఎన్డీఏ ప్రభుత్వ ఆలోచన. గోదావరి- కృష్ణా, తుంగభద్ర, పెన్నా- కావేరీ నదులను అనుసంధానించటం ద్వారా 4 రాష్ట్రాల్లో సమస్య పరిష్కారం అవుతుంది. కష్టకాలంలో అన్ని ప్రాంతాల్లో ఆయకట్టు స్థిరీకరణ, తాగునీరు అందించే అవకాశం ఉంటుంది. గంగా, మహానది, గోదావరి నదుల్ని కూడా అనుసంధానించుకుంటే వేల టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకోగలం. అప్పుడు దేశానికి తిరుగులేదు. నీటి భద్రత సాధిస్తే దేశ అభివృద్ధి అన్ స్టాపబుల్.” అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు నారాలోకేష్, కె. అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారధి తదితరులు హాజరయ్యారు.

## నాలుగు కోట్ల తెలంగాణ

# ప్రజలను కేంద్రం అవమానించింది

తన పర్యటనలో ఎలాంటి దాపరికం లేదని స్పష్టం చేశారు. ఏదైనా దాపరికం ఉందని విదేశాంగ శాఖ భావిస్తే అందుకు కారణాలను స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. విదేశాల్లో ఉన్నప్పుడే ఈ అంశంపై స్పందిస్తే తనను దేశద్రోహి అంటారని రేవంత్ అన్నారు. అందుకే భారత్‌కు తిరిగొచ్చిన తర్వాత స్పందిస్తున్నానని చెప్పారు. తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడమే తన పర్యటన ఉద్దేశమని తెలిపారు. అమెరికా పర్యటనకు తాను వెళ్లలేకపోయినా రాష్ట్ర అధికారులు అక్కడికి వెళ్లారని రేవంత్ చెప్పారు. పెట్టుబడులు, అంతర్జాతీయ సంస్థలతో సంబంధాల విషయంలో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకోబోతున్నామని తెలిపారు. గుజరాత్ సీఎంకు విదేశీ పర్యటనలకు అనుమతులు ఇస్తున్నారని రేవంత్ అన్నారు. తెలంగాణ సీఎంకు మాత్రం ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇది వివక్షకు నిదర్శనమని ఆరోపించారు. గుజరాత్ గుత్తాధిపత్యానికి ఇదే ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడాన్ని అడ్డుకోవడమే కేంద్రం నిర్ణయం ఉద్దేశమని రేవంత్ విమర్శించారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు గుజరాత్‌కు మద్దతు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధి బీజేపీ ఎంపీలకు అవసరం లేదా అని నిలదీశారు.

## ప్రజలకు నీటి కొరత

# లేకుండా చర్యలు తీసుకుంటున్నాం

మంజూరయ్యాయని, వచ్చే ఏడాది ఆలూరుకు మరొక గురుకులాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే జిల్లాలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు కృషి చేయడంతో పాటు, బీసీల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని వివరించారు. రాయలసీమ ప్రాజెక్టుల అంశాలపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని మండిపడ్డారు. గత ఐదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులకు చేసిన ఖర్చుపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త ఇళ్లు, పింఛన్లను అందజేస్తామని ప్రకటించారు.

## ఏడాదికి మూడు ఎల్‌పిజి

# సిలిండర్ల ఖర్చు తిరిగి చెల్లింపు

లబ్ధిదారులు ఎల్‌పిజి సిలిండర్ కొనుగోలు చేసిన అనంతరం, సంబంధిత వివరాలను చమురు కంపెనీల నుంచి సేకరించి, సిలిండర్ ఖర్చుకు సంబంధించిన మొత్తాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని విజయ్ తెలిపారు. ఈ పథకం ద్వారా తక్కువ ఆదాయ కుటుంబాలపై వంటగ్యాస్ వ్యయ భారాన్ని తగ్గించడమే లక్ష్యమని చెప్పారు. తమిళనాడు అసెంబ్లీలో సోమవారం చేసిన ప్రకటనలో ఈ పథకాన్ని తొలి దశలో ఏడాదికి మూడు ఉచిత ఎల్‌పిజి సిలిండర్లతో అమలు చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం (టీవీకే) ఎన్నికల సమయంలో ఏడాదికి ఆరు ఎల్‌పిజి సిలిండర్లు అందిస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే.

# పులివెందుల తాగునీటి పథకానికి పునరుజ్జీవం

మొదటి పేజీ తరువాయి

**గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం :** ఏడు మండలాల పరిధిలో ఐదున్నర లక్షల మంది ప్రజల దాహార్తి తీర్చే లక్ష్యంతో రూ. 480 కోట్ల అంచనా వ్యయంతో జల్ జీవన్ మిషన్ కింద ప్రారంభమైన పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకం పనులు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమృద్ధిగా ఉన్నప్పటికీ పనులను ముందుకు తీసుకువెళ్లే అంశంలో శ్రద్ధ చూపలేదు. చేపట్టిన పనుల్లో కూడా నాణ్యత లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జల్ జీవన్ మిషన్ పనుల మీద జరిగిన తొలి సమీక్షలోనే శ్రీ పవన్ కళ్యాణ్ గారు గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పథకాలను సైతం ప్రాధాన్య క్రమంలో ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి జల్ జీవన్ మిషన్ గడువు కూడా పూర్తి కావడంతో, కేంద్రం వద్ద ఉన్న మిగులు నిధులు ఖర్చు చేసేందుకు వీలు లేకుండా పోయింది. ఉప ముఖ్యమంత్రివర్యులు, కూటమి నాయకులు చేసిన ప్రయత్నాల ఫలంగా జల్ జీవన్ మిషన్‌ను మరో 4 ఏళ్ల పాటు పొడిగించేందుకు కేంద్రం అంగీకారం తెలపడంతో పులివెందుల మెగా తాగునీటి సరఫరా పథకం తిరిగి ఊపిరి పోసుకుంది. అప్పటి నుంచి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో దాదాపు రూ. 280 కోట్లు ఒక్క పులివెందుల పథకానికే కేటాయించి వేగంగా పనులు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో అరకొర పైప్‌లైన్లు వేయడం మినహా పెద్దగా పనులేమీ పూర్తి కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 96 శాతం పనులు పూర్తి చేశారు. అందులో పులివెందుల, సింహాద్రిపురం మండలాలకు ఇప్పటికే ఈ పథకం ద్వారా తాగునీరు అందుతోంది. పులివెందుల పట్టణానికి సంబంధించిన పనులు కూడా 100 శాతం పూర్తయ్యాయి. లింగాల మండలం పరిధిలో 27 ఆవాసాలకు గాను 24 ఆవాసాలకు త్వరలో తాగునీరు అందుతోంది. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో కీలకమైన ఇంటేక్ వెల్ పునరుద్ధరణ పనులు పూర్తి కాగా, 65 మిలియన్ లీటర్ల నీటి శుద్ధి ప్లాంట్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. 1,111 కిలోమీటర్ల పైప్‌లైన్‌కు గాను 1,106 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయ్యింది. ఓవర్‌హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ల నిర్మాణం కూడా దాదాపు తుది దశకు చేరింది. కూటమి ప్రభుత్వం తాగు నీరు వంటి ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లాలని పవన్ కళ్యాణ్ చేసిన నిర్దేశం మేరకు పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పనులను గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు వేగంగా ముందుకు తీసుకువెళ్తున్నారు.

## భవనాలపై దుబారా వ్యయాన్ని తగ్గించి,

# పాఠశాలలను బాగు చేయండి



డబ్బు అందుబాటులో ఉందని, కానీ పాఠశాలల విషయంలో కేంద్రానికి చిత్తశుద్ధి లేదని ఉద్దేశ్యం మాత్రం లేదని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. మంత్రులు నివసిస్తున్న వలసవాద కాలం నాటి బంగళాలపై పెరుగుతున్న ఖర్చు గురించి వచ్చిన నివేదికపై సిజెపి కన్వీనర్ అభిజీత్ దీప్కే స్పందిస్తూ.. “మీ విలాసవంతమైన ఇళ్లను బాగుచేయించడం ఆపి, పాఠశాలలను బాగుచేయండి!” అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఢిల్లీలో కేంద్రమంత్రుల అధికారిక భవనాల ఆధునీకరణ, ఫర్నిచర్, మరమ్మత్తుల కోసం 2014-15లో 27.47 కోట్లు ఖర్చు చేయగా, 2025-26 నాటికి 92.35 కోట్లకు పెరిగిందని ఆర్‌టిఐ సమాధానమిచ్చింది. ఈ భవనాల ఆధునీకరణ, మరమ్మత్తుల కోసం 2014-15నుండి 2025-26 వరకు సుమారు 12 ఏళ్లపాటు మొత్తంగా రూ547.68 కోట్లు ఖర్చు చేసినట్లు సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సిపిడబ్ల్యుడి) సమాధానమిచ్చింది. ఇటీవల ఈ ఖర్చు గణనీయంగా పెరిగింది. 2014-15, 2018-19 మధ్య ఏడాదికి సగటున రూ.26.78 కోట్లు ఖర్చు చేయగా, 2019-20, 2023-24 మధ్య రెట్టింపై రూ.50 కోట్లకు చేరుకుంది. అలాగే 2024-25లో రూ.71.98 కోట్లకు పెరగగా, గతేడాది 92.35 కోట్లకు చేరింది. ఈ ఖర్చుల అంశాన్ని ముఖ్యమంత్రిగా అరవింద్ కేజ్రీవాల్ నివసిస్తున్న అధికారిక నివాసం నిర్మాణం, పునరుద్ధరణపై చెలరేగిన వివాదంతో పోల్చుతూ, ఆప్ నేత, ఢిల్లీ మాజీ మంత్రి సోమనాథ్ భారతి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేజ్రీవాల్ నివాస నిర్మాణం విషయంలో ఆప్ ప్రభుత్వాన్ని విమర్శించడానికి ఏ అవకాశాన్నీ వదలని ‘గోడీ మీడియా’ (అనుకూల మీడియా), మోడీ ప్రభుత్వంలోని మంత్రుల ఇళ్ల మరమ్మతుల కోసం జరిగిన ఈ 92 కోట్ల భారీ ఖర్చుపై ఎందుకు చర్చించడం లేదని కేంద్రాన్ని నిలదీశారు.

## ఏపీ మద్యం రవాణా కేసు..

కారుమూరి నాగేశ్వరరావును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు నాంపల్లి కోర్టుకు తరలించారు. ఈడీ కార్యాలయం నుంచి కోర్టుకు తీసుకెళ్లే ముందు ఆయనకు గాంధీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు.

మద్యం రవాణా కాంట్రాక్టుల కేటాయింపుల్లో భారీగా అక్రమాలు జరిగాయని, ఈ అక్రమాల ద్వారా పెద్దమొత్తంలో ఆర్థిక లబ్ధి పొందినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటికే కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్‌కుమార్, అలాగే వాసుదేవరెడ్డి, రాజ్ కెసిరెడ్డిలను అధికారులు అరెస్టు చేశారు. సోదాల సమయంలో సునీల్‌కుమార్ నివాసం నుంచి విలువైన రోలెక్స్ వాచీలతో పాటు రేంజ్‌రోవర్ వాహనాన్ని ఈడీ స్వాధీనం చేసుకుంది. అంతేకాకుండా, ఈ కేసు విచారణలో భాగంగా కారుమూరికి చెందిన రూ.87.7 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ ఇప్పటికే జప్తు చేసింది. నాంపల్లి కోర్టులో నిందితులను హాజరుపరిచిన అనంతరం తదుపరి విచారణ నిమిత్తం కస్టడీకి కోరే అవకాశం ఉంది.

ప్రజాభూమి


ఎన్టీఆర్, కృష్ణా

మంగళవారం, ఆగష్టు 25, 2026

3

# ఉపరాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు

## వీడ్కోలు పలికిన గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, ఆర్టిజిఎస్ శాఖల మంత్రి నారా లోకేష్



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

ఏలూరు జిల్లాలో కార్యక్రమం ముగించుకుని ఢిల్లీకి తిరుగు ప్రయాణమైన భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, ఆర్టిజిఎస్ శాఖల మంత్రి నారా లోకేష్, రాష్ట్ర వైద్య ఆరోగ్య, వైద్య విద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఇతర అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. సోమవారం మధ్యాహ్నం 2:25 గంటలకు భార త ఉపరాష్ట్రపతి ప్రత్యేక విమానంలో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఢిల్లీకి తిరుగు ప్రయాణమయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్య దర్శి బుడితి రాజశేఖర్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, ఏలూరు రేంజ్ ఐజి జివిజి అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు, శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, రాష్ట్ర ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు తదిత రులు ఉపరాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు పలికారు.

# విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయమునకు భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

## ఘన స్వాగతం పలికిన గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, మంత్రి నారా లోకేష్, మంత్రి కొలుసు పార్థసారథి ఇతర ఉన్నతాధికారులు..



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

ఏలూరు జిల్లా ముసునూరులో పర్యటన నిమిత్తం సోమవారం ఉదయం 9:45 గంటలకు విజ య వాడ అంతర్జాతీయ విమానాశ్రయమునకు చేరుకున్న భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధా కృష్ణన్ కు ఘన స్వాగతం లభించింది. ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, ఆర్టిజిఎస్ శాఖల మంత్రి నారా లోకేష్, రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఇతర ఉన్నతాధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, ఏలూరు రేంజ్ ఐజి జివిజి అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ నమ్రత అగర్వాల్, శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, రాష్ట్ర ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు, శాసన మండలి సభ్యుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్, గుడివాడ శాసనసభ్యుడు వెనిగండ్ల రాము, పెడన శాసనసభ్యుడు కాగిత కృష్ణప్రసాద్, పెనమలూరు శాసనసభ్యుడు బోడె ప్రసాద్, పామర్రు శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా, ఎయిర్పోర్ట్ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి తదితరులు ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆయన ప్రత్యేక కాన్వాయ్ లో రోడ్డు మార్గాన ఏలూరు జిల్లాకు బయలుదేరి వెళ్లారు.

# శరవేగంగా కొత్తపేట రోడ్డు నిర్మాణ పనులు

## నెరవేరుతున్న చిరకాల వాంఛ కొత్తపేట వాసుల హర్షం



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

అవనిగడ్డ గ్రామ పంచాయతీ పరిధి లోని కొత్తపేట నుంచి కోడూరు ఆర్. అండ్.బీ రోడ్డు వరకూ ప్రధాన రహదారి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సుమారు కిలో మీటరు పొడవుగల రోడ్డు నిర్మాణ పనులను గుత్తేదారు ప్రారంభించారు. రూ.55 లక్షలతో నూతన రోడ్డు నిర్మాణం జరుగుతోంది. దెబ్బ తిన్న రహదారిని పొక్లెయినుతో పగలగొట్టి కంకర, ఫ్లైయాష్ వేసి రోలింగ్ చేయించారు. త్వరలో దానిపై తారు రోడ్డు వేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేక శ్రద్ధతో నియోజకవర్గంలో అనేక ప్రధాన రహదారులు, గ్రామీణ రహదారులు, అంతర్గత రహదారులకు మోక్షం కలుగుతోంది. కూటమి ప్రభుత్వం సహకారంతో ఇప్పటికే నియోజకవర్గంలో అనేక రహదారులు నిర్మించి ఆయా గ్రామాల ప్రజల రహదారి కష్టాలు తొల గించారు. తాజాగా కొత్తపేట ప్రజల చిరకాల వాంఛ రోడ్డు నిర్మాణం ప్రారంభం కావటంతో నివా సి తులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాదుకు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మెల్సీ వర్ల రామయ్యకు శుభాకాంక్షలు తెలిపిన గోపు సత్యనారాయణ



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో ఇటీవల శాసన మండలి సభ్యులు (MLC)గా నియమితులైన టీడీపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్యను కృష్ణా జిల్లా టీడీపి ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ కలసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా వర్ల రామయ్యను శాలువాతో సత్కరించి, దండలు వేసి అభినందనలు అందజేశారు.ఈ కార్యక్రమంలో గూడూరు మండల టీడీపి అధ్యక్షులు గోపి నాగబాబు, కృష్ణా జిల్లా టీడీపి కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్, శీలం కళ్యాణ్ పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: జిల్లా రెవెన్యూ అధికారి

ప్రజాభూమి ప్రతినిధి,మచిలీపట్నం:

ప్రజల నుంచి అందుతున్న అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా రెవెన్యూ అధికారి కే శ్రీధర్ రెడ్డి ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కెఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ పి. నీలకంఠేశ్వరరెడ్డి, మెప్మా పీడీ సాయిబాబు, దిశ పోలీస్ స్టేషన్ సీఐ వి. వెంకటేశ్వరరావుతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజలు వివిధ సమస్యలపై సమర్పించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని డీఆర్వో సూచించారు. అర్జీల పరిష్కారంలో జాప్యం లేకుండా, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# కొప్పనాతి చిన్న వెంకటేశ్వరరావుకు విక్కుర్తి నివాళి



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

నాగాయలంక మండలం నాలి గ్రామ మాజీ సర్పంచ్, మత్స్యకారుల సొసైటీ మాజీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కొప్పనాతి చిన్న వెంకటేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం ఆయన భౌతికకాయాన్ని అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు సందర్శించి తెలుగుదేశం పార్టీ జెండా కప్పి,పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు,నాగాయలంక మండల పార్టీ అధ్యక్షులు మెండు లక్ష్మణరావు,కృష్ణాజిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత,కృష్ణాజిల్లా తెలుగు దేశం పార్టీ ఉపాధ్యక్షులు లకనం నాగాంజనేయులు పార్టీ నాయకులు ఉప్పల ప్రసాద్,కన్నా నాగ రాజు, వర్రె రాంబాబు,కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు,కొల్లాటి ధనంజయ,కొపనాతి వెంకటేశ్వర రావు, తమ్ము తాతారావు,ముమ్మారెడ్డి రాజశేఖర్,నాగిడి తాతారావు,బొండడా గణపతి పాల్గొన్నారు.

# నిజమైన పరిష్కారమే.. నిబద్ధతకు నిదర్శనం

- కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో సాకారం కావాలి
- ప్రజల సంతృప్తే ఫిర్యాదు పరిష్కారానికి అసలైన కొలమానం
- జిల్లాస్థాయి ప్రజా స్నేహపూర్వక పీజీఆర్ఎస్‌కు 192 అర్జీలు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును కేవలం అర్జీగా కాకుండా.. ఒక కుటుంబం లేదా వ్యక్తి ఎదుర్కొంటున్న సమస్యగా భావించి సత్వర, నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదు పరిష్కారం కాగితాలపై లేదా ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పూర్తికాదని, సమస్యకు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిష్కారం లభించినప్పుడే అది నిజమైన పరిష్కారంగా పరిగణించాలని స్పష్టం చేశారు.కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజా స్నేహపూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి అర్జీలు స్వీకరించారు. మొత్తం 192 అర్జీలు అందగా రెవెన్యూ 66, పురపాలక పట్టణాభివృద్ధి 52, పోలీసు 22, పంచాయతీరాజ్‌కు 17 అర్జీలు రాగా వైద్య ఆరోగ్యం, స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖకు ఆరు చొప్పున అర్జీలు అందాయి. వ్యవసాయం, ప్రజా రవాణా, కాలేజీ విద్య, పాఠశాల విద్య, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, రహదారులు, భవనాల శాఖలకు రెండు చొప్పున అర్జీలు వచ్చాయి. విద్యుత్, పౌర సరఫరాలు, సహకార, అటవీ, ఆర్ఐవో, గ్రామీణ నీటిసరఫరా, గిరిజన సంక్షేమం శాఖలకు ఒక్కో అర్జీ వచ్చాయి. వీటిని క్షుణ్నంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో సంబంధిత అధికారులు ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి, సమస్య పరిష్కారమైన తీరును తెలుసుకోవడంతో పాటు వారి సంతృప్తిని నిర్ధారించుకోవాలని సూచించారు. తీసుకున్న చర్యలు, పరిష్కారం వివరాలు స్పష్టంగా ఉండేలా ఎండార్స్‌మెంట్లు రూపొందించాలని ఆదేశించారు. ప్రజల సంతృప్తే ఫిర్యాదు పరిష్కారానికి అసలైన కొలమానమని.. పాలనపై ప్రజలకు నమ్మకం మరింత పెరగాలంటే ప్రతి ఫిర్యాదుకు నిజమైన, పారదర్శకమైన, క్షేత్రస్థాయి పరిష్కారం అందాలన్నారు. పీజీఆర్ఎస్‌ను ప్రజలకు అండగా నిలిచే సమర్థవంతమైన వ్యవస్థగా మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషిచేయాలని పేర్కొన్నారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు సహా సంబంధిత అధికారులు ఆన్‌లైన్ సమీక్షలకు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, సమీక్షల్లో ప్రస్తావించే ప్రతి అంశంపై స్పష్టమైన వివరాలు అందిస్తూ జవాబుదారీతనంతో వ్యవహరించాలని ఆదేశించారు. అప్పగించిన బాధ్యతలను నిర్లక్ష్యం చేయకుండా, ఫిర్యాదుల పరిష్కారంలో వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జెడ్పీ సీఈవో జె.అరుణ, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జె.జ్యోతి, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఉయ్యూరులో డయేరియా లక్షణాలపై కలెక్టర్ డీకే బాలాజీ ప్రత్యేక దృష్టి

## 5, 18, 19వ వార్డుల్లో తాగునీటి కాలుష్యంపై సమగ్ర తనిఖీలు

## ప్రతి ఇంటినీ పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశం

ప్రజాభూమి ప్రతినిధి,ఉయ్యూరు:

కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఉయ్యూరులో డయేరియా లక్షణాల పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉయ్యూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి, డయేరియా లక్షణాలతో చికిత్స పొందుతున్న రోగులను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారుల వివరాల ప్రకారం ఇప్పటివరకు 26 మంది డయేరియా లక్షణాలతోటి సిహెచ్సిలో అడ్మిట్ అయ్యారని వారిలో 18 మంది డిశ్చార్జ్ అయ్యారని మిగతా ఎనిమిది మందికి వైద్య సేవలు అందుతున్నాయని వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలియజేశారురోగులకు అందుతున్న వైద్య సేవలు, డయేరియా లక్షణాలు కనిపించడానికి గల కారణాలు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. రోగులు, వారి బంధువుల నుంచి వివరాలను స్వయంగా తెలుసుకున్నారు.అనంతరం సమస్యకు మూల కారణాన్ని గుర్తించేందుకు తక్షణ చర్యలు చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సోమశేఖర్, పబ్లిక్ హెల్త్ ఈఈ ప్రవీణ్‌లను వెంటనే, సంబంధిత అధికారులతో కలిసి సంయుక్తంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.ప్రత్యేకంగా ఉయ్యూరు పట్టణంలోని 5, 18, 19వ వార్డుల్లో ప్రతి ఇంటినీ సందర్శించి తాగునీటి సరఫరా వ్యవస్థను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎక్కడైనా నీటి కాలుష్యం లేదా కలుషిత నీరు సరఫరా అవుతున్నట్లు గుర్తిస్తే వెంటనే కారణాలను నిర్ధారించి, తీసుకోవాల్సిన సరిదిద్దే చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.తాగునీటి పైపులైన్లు, లీకేజీలు, డ్రైనేజీ వ్యవస్థ, నీటి సరఫరా మార్గాలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి, ప్రజల ఆరోగ్యానికి ఎటువంటి ముప్పు లేకుండా తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.డయేరియా లక్షణాలకు గల ఖచ్చితమైన కారణాలను గుర్తించేందుకు అన్ని కోణాల్లో విచారణ జరిపి, అవసరమైన సాంకేతిక పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.తాగునీటి కాలుష్యానికి గల కారణాలను గుర్తించి, సమస్య పునరావృతం కాకుండా చేపట్టాల్సిన శాశ్వత సరిదిద్దే చర్యలపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, డయేరియా లక్షణాల నియంత్రణకు వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.



# నోటీసు జారీ.. ఓటు తొలగింపు కాదు..

- అత్యంత పారదర్శకంగా నోటీసులపై విచారణ
- వాస్తవ నిర్ధారణ తర్వాతే నిర్ణయం.. ఓటర్లకు భరోసా
- ఓటుహక్కు పరిరక్షణ కోసమే సర్ సమగ్ర ప్రక్రియ
- ఫారం-6 ద్వారా కొత్తగా ఓటు నమోదుకూ అవకాశం
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా జారీచేస్తున్న నోటీసులపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నోటీసు జారీ అంటే ఓటు తొలగింపు కాదని, అత్యంత పారదర్శకంగా విచారణ తర్వాతే నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. అదేవిధంగా ఫారం-6 ద్వారా కొత్తగా ఓటు కూడా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.సోమవారం విజయవాడ తూర్పు నియోజకవర్గం పరిధిలోని అయ్యప్పనగర్ స్వర్ణ వార్డు కార్యాలయం వద్ద జరిగిన సర్ నోటీసుల విచారణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పరిశీలించారు. అక్కడకు వచ్చిన వారితో మాట్లాడి క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు, ఏఈఆర్‌వోలు, ఈఆర్‌వోల ద్వారా అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నోటీసు జారీ అనేది వివరాలను పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించుకునే ప్రక్రియలో ఒక భాగం మాత్రమేనన్నారు. ఓటుహక్కు పరిరక్షణ కోసమే సర్ సమగ్ర ప్రక్రియ నిర్వహించడం జరుగుతోందని.. దోష రహిత ఓటరు జాబితా లక్ష్యంగా జరుగుతున్న ఈ ప్రక్రియలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఇప్పటివరకు 1,88,769 నోటీసుల పంపిణీ జరిగిందని.. వీటిలో 61,284 మందికి విచారణ నిర్వహించడం జరిగిందన్నారు. 64,252 మందికి విచారణ షెడ్యూలు గడువు ముగియగా విచారణ కోసం రీషెడ్యూల్ చేయడం జరుగుతోందన్నారు. ఎవరికి ఏ సందేహమున్నా క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు సహాయసహకారాలకు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. కొత్తగా ఓటు నమోదుకు వీలుకల్పించే ఫారం-6తో పాటు ఫారం-7, ఫారం-8లు కూడా వారి వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని.. అర్హులైన ప్రతిఒక్కరూ కొత్తగా ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కలెక్టర్ వెంట విజయవాడ ఆర్‌డీవో వెన్నెల శ్రీను తదితరులు ఉన్నారు.

## ఆత్మహత్యలు ఏ సమస్యకూ పరిష్కారం కావు

-ఎమ్మెల్యే చింతమనేని



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

ఆర్థిక సమస్యలు ఎంత పెద్దవైనా ఆత్మహత్యలు పరిష్కారం కావని, కష్టాలను ధైర్యంగా ఎదు ర్కోవాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం పెదకడిమికి చెందిన దుర్గారావు కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హుటాహుటిన ఏలూరు సర్వజన ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. వారికి మనోధైర్యం కల్పించారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించి, త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యాధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కష్టాలు తాత్కాలికమేనని, జీవితాన్ని ముగించాలనే ఆలోచనకు ఎవరూ తావివ్వకూడదని ఆయన సూచించారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమమే శరణ్యం

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు




ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, సచివాలయ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని అమరావతి ఏలూరు జిల్లా చైర్మన్ కె. రమేష్‌కుమార్ విమర్శించారు. ఏలూరు రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఈ నెల 28న విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య ఆడిటోరియంలో జరిగే రాష్ట్ర సదస్సుకు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో రాష్ట్ర చైర్మన్ బొప్ప రాజు వెంకటేశ్వర్లు భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తారని తెలిపారు. ఉద్యోగులంతా ఐక్యం గా ఉద్యమానికి సిద్ధం కావాలని కోరారు. సమావేశంలో బి. రాంబాబు, గీతిక, బి. సత్యనారాయ ణ, నాగేశ్వరరావు, జ్యోతి, కమల్, చ. వర్మ, కృష్ణస్వామి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

## రైతు ఉద్యమ నేత సారంపల్లి మల్లారెడ్డి మృతికి సంతాపం




ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

అఖిల భారత రైతు సంఘం జాతీయ నాయకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన సారంపల్లి మల్లారెడ్డి (88) మృతికి ఏలూరులో రైతు సంఘం ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు తదితరులు మాట్లాడుతూ.. మల్లారెడ్డి అనేక రైతాంగ ఉద్యమాలకు నాయకత్వం వహించారని, సాగునీటి ప్రాజెక్టులు, మద్దతు ధరలు, విత్తనాలు, వ్యవసాయ రంగంపై అధ్యయనం చేసి పలు పుస్తకాలు రచించారని గుర్తుచేశారు. ఆయన మృతి రైతు ఉద్యమాలకు తీరని లోటని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయడమే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## లక్ష్మడుగూడెం పంచాయితీలో రూ.4.90 లక్షల వ్యయంతో ఎల్ఈడి వీధి దీపాలు.


ప్రజా భూమి ప్రతినిధి-బుట్టాయగూడెం



మండలంలోని లక్ష్మడుగూడెం పంచాయతీలో ఎంపీ లాడ్స్ నిధులు రూ. 4,90,000/- తో ఎల్ ఈడి దీపాలు ఏర్పాటు చేశారు. ఎంపీ లార్డ్స్ నిధులతో ఏర్పాటు చేసిన ఎల్ఈడి దీపాలను సోమవారం కొమ్ముగూడెంలో తెలుగు దేశం పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎంట్రప్రగడ నాగ సత్య శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కూటమి నేతలు ప్రారంభించారు. ఈ సందర్భంగా నేత లు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో భాగంగా వీధి దీపాల ఏర్పాటుకు నిధుల మంజూరు కోసం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాల రాజు, ఏపీ ట్రై కార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు చేసిన కృషిని కొనియాడారు. వీరిద్దరి కృషి వలన ఫలితంగా పంచాయతీకి 160 వీధిలైట్లు ఏర్పాటు చేయడం జరిగినదని అన్నారు. వీధి దీపాల ఏర్పాట్లు పట్ల పంచాయతీలోని వివిధ గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో బుట్టాయిగూడెం మండలం జనసేన పార్టీ వైస్ ప్రెసిడెంట్ తీగల గోపాలకృష్ణ, బిజెపి నాయకులు దొమ్మేటి లక్ష్మీ జనార్ధన్, కూటమి నాయకులు పైదా వసంతరావు, మానికల శ్రీను, పంచాయతీ కార్యదర్శి రవి కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

## నెహ్రూ కాలనీలో ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం.

ప్రజా భూమి ప్రతినిధి-పెదపాడు.



సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ ఎస్ఎస్ ఆధ్వర్యంలో సత్రంపాడు నెహ్రూ కాలనీలో ఈరోజు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో భాగంగా నెహ్రూ కాల నీలోని పరిసరాలను శుభ్రపరిచి, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భం గా కళాశాల ప్రిన్సిపాల్ వంగ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిశుభ్రమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ ఫణి కుమార్, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ కె. హరి బాబు, ఏవో, సిహెచ్, కృష్ణ, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇతర అధ్యాపక సిబ్బంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని నెహ్రూ కాలనీలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

### రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి

## మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా



ముసునూరు మండలం ముసునూరు గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ కు చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు కి రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ముందుగా రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి లు పూలమొక్కలను అందించి రాష్ట్ర ముఖ్యమంత్రికి సాదరంగా ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, డా.కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, ఏపి అప్కాబ్ చైర్మన్ మరియు ఉమ్మడి జిల్లా డిసిసిబి చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఐజిపి జి. వి. జి. అశోక్ కుమార్, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ, జిల్లా అటవీశాఖ అధికారి పి.వి.సంధీప్ రెడ్డి, ఏపి అగ్రి కల్చర్ మిషన్ వైస్- చైర్మన్,నూజివీడు నియోజకవర్గ పరిశీలకులు మారెడ్డి శ్రీనివాసరెడ్డి లు పూలమొక్కలు, పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతీ ఒక్కరినీ పేరుపేరున పలకరించారు.

## జూట్ కార్మికులకు నిరుద్యోగ భృతి ఇప్పించాలి

### విజయవాడ ఇ.ఎస్.ఐ. రీజనల్ డైరెక్టర్‌ని కలిసిన ఐ.ఎఫ్.టి.యు. బృందం.

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.



శాశ్వతంగా మూసివేసిన ఏలూరు, కొత్తూరు జూట్ మిల్లుల కార్మికులకు ఇ.ఎస్.ఐ. ద్వారా రావాల్సిన నిరుద్యోగ భృతిని వెంటనే చెల్లించాలని కోరుతూ ఐ.ఎఫ్.టి.యు. ఆధ్వర్యంలో జూట్ కార్మికులు విజయవాడ వెళ్లి ఇ.ఎస్.ఐ. రీజినల్ డైరెక్టర్ ప్రణవ కుమార్కి, డిప్యూటీ డైరెక్టర్ ప్రతాప్ కి వినతి పత్రం సమర్పించారు. రెండు జూట్ మిల్లులు శాశ్వతంగా మూసివేయడంతో ఉపాధి కోల్పోయి, రోడ్డున పడ్డ 4 వేలకు మందికి పైగా జూట్ కార్మికులకు ఇ.ఎస్.ఐ. ద్వారా రావాల్సిన నిరుద్యోగ భృతి త్వరగా ఇప్పించాల్సిందిగా కోరారు. మిల్లులు మూసి వేయడం వల్ల ఉపాధి కోల్పోయిన కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతూ, తీవ్ర నిరాశ నిస్పృహలలో ఉన్నారనీ, నిరుద్యోగ భృతి వస్తే కొంత ఊరట లభిస్తుందనీ, అందుకే ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారని వివరించారు. ఇప్పటికే నిరుద్యోగ భృతి చెల్లింపులు ప్రారంభించిన కొత్తూరు కార్మికులకు మిగతా వారికి వెంటనే చెల్లించే ఏర్పాటు చేయాలనీ, అలాగే ఇంతవరకూ ప్రారంభించని ఏలూరు మిల్లు కార్మికులకు కూడా వెంటనే నిరుద్యోగ భృతి చెల్లింపులు ప్రారంభించాలని వినతి పత్రం లో కోరారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎఫ్.టి.యు. రాష్ట్ర అధ్యక్షులు కె.పోలారి, ఏలూరు నగర ఐ.ఎఫ్.టి.యు అధ్యక్షులు బి. సోమయ్య, ఏలూరు, కొత్తూరు జూట్ మిల్లుల కార్మికులు కోసూరి నూకరాజు, కొంపంగి కృష్ణ,బగాది రమణ, ఎం .వెంకటేశ్వరరావు, సత్తిబాబు, త్రినాధ రావు, దయాకర శ్రీను.వి.వెంకట్రావు(ట్రైలర్). తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హామీలను అమలు చేయాలి

### వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్.




ప్రజాభూమి ప్రతినిధి-వేలేరుపాడు.

సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. మార్పు రావాలి, మార్పు కావాలి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఆ నిరసనలో తహసీల్దార్ కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలన్నారు. అన్ని రకాల ప్రభుత్వ భూములను ప్రతి పేద కుటుంబానికి 2 ఎకరములు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం భూ పంపిణీ కార్యక్రమం చేపట్టాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని, ఆన్లైన్ కి సంబంధం లేకుండా ప్రతి రైతుకు ఎరువులు అందించాలని, మేడిపల్లి, రామవరం పంచాయితీలకు ప్రభుత్వం వ్యవసాయ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, (బి కే ఎస్ యు) సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో తహసిల్దార్ శ్రీనివాస్ కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారం దారయ్య, పిట్టా ప్రసాద్, మడివి కామయ్య బంధం అర్జున్, బంధం నాగేశ్వరావు, తాటి దుర్గారావు, కాకా ముత్యాలరావు, కంగాల గంగరాజు, తెల్ల మహేష్, బుడిపుడి జాన్ బాబు, సోడి సత్తిబాబు, పెడకం వెంకటేష్, కంగాల నాగేష్, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడలో విషాద ఘటనపై న్యాయ విచారణకు వినతి




ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

జనతా వారధి కార్యక్రమంలో భాగంగా పట్టణ అధ్యక్షులు కొల్లి కొండ ప్రసాద్ ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కాకినాడలో జరిగిన విషాద ఘటన పై సమగ్రంగా దర్యాప్తుజరపాల న,వాస్తవాన్ని గుర్తించాలని పాలకొల్లు పట్టణ పోలీసు ఉన్నతాధికారులకు బిజెపి నాయకులు వినతిపత్రం సమర్పించారు. యువతలను మోసం చేయడం , బ్లాక్‌మెయిల్, ఆర్థిక దోపిడీ, బెదిరింపులు, ఆస్తులపై ఒత్తిడి, బలవంతపు మతమార్పిడి ప్రయత్నం వంటి ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరిపి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రావూరి సుధ,జక్కంపూడి కుమార్ వేరుకొండ దుర్గాప్రసాద్, మల్లవోలూ సురేష్, చెరుకూరి శ్రీనివాసరావు, నాళం బాబీ,గవర పవన్ నాయుడు,సలాది రామచంద్ర రావు,పడవల ఉమా శ్రీనివాస్,కోరాడ సూరిబాబు,చేగొండి బాబీ తదితరులు పాల్గొన్నారు.

## 1000 మంది భక్తులకు రుద్రాక్షలు అందజేత



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో వేంచేసియున్న శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు సోమవారం శ్రీ లీలా కళ్యాణమం డపం నందు సుమారు 1000 మంది భక్తులకు అరుణాచలం మాతాజీ గాందీమధి మరియు వారి కుమారుడు హరిహరణ్ మరియు ప్రకాష్ , భక్తులకు రుద్రాక్షలు అందజేసినారు. ఈ కార్యక్రమం లో ఆలయ కార్యనిర్వాహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్ మీసాల రామచంద్రరావు, స్థానిక బిజెపి నాయకులు జక్కంపూడి కుమార్, ఆలయ ధర్మకర్తలు పినిశెట్టి శ్రీనివాస్, హోత ప్రవాళ, నాళం నాగ వెంకట సురేఖ, బాసిన అప్పల నాగ సత్యనారాయణ, వందరపు కుమారి ఆలయ సూపరింటెండెంట్ వాసు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మేడపాడులో అక్రమంగా రొయ్యలు చెరువు తవ్వకాలు

- పర్యావరణానికి హానికరం అంటున్న రైతులు
- పర్మిషన్ లేదని అధికారుల వివరణ

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

పశ్చిమగోదావరి జిల్లా ఎలమంచిలి మండలం మేడపాడు గ్రామం రెవెన్యూ పరిధిలో 7 ఎకరాల రొయ్యల చెరువు అక్రమంగా ఎలాంటి పర్మిషన్లు లేకుండా తవ్వినట్లు తెలిసింది. ఆ చుట్టుపక్కల ప్రాంతం సమీపంలో వరి సాగు పొలాలకు ఈ రొయ్యల చెరువు నుంచి వచ్చే కలుషిత నీరు వల్ల పంటలు పండకుండా, దిగుబడి దారుణం గా పడి పోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. పర్యావరణానికి కూడా రొయ్యల చెరువుల హానికరంగా ఉంటాయని పలువురు అంటున్నారు. ఈరొయ్యల చెరువుల కారణంగా కొబ్బరి చెట్లకు కూడా తెగులు చోకుతున్నాయని, తద్వారా దిగుబడి పడిపోతోందని మరికొందరు చెబుతున్నారు. గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా తవ్వుతున్న ఈ రొయ్యలు చెరువులు తవ్వకోవడానికి చూసి చూడనట్లు వ్యవహరించే విధంగాను, అనధికారంగా దొడ్డిదారిన అనుమతులు ఇచ్చినందుకు గాను లక్షల రూపాయలు లంచాలు రూపంలో చేతులు మారినట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. ఇదేవిధంగా నేరేడుమిల్లి గ్రామ రెవిన్యూ పరిధిలో కూడా అక్రమ రొయ్యలు చెర్వులు తవ్వకాలు జరినట్లు తెల్సింది. వీటి వల్ల వరి సాగుకు ఇబ్బంది కలగడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ కోసం కాలుష్యం బారిన పడకుండా ఉండేందుకు గాను ఈ అక్రమ రొయ్యల చెరువుల తవ్వకాలను జిల్లా కలెక్టర్, జేసి స్థాయి అధికారులు కలుగజేసుకుని నిలుపుదల చేయాలని ఆ ప్రాంత రైతులు పలువురు కోరుతున్నారు. పర్మిషన్ లేకుండా రాత్రులందు తవ్వేస్తున్నారు

**ఎఫ్ డి ఓ ఏ దుర్గ ఏడుకొండలు:**

ఎలమంచిలి మండల ఎఫ్ డి ఓ ఏ దుర్గ ఏడుకొండలు మాట్లాడుతూ మేడపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో ఏడు ఎకరాలు రొయ్యల చెరువులు తవ్వుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అందుకు పర్మిషన్ లేనందున పలు మార్లు ఆపించామని, అయితే రాత్రులందు తవ్వేస్తున్నారని ఎఫ్డిఓ ఏడుకొండలు వివరణ ఇచ్చారు.

### ప్రతీ అర్జీని నిసితంగా

## పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

### డి.ఆర్.ఒ.:వి.సుబ్బారావు.

ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా నిర్ణీత కాల వ్యవధిలోపు పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి వి.సుబ్బారావు అధికారులు ఆదేశించారు. సోమవారం డా.బీఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం అమలాపురం కలెక్టరేట్ లోని గోదావరి భవన్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.సుబ్బారావు, కొత్తపేట, రామచంద్రాపురం ఆర్డీవోలు జీవీవీ.సత్యనారాయణ, సరళావతి, ఎస్డీసీ డి.అచ్యుతా కుమారి, డీఆర్డీఏ పీడీ డి.రాంబాబు, స్వర్ణ గ్రామ, వార్డు అధికారి పి. రాజేశ్వరి, డ్వామా పీడీ జీఎస్.రామ్ గోపాల్ తదితరులతో కలిసి జిల్లా చుట్టూ ప్రక్కల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు, దరఖాస్తులు స్వీకరించారు. భూ రికార్డు ఆన్ లైన్ లో నమోదు, రీ సర్వే, భూ ఆక్రమణలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, పారిశుద్యం, మురికి కాలువలకు పుడికతీత, ఇంటిస్థలం, ఇళ్లు, పింఛను, సదరం సర్టిఫికెట్, రహదారులు మంజూరు వంటి అంశాలపై మొత్తం 214 అర్జీలు అందాయి. ఈ అర్జీలను సంబంధిత అధికారులకు సూచిస్తూ సకాలంలో పరిష్కరించాలని డీఆర్వో ఆదేశించారు. ఈ సందర్భంగా డీఆర్వో వి.సుబ్బారావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే ఉద్దేశంతో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వివిధ సమస్యలపై అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. వివిధ శాఖలలో నమోదైన అర్జీల పట్ల సంబంధిత అధికారులు అధిక ప్రాధాన్యత ఇచ్చి, తప్పనిసరిగా నిర్దిష్ట కాల వ్యవధిలోపు పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారులకు సూచించారు. వివిధ శాఖల్లో నమోదైన అర్జీలకు సరైన పరిష్కార నివేదిక సిద్ధం చేసి, ఆన్ లైన్ లో తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని డీఆర్వో అధికారులకు స్పష్టం చేశారు. ప్రజా ఫిర్యాదుల కొరకు 1100 టోల్ ఫ్రీ నెంబర్, మీ కోసం ఆన్ లైన్ పోర్టల్ ద్వారా కూడా నమోదుకు అవకాశం ఉందని, అలాగే మండల, గ్రామ వార్డు స్థాయిలలో అధికారులకు సమర్పించవచ్చునన్నారు.. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సేవలను జిల్లా వాసులు సద్వినియోగ చేసుకోవాలని చేయాలని డీఆర్వో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ లు ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చతుర్దశ కలశారాధనతో పవిత్రోత్సవాలు వైభవోపేతం



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం విశేష పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేషార్చన, చతుర్దశ కలశారాధన, స్నపన, అలంకరణ, శ్రీ లక్ష్మీనృసింహ సుదర్శన మూలమంత్ర హోమం, పవిత్ర సమర్పణ, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. సాయంత్రం నవకుంభారాధన, పరమాత్మికోపనిషత్ పూర్వక మహాశాంతి హోమం నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంతకృష్ణుల ఆధ్వర్యంలో తీర్థప్రసాద వినియోగం జరిగింది. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ కార్య నిర్వహణ అధికారి సిహెచ్. సాయి పర్యవేక్షించారు. పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి దర్శనం చేసుకున్నారు.

ప్రజాభూమి

కాకినాడ, తూర్పుగోదావరి 5

మంగళవారం 25 ఆగస్టు 2026


# ఐఎస్ జగన్నాధపురం శ్రీ లక్ష్మీనరసింహ ఆలయానికి మహర్దశ

## గడ్డమణుగు రవికుమార్

**ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి**

ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాధపురంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అభివృద్ధిలో మహర్దశ పట్టనుందని జనసేన నేత, మాజీ జెడ్పీటీసీ, ద్వారకాతిరుమల శ్రీ చిన్న వెంకన్న దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు గడ్డమణుగు రవికుమార్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, శ్రీశ్రీశ్రీ కొచ్చర్లకోట నరసింహ గురువుగారి ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు చెప్పారు. సోమవారం ద్వారకాతిరుమలలో ఆలయ చైర్మన్ ఎస్.వి. సుధాకరరావు అధ్యక్షతన ట్రస్ట్ బోర్డు సమావేశం జరిగింది. చిన్నతిరుపతిని మరింత అభివృద్ధి బాటలో నడిపేందుకు బోర్డు సభ్యులు అంకితభావంతో పనిచేయాలని నిర్ణయించినట్లు రవికుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు, ప్రజల సూచనలు, సలహాలు తీసుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఐఎస్ జగన్నాధపురం ఆలయ అభివృద్ధితో పాటు రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ద్వారకాతిరుమల నుంచి ఐఎస్ జగన్నాధపురం వరకు నాలుగు లైన్ల రహదారి, జంగారెడ్డిగూడెం నుంచి జగన్నాధపురం వరకు రెండు లైన్ల రహదారి నిర్మాణ అంశాలను నరసింహ గురువుగారి నేతృత్వంలో చైర్మన్ సుధాకరరావు ద్వారా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.



**28 రోజులపాటు ప్రత్యేక పూజలు**

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తొలగి సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు రవికుమార్ తెలిపారు.

నరసింహ గురువుగారి సూచన మేరకు ఆగస్టు 23 నుంచి సెప్టెంబర్ 19 వరకు 28 రోజులపాటు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటలకు స్వామివారి మూలమూర్తులకు అభిషేకం, విశేష అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పవిత్ర కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రవికుమార్ కోరారు.

## తలారి వెంకట్రావుకు కృతజ్ఞతలు తెలిపిన నాని



**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**

కొవ్వూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావును తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామానికి చెందిన వైసీపీ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ పప్పుప్పల లక్ష్మణ్ ( నాని) మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి రావడానికి సహకరించిన తలారి వెంకట్రావుకు నాని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్రావుకు శాలువా కప్పి సత్కరించి, పుష్ప గుచ్ఛం అందజేశారు. నూతనంగా కీలక పదవి లభించడంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం కనిపిస్తోందని నాయకులు పేర్కొన్నారు. తలారి వెంకట్రావు సహకారంతో నాని భవిష్యత్తులో పార్టీ కార్యక్రమాల్లో మరింత చురుగ్గా పనిచేస్తారని కార్యకర్తలు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు వైసీపీ టౌన్ ప్రెసిడెంట్ చిట్టూరి వీరాజు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి కొమ్మన మణిబాబు, మండల ప్రధాన కార్యదర్శి గోరిపర్తి రాజు, గ్రామ మైనారిటీ సెల్ అధ్యక్షుడు రాజా సాహెబ్, గ్రామ యువజన విభాగం అధ్యక్షుడు ముగ్గు గణేష్, ఆకుల పోసి కుమార్, చీకట్ల కార్తీక్, చౌటుపల్లి నాగేంద్ర, ఎస్.కె. నజీర్, బొర్ర నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.**

వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రేఖపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నల్ల బ్యాడ్జీలతో డ్యూటీ చేస్తూ నిరసన కార్యక్రమం తెలియజేశారు. మా యొక్క ప్రధానమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నాము, మా యొక్క డిమాండ్స్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, రెగ్యులర్ అయ్యేవరకు 100 శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని డ్యూటీలో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగి మరణిస్తే 50 లక్షల ఎక్స్ గ్రేసియాతో పాటు ఆ కుటుంబంలో కుటుంబంలో ఒకరికి ఉద్యోగవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. దశబ్దాలుగా సేవలందిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ కాకపోవడం బాధాకరమన్నారు. మా సమస్యపై ప్రభుత్వానికి చాలా సార్లు వినతి పత్రాలు అందజేసిన ఫలితం లేకపోవడంతో సమ్మెకు సన్నద్ధం కావలసి వచ్చిందనీ అన్నారు. కార్యక్రమంలో ఎం శాంతి ప్రియ, కే సుబ్బమ్మ, ఎస్ కళావతి, ఎస్ శ్రీనివాస్, కే రత్తయ్య, ఏ సతీష్ పాల్గొన్నారు.



# జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి

## చింతూరులో ఏ ఎస్ పి, ఏపీవోలకు వినతిపత్రం

**ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం.**

సబ్ డివిజన్ డివిజన్ కేంద్రంలో రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ ఏపీయూడబ్ల్యుజే ఆధ్వర్యంలో సోమవారం చింతూరు ఏఎస్ పి బొడ్డు హేమంత్, ఐటిడిఏ ఏపీవో రామతులసికి వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాసినేని చంద్రశేఖర్ మాట్లాడుతూ మైనింగ్ మాఫియా ఆగడాలపై నిజాలు నిర్భయంగా రాసే జర్నలిస్టులపై దాడులు పెరిగిపోతున్నాయని, విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండల విశాలాంధ్ర విలేఖరి గోవిందు పై దాడి ఘటనే దీనికి నిదర్శనమని అన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరు ఖండించాలని, దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో చింతూరు డివిజన్ అధ్యక్షుడు ఎండి షౌఖత్ అలీ, కార్యదర్శి నీలపు రాజేష్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మసకపల్లి సత్తిబాబు, బెజ్జంకి శ్రీనివాసచారి, బెజ్జంకి ఈశ్వర చారి, యూనియన్ సభ్యులు బెజవాడ



నాగేంద్ర కుమార్, బేడే సతీష్, షేక్ రియాజ్, కొడమంచిలి జీవన్ కుమార్, కాక సీతారామయ్య, షేక్ ఖాదర్, తమ్మినేడి రామారావు, సురేష్ చౌదరి, రాజు, గెద్దం వెంకటేశ్వర్లు, నెల్లూరి రమేష్, షేక్ బాష, మాడి ముత్యాలరావు, బొర్రా రామారావు, పిడియాల మోహనరావు, వెంకన్న పాల్గొన్నారు.

# ఉపాధి అవకాశం ఉన్న చోట పునరావాసం కల్పించాలి

**ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.**

వడ్డిగూడెం గ్రామంనికి ఆర్ ఢ ఆర్ కాలనీ ప్రభుత్వంవారు కేటాయించిన కొత్తపల్లి గ్రామం నుండి మార్పుచేసి మాకు ఉపాది అవకాశం ఉన్నచోట పునరావాసం కల్పించాలనీ నిర్వాసిత ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం వడ్డిగూడెం గ్రామ పోలవరం నిర్వాసిత ప్రజలు స్తానిక రేఖపల్లి వద్ద తహసిల్దార్ కార్యాలయంలోని తహసిల్దార్ వై సరస్వతి కి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. మాకు గోకవరం మండలం, కొత్తపల్లి గ్రామములో ఆర్ఢఆర్ కాలనీ కొరకు ప్రభుత్వంవారు కేటాయించారు, కాని ఆయొక్క గ్రామానికి మా వడ్డిగూడెం గ్రామస్తులు



వెళ్ళుటకు ఇష్టపూర్వకముగా లేము అని నిర్వాసితులు తహసిల్దార్ కు తెలిపారు. అలాగే మా గ్రామంలో చాలామంది వ్యవసాయం చేసుకునే చిన్నకారు రైతులు, వ్యవసాయ ఆదారిత పనులు చేసుకుంటు జీవనం కొనసాగించుకుంటు ఉంటారు. కాని ఆ కొత్తపల్లి గ్రామంలో వ్యవసాయ భూములు లేవు కావున మా గ్రామ ప్రజలుము ఆ కొత్తపల్లి గ్రామాని తిరస్కరిస్తున్నామనీ అన్నారు. గతంలో మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మా వి.ఆర్.పురం మండలంలో పర్యాటించినపుడు మీరు కోరుకున్నచోట మీ గిరిజనేతరులందరికి ఒకేచోటకి చేరుస్తామని మాట ఇచ్చారని, కావున మా గిరిజనేతరులకు ఇచ్చిన ఆర్ ఢ ఆర్ కాలనీలైన తాడువాయి, కొయ్యలగూడెం, ఆర్ఢఆర్ కాలనీలలో లేద దగ్గరలో కృష్ణ జిల్లా, తిరువూరు ప్రాంతములలో మేము కోరుకున్నచోట వడ్డిగూడెం గ్రామస్తులమైన మాకు ఆర్ఢఆర్ కాలనీ నిర్మించి, మాకు న్యాయం చేయాలని వారు కోరారు.

## పరిశోధనతో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ



**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

ఏలూరు జిల్లా ఆగిరిపల్లి సమీపంలోని డా. ఆర్.వి.ఆర్. యన్.ఆర్.ఐ. ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న తన్నీరు వెంకట సౌజన్యకు గీతమ్ యూనివర్సిటీ, విశాఖపట్నం పీహెచ్‌డీ డిగ్రీ ప్రదానం చేసింది. ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగం ఆచార్యులు నరేష్ పాణిగ్రహి పర్యవేక్షణలో 'డిజైన్, సింతసిస్ అండ్ క్యారక్టరైజేషన్ ఆఫ్ నైట్రిక్ ఆక్సైడ్ రిలీజింగ్ క్వినోలిన్స్ యాజ్ యాంటీ క్యాన్సర్ ఏజెంట్స్' అనే అంశంపై పరిశోధన చేశారు. పరిశోధనా కాలంలో రెండు స్కోపస్ జర్నల్స్‌లో పరిశోధనా పత్రాలను ప్రచురించారు. పీహెచ్‌డీ సాధించిన సందర్భంగా డా. ఆర్.వి.ఆర్. యన్.ఆర్.ఐ. ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఛాన్సలర్ ఆర్. వెంకట్రావు, ఉపకులపతి కె.ఆర్.యస్. సాంబశివరావు, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ డీన్ వై. అంకమ్మ చౌదరి, విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

# పడవ ప్రయాణికులు నుండి ప్రజాధనం దోపిడీపై కలెక్టరేట్ ముందు ఆదివాసీ సంక్షేమ పరిషత్ నిరసన

## పడవ ఫెర్రీ గుత్తేదారు బినామీ దందాపై సమగ్ర విచారణకు డిమాండ్..

**ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం**

కూనవరం-రుద్రంకోట గోదావరి నది దాటు పడవ (ఫెర్రీ) పాయింట్ వేలం పాట పేరుతో సాగుతున్న భారీ ఆర్థిక అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ (ఏ ఎస్ పి) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రంపచోడవరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ , జిల్లా జాయింట్ కలెక్టర్లకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ పోలవరం జిల్లా అధ్యక్షులు కూర చిట్టి బాబు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు, స్థానిక ప్రాంతంలో సామాన్య ఆదివాసీలను, ప్రయాణికులను నిలువునా దోపిడీ చేస్తున్న బినామీ పడవ ఫెర్రీ గుత్తేదారు ను తక్షణమే రద్దు చేసి, బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కూనవరం-రుద్రంకోట మధ్య నడుస్తున్న పడవ ప్రయాణికుల వద్ద నుండి నిర్దేశించిన ప్రభుత్వ ధరల కంటే రెట్టింపు మొత్తంలో చార్జీలు వసూలు చేస్తూ సదరు గుత్తేదారు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని జిల్లా అధ్యక్షులు కూర చిట్టి బాబు ఆరోపించారు. ప్రభుత్వ నియమావళి ప్రకారం ఒక వ్యక్తికి రూ 50 చార్జీ ఉండగా రూ100, ద్విచక్ర వాహనానికి రూ 50 స్థానే రూ100 చొప్పున అక్రమంగా దండు కుంటున్నారని మండిపడ్డారు. ఈ పడవ పాట సదరు గుత్తేదారు వెనుక అసలైన సూత్రధారి ఒక



నాన్-ట్రైబల్ ప్రభుత్వ ఉద్యోగి అని, ఆదివాసీ చట్టాలను ఎల్ ఆర్ పిసా చట్టాలను తుంగలో తొక్కి ఆదివాసీ మహిళ పేరుతో రూ. 89.30 లక్షల భారీ మొత్తానికి బినామీగా పాట పాడించి గిరిజనేతర గుత్తేదారు ప్రభుత్వ ఉద్యోగి అయిన వెనుక ఉండి నడిపిస్తున్నారని పత్రికా ముఖంగా బహిర్గతం చేశారు.

ఈ దోపిడీ దందా అంతా స్థానిక పంచాయతీ అధికారుల కనుసన్నల్లోనే బహిరంగంగా సాగుతుండటం శోచనీయమని నాయకులు విమర్శించారు. ఫెర్రీ పాయింట్ వద్ద నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆమోదిత రేట్ల పట్టిక బోర్డును కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇదంతా అధికారులకు తెలిసే జరుగుతోందని, ఈ అక్రమ దోపిడీని ఎవరైనా ప్రయాణికులు ప్రశ్నిస్తే వారిపై గుత్తేదారు మనుషులు తీవ్రస్థాయిలో దురుసుగా ప్రవర్తిస్తూ, భయాందోళనలకు గురిచేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వేలేరుపాడు మండల పరిధిలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సంబంధించిన సుమారు రెండు కోట్ల రూపాయల పునరావాస పరిహారాన్ని స్వాహా చేసి సస్పెండ్ గురైన సదరు నాన్-ట్రైబల్ ఉద్యోగి, ప్రస్తుతం ఈ ఫెర్రీ దందాకు అసలు యజమానిగా వ్యవహరించడం ఆదివాసీ ప్రాంతాల స్వయంపాలనకు తీవ్ర విఘాతమని వారు హెచ్చరించారు. ఈ అక్రమాలకు ఏజెంట్ గా వాడుకుంటున్న ఆదివాసీ మహిళా కుటుంబం సంపాదించిన ఆస్తులపై తక్షణమే ఏసీబీ, సిబిసిఐడి లతో లోతుగా ఎంక్వైరీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రజాధనాన్ని దోచుకుంటూ రాజ్యాంగబద్ధమైన ఆదివాసీ హక్కులను హరిస్తున్న ఈ గుత్తేదారు ను రద్దు చేసి, నిజమైన ఆదివాసీ సహకార సంఘాలకు ఈ ఫెర్రీ నిర్వహణ బాధ్యతలను అప్పగించకపోతే ఆదివాసీ సమాజాన్ని సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కూర చిట్టి బాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు పీట్ట ప్రసాద్, గంగా భవాని తదితరులు పాల్గొన్నారు.

## టీబి వ్యాధిగ్రస్తులు అదనపు పోషకాహారం తీసుకోవాలి.

-డి ఎం హెచ్ ఓ డాక్టర్ ఎం రవిబాబు.



**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**

పాలకొల్లు కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్ నందు రోటరీ క్లబ్ పాలకొల్లు ఆధ్వర్యంలో టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మరియు జిల్లా టిబి అధికారి డాక్టర్ ఎం రవిబాబు మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలు మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని వాటితో పాటు అదనపు పోషకాహారం తీసుకోవడం వలన రోగి త్వరగా కోలుకోవడం జరుగుతుందని. ఈ పోషకాహారాన్ని రోటరీ ద్వారా అందజేయడం అభినందనీయమని అన్నారు. ఈ కిట్లు లో వేరుశనగ గుళ్ళు. మినపప్పు. కందిపప్పు.బెల్లం. నూనె. రాగి పిండి మొదలగు పోషకాలు కలిగిన కిట్లను డాక్టర్ రామకృష్ణ ఆనందరాజు ఆర్థిక సహకారంతో ఆరు నెలలపాటు అందజేయడం జరుగుతుందని రోటరీ అధ్యక్షుడు గుడాల హరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ జిల్లా జాయింట్ సెక్రెటరీ ముత్యాల శ్రీనివాస్. ఇమ్మి డి రాజేష్. కోశాధికారి ఆరుమిల్లి సురేష్. చిలుకూరి భీమన్న. డాక్టర్ శార. జిల్లా టీబి కోఆర్డినేటర్ ఆర్ విద్యానంద్. సూపర్వైజర్ ఉదయ్ చందర్. కె సత్తిబాబు.బి.లక్ష్మీనారాయణ. డి వెంకటేష్. పి. సీతా మహాలక్ష్మి. మృత్యుంజయ్. తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ స్థాయిలోనే అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి



**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

ప్రీ ప్రైమరీ విద్యార్థుల్లో భాష, గణితం వంటి అంశాల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని మండల విద్యాశాఖ అధికారి 1 మాదాసి సత్యనారాయణ సూచించారు. ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ టీచర్లకు నిర్వహిస్తున్న నాలుగు రోజుల ఎఫ్ఎల్ఎన్ జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటపాటలు, కృత్యాధార బోధన ద్వారా పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచాలని సూచించారు. ప్రీ ప్రైమరీ స్థాయిలోనే ఆంగ్ల భాషపై ప్రాథమిక అవగాహన కల్పిస్తూ, పిల్లలను ఆప్యాయంగా చూసుకుంటూ విద్యాబోధన చేయాలన్నారు. శిక్షణకు ఉపాధ్యాయులు అంకం వెంకటేశ్వరరావు, పి. సతీష్‌కుమార్, అంగన్వాడీ సూపర్‌వైజర్ జి. రాగమయి వనరుల వ్యక్తులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. పుష్పలతతో పాటు మండలంలోని 63 మంది అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ఎక్కి స్వయంగా పొలం దున్నిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు.

**ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి**



పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు సోమవారం తన వ్యవసాయ క్షేత్రంలో రైతుగా మారి స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ పొలం దున్నారు. వ్యవసాయంపై తనకున్న మమకారాన్ని చాటు తూ, పొలంలో ట్రాక్టర్ ఎక్కి దుక్కి దున్ని సాగు పనులను స్వయంగా చేపట్టారు. రైతు కష్టాలు, వ్యవసాయ పనుల్లో ఎదురయ్యే సవాళ్లు తనకు ప్రత్యక్షంగా తెలుసునని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. "రైతు కష్టం తెలిసినవాడే రైతు సమస్యలను అర్థం చేసుకోగలడు. అన్నదాతకు అండగా నిలవడం మనందరి బాధ్యత" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## జ్వరాలు నివారణపై ప్రత్యేక సర్వే



**ప్రజా భూమి ప్రతినిధి-కామవరపుకోట**

జ్వరాలు నివారణ ముందస్తు చర్యల్లో భాగంగా ఈ రోజు తడికలపూడి లో సర్వే టీం లను చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎన్. ఎ. ప్రసాద్ స్వయంగా తనిఖీ చేసి నీటిలో ఉన్నదోమ లార్వావాలును (గుడ్లు ) ప్రజల చూపించి, ప్రతి శుక్రవారం ను డ్రై డే గా ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన కోరారు. ఫ్రీజ్. కూలర్లు,టైరులు, పూలకుండీలు, పనికిరాని ప్లాస్టిక్, వ్యర్థ కాంటైనర్లు లో ఊన్న నీరును తొలగించలని, పరిసరాల శుభ్రంగా ఉంచాకోవాలని, జ్వరం అనిపిస్తే ఆరోగ్య సిబ్బంది ని సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకొని వైద్యుల సలహా మేరకు మందులు వాడితే జ్వరాలను సకాలంలో నివరించ వచ్చునని ప్రజలకు అవగహన తెలిపారు. ఈ కార్యక్రమం లో సూపరవైజర్ జయలక్ష్మి, ఎం ఎల్ హెచ్ పి అరుణ, సబ్ యూనిట్ హెచ్ ఎ కె. శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ లు ఎన్. సుమలత, శంకర్, ఆశా ధనలక్ష్మి పాల్గొన్నారు.

## తలారి వెంకట్రావును పరామర్శించిన పుప్పాల వెంకట్రావు

**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**



ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం దేవరపల్లిలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావును పుప్పాల వెంకట్రావు పరామర్శించారు. తలారి వెంకట్రావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న పుప్పాల వెంకట్రావు, ఆయన త్వరగా కోలుకుని యథావిధిగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు.

## నేడు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, శాఖల మంత్రి నారా లోకేష్ జిల్లా పర్యటన..



ప్రజా భూమి ప్రతినిధి, అనంతపురం

నేడు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 07.20 గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి బయలుదేరి 08:20 గంటలకు జిందాల్ విజయనగర్ విమానాశ్రయంకు చేరుకుంటారు. అక్కడి నుంచి 08.30 గంటలకు రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి 09.40 గంటలకు కర్ణాటక రాష్ట్రం బళ్లారి మండలం హలకుందికి చేరుకుని 10 గంటల వరకు సుజ్లాన్ బ్లేడ్ స్టాక్ యార్డ్ ను మంత్రి సందర్శన చేస్తారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి మండలం హలకుంది నుంచి ఉదయం 10 గంటలకు రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి 10:45 గంటలకు రాయదుర్గం పట్టణంలోని శాంతినగర్ కు చేరుకుంటారు. అక్కడి నుంచి 11:15 గంటలకు బయలుదేరి 11.50 గంటలకు కణేకల్ మండలం, హులికెర గ్రామం, కణేకల్ క్రాస్ కు చేరుకుని మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు సుజ్లాన్ విండ్ టర్బైన్ తయారీ విస్తరణ యూనిట్ ప్రారంభోత్సవానికి హాజరవుతారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి 2:15 గంటలకు కణేకల్ మండలం నల్లంపల్లి గ్రామంవద్ద నవాజ్ డైరీ ఫామ్ కి చేరుకుని, అక్కడ 3 గంటల నుంచి సాయంత్రం 05:30 గంటల వరకు కార్యకర్తలతో సమావేశం అవుతారు. అనంతరం అక్కడి నుంచి 05:30 గంటలకు బయలుదేరి జిందాల్ విజయనగర్ విమానాశ్రయంకు చేరుకుని మంత్రి హైదరాబాద్ వెళ్తారు.

## బాలల బీమా చెక్కుల పంపిణీ చేసిన: జిల్లా జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం జిల్లా సమగ్ర శిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో బాలల భీమా పథకం ద్వారా మంజూరైన నగదును చెక్కు రూపంలో ఆయా విద్యార్థుల బాధిత కుటుంబాలకు జిల్లా జాయింట్ కలెక్టర్ సి .విష్ణు చరణ్ స్థానిక జిల్లా కలెక్టరేట్ లో సోమవారం ఉదయం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ బాలల బీమా పథకం ద్వారా ఒక్కొక్క కుటుంబానికి రూ 25,000 చొప్పున అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు ఒక ఏడాదికి కేవలం రూ. 5 లు విద్యార్థి పేరు మీద బాలల బీమా పథకం చేయిస్తే వివిధ ప్రమాదాలు, పాముకాటు తదితర సంఘటనల్లో మృతి చెందిన విద్యార్థులకు ఈ ఇన్సూరెన్స్ పథకం వర్తిస్తుందని అందువల్ల 1 నుండి 10 తరగతి వరకు చదివే విద్యార్థులకు బాలల బీమా పథకంలో నమోదు చేయించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూచించారు. ప్రత్యేకంగా మన జిల్లాలో పేద ప్రజల కుటుంబాలకు ఈ పథకం ఉపయోగపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి అరుణ్ తేజ (8వ తరగతి) కొత్తకోట గ్రామం వజ్రకరూర్ మండలం, మణికంఠ చౌదరి (8 తరగతి) రాయలప్ప దొడ్డి బ్రహ్మసముద్రం మండలం, ప్రణయ్ (2 తరగతి) శ్రీరంగపురం బెలుగుప్ప మండలం, ఈ కార్యక్రమంలో సర్వ శిక్ష ఏపీసి శైలజ, డిఈ జయరాం సీఎమ్ఓ చంద్రశేఖర్, జి సి డి ఓ కవిత, ఎస్ ఏ ఉమ్మి సల్మా తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం ప్రెస్ క్లబ్ సభ్యత్వాలు ప్రారంభం

**- సభ్యత్వం స్వీకరించిన సీనియర్, వెటరన్, ఇతర జర్నలిస్టులు**

**- అభ్యంతరాలు ఉంటే తెలపాలని కమిటీ సభ్యుల విజ్ఞప్తి**



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం ప్రెస్ క్లబ్ సభ్యత్వ నమోదు ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. అడ్ హక్ కమిటీ మెజార్టీ సభ్యుల ఆమోదంతో గత సమావేశంలో నిర్ణయించిన మేరకు సభ్యత్వాల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఉపాధ్యక్షుడు మల్లెబోయిన రామాంజనేయులు, సభ్యులు కేపీ కుమార్, కే. అనిల్ కుమార్ రెడ్డి సమక్షంలో జర్నలిస్టులు తమ సభ్యత్వాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు కేపీ కుమార్ (సభ్యుడు) ఏ రవిచంద్ర, మార్కండేయులు, గాజుల నాగభూషణం, మల్లెబోయిన రామాంజనేయులు (ఉపాధ్యక్షుడు) కే.అనిల్ కుమార్ రెడ్డి (కోశాధికారి), ప్రజాభూమి బ్యూరో ఇంచార్జ్ డి.రాజా హెన్సూర్ తో పాటు అనేకమంది జర్నలిస్టులు సభ్యత్వాలు స్వీకరించారు. ఈనెల 27వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు సభ్యత్వాల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుందని, ప్రెస్ క్లబ్లో ప్రదర్శించిన తుది జాబితాలోని ప్రతి జర్నలిస్టు సభ్యత్వాలు స్వీకరించాలని అడ్ హక్ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. అలాగే, అభ్యంతరాలు ఏవైనా ఉన్నట్లయితే కమిటీ దృష్టికి తీసుకురావాలని, తదుపరి సమావేశంలో వాటిని పరిశీలించి కమిటీ మెజార్టీ సభ్యుల అభిప్రాయం మేరకు అర్హులైన వారి విషయంలో తదిన నిర్ణయం తీసుకుంటామని అడ్ హక్ కమిటీ సభ్యులు తెలిపారు.

## జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ను కలిసిన ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి



ప్రజా భూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం నగరంలో ఇటీవల నూతన శాసనమండలి సభ్యురాలు ఎమ్మెల్సీ గా ఎన్నికైన దలవాయి రమాదేవి సోమవారం జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా అభివృద్ధికి సంబంధించి పలుఅంశాలపై చర్చించారు. జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు సమన్వయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్సీ శ్రీమతి దళవాయి రమాదేవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు సిద్దాపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థుల ఎంపిక





ప్రజా భూమి శింగనమల

మార్చాపురంలో జరగబోయే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ కు నందిని, జూనియర్ పోటీలకు సాయి శ్రీ జడ్పీ హైస్కూల్ సిద్దరాంపురం విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ వివరాలను పాఠశాల హెచ్ఎం నీరజ్ వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులను నందిని, సాయి శ్రీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ( పి డి ) నాగరాజు తో పాటు నాగేంద్ర ప్రసాద్, కోటప్ప, ఆది నారాయణ, బాలకృష్ణ,కమల, మధుబాల,ఉమా బాయ్ ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులు,అభినందించారు. రాబోయే టోర్నమెంట్ లో కూడా వీరు ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

# చంద్రబాబు నాయుడు చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

### ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి డి పెద్దయ్య.



ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికుల ఆధ్వర్యంలో రాష్ట్ర పిలుపుమేరకు చంద్రబాబునాయుడు చెప్పిన సూపర్ సిక్స్ అమలు పరచాలని ధర్నా చేయడం జరిగినది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి డి,పెద్దయ్య మాట్లాడుతూ! కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న పేదల వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, పేదలకు సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కల్పించాలని, ఆర్థిక, రాజకీయ రంగాల్లో కూడా పేదలకు స్థానం కల్పించాలని ఈనెల 6 నుంచి 15 వ తేదీ వరకు గ్రామీణ,పట్టణ ప్రాంతాలలో ప్రచార యాత్రలు జరిగాయి. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 12 సంవత్సరాలు దాటిన పేదలకు సంక్షేమం, విద్య, వైద్యం, ఆరోగ్యం, ఆహార భద్రత, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందింది. ఎన్నో దశాబ్దాలుగా పోరాటాలు చేసి సాధించుకున్న గ్రామీణ పేదల చట్టాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా రద్దుచేసి, కొత్త చట్టాల ముసుగులో పేదలను నిరాశ్రయిలను చేయాలని ప్రయత్నం చేయడం దుర్మార్గం. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి వి బి జి రాంజీ చట్టాన్ని తెచ్చి పేదల నోట్లో మట్టి కొట్టడానికి ప్రయత్నం చేస్తున్నది. ఈ కొత్త చట్టం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కూలీల ముఖ ఆధారిత హాజరు పెట్టడం వల్ల ఐరిస్ విధానంతో అష్ట కష్టాలు పడుతున్నారు. అష్ట కష్టాలు పడి పనులకు వెళ్లిన తర్వాత ఐరిస్ పడకపోతే ఉపాధి పని ఉండదని వెనక్కి రావాల్సి వస్తున్నది. ఉపాధి పని కూడా సక్రమంగా పెట్టకుండా కూలీలను మోసం చేస్తున్నారు. చేసిన పని కూడా సకాలంలో డబ్బులు చెల్లించలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ హామీలతో పాటు అనేక వాగ్దానాలు పూర్తిగా పక్కన పెట్టి పేదలకు మోసం చేయడంలో చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య, గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు ఇస్తామని నమ్మబలికి, నేటికీ సెంటు స్థలం కూడా పేదలకు ఇవ్వలేదు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూములు 22 -ఎ లో పెట్టి వాటిని ఓల్డ్ చేసి పేదలకు సాగులో, స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూములు ఆన్లైన్లో అడంగల్ లో 1బీ ఒరిజినల్ రాకుండా చేసి, ప్రభుత్వ పథకాలు పేదలకు దూరం చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములు అన్నిటిని కారు చౌకగా పరిశ్రమలకు విండ్, సోలార్ మరియు కంపెనీలపేర్లతో అప్పనంగా అప్పజెప్పడానికి ఉన్న శ్రద్ధ పేదలపై చంద్రబాబుకు లేదు. చంద్రబాబు ప్రభుత్వము రాష్ట్రంలో 33 లక్షల ఎకరాలను ఓల్డ్ చేసి పేదలకు ప్రభుత్వ భూములు నుండి దూరం చేయడానికి ప్రయత్నం చేస్తున్నది. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు పడడం లేదు. గ్రామాలలో త్రాగునీరు సమస్య కూడా అధికంగా ఉన్నది.

కావున కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలుఈ డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి.

1), ఎల్ నీనో ప్రభావం వల్ల ఏర్పడిన వర్ష భావ పరిస్థితుల నుండి పేదలు,వ్యవసాయ కూలీలకు పనులు లేనందున తక్షణ ఉపాధి హామీ పనులు మొదలుపెట్టి వలసలు ఆపాలి. 2),తీవ్ర కరువు పరిస్థితుల నుండి ఆదుకోవడానికి వ్యవసాయ కూలీలకు ప్రతి కుటుంబానికి నెలకు 10 వేల రూపాయలు కరువు పెన్షన్ల తో పాటు అన్ని రకాల నిత్యావసర వస్తువులు ఉచితం అందించాలి,

3),రాష్ట్ర వ్యాప్తంగా పేద విద్యార్థినీ, విద్యార్థులకు ఫీజులు రద్దుచేసి, వారిని ఆదుకోవాలి,

4), చంద్రబాబు ఎన్నికల హామీల్లో భాగంగా పేదలకు గ్రామాలలో 3 సెంట్లు పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలి,

5), రాష్ట్రంలో నెలకొన్న భూ సమస్యలు పరిష్కరించాలి, ప్రభుత్వ పేదలకు సాగు భూమి పంచాలి. 22-ఎ లో పెట్టిన పేదల భూములు ఒరిజినల్ అడంగల్, 1 బి లు వచ్చేలా చేసి అన్ని రకాల ప్రభుత్వ సహాయం అందించాలి,

6), కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టం వి బి జి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరణ చేయాలి,

7), అటవీ హక్కుల సంరక్షణ చట్టాన్ని సక్రమంగా అమలుపరిచి ఆదివాసీలు, గిరిజనులకు న్యాయం చేయాలి, 8), పేదలకు సామాజిక న్యాయం,ఆత్మగౌరవం కల్పించి ఆర్థిక రాజకీయ రంగాల్లో పేదలకు స్థానం కల్పించాలి, ఈ డిమాండ్లు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో పెద్దన్న, రాఘవేంద్ర,దేవరాజు,రాజు, మహేష్, నారాయణ, , నారాయణ, బాల రంగప్ప, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో వరుస విద్యార్థుల మరణాలు

**- సెట్టూరులో మృతి చెందిన విద్యార్థికి కోటి రూపాయలు ఎక్స్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ప్రభుత్వమే కల్పించాలి - విద్యార్థి సంఘాలు హాస్టల్లోకి రానివ్వకుండా ఇచ్చిన జీవోని ఉపసంహరించుకోవాలి.**

**- జేసీ విష్ణు చరణ్ కి వినతిపత్రం సమర్పించిన వైఎస్ఆర్ విద్యార్థి విభాగం నాయకులు**



ప్రజా భూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం, సెట్టూరు మండలంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో పాడుబడిన గోడ కూలి దళిత విద్యార్థి హర్షవర్ధన్ మృతి చెందడం అత్యంత విషాదకరమని, ఈ ఘటన వార్డెన్ నిర్లక్ష్యానికి, డిడి పర్యవేక్షణ లోపానికి, కూటమి ప్రభుత్వ వైఫల్యమని వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన విద్యార్థి నాయకులతో కలిసి సోమవారం జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ కి విద్యార్థుల సమస్యల గురించి వారికి కావాల్సిన న్యాయం గురించి అక్కడ ఉన్నటువంటి పరిస్థితుల గురించి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థుల భద్రత పూర్తిగా గాలికి వదిలేశారని, ప్రమాదకర స్థితిలో ఉన్న భవనాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే ఒక పేద దళిత విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరో విద్యార్థి అక్షయ్ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందడం బాధాకరమన్నారు. వసతి గృహ వార్డెన్ నిర్లక్ష్యం, సంబంధిత అధికారి డి.డి పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఘటనకు బాధ్యులైన వార్డెన్, సంబంధిత విద్యాశాఖ అధికారులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన బాధ్యతను విస్మరించి కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రోత్సహించే పనిలో నిమగ్నమయ్యారని చంద్రశేఖర్ యాదవ్ విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కల్పించకుండా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ప్రభుత్వ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతులు అందించేందుకు అనేక సంస్కరణలు తీసుకువచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వ విద్యను నాశనం చేసే విధానాలు అమలు చేస్తోందని ఆరోపించారు. విద్యార్థి నాయకులు సమస్యలు ప్రభుత్వానికి కనపడేలా చూపిస్తున్నారన్న కక్షతో మంత్రి నారా లోకేష్ విద్యార్థి నాయకులను హాస్టల్స్ లోకి స్కూల్స్ లోకి అనుమతించకూడదని జీవోను తెచ్చిన ఘనత వారికి దక్కుతుందని వెంటనే ఆ జీవోని ఉపసంహరించుకోవాలని, మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి కనీసం రూ కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గాయపడిన విద్యార్థికి మెరుగైన వైద్య చికిత్స అందించి పూర్తి ఖర్చును ప్రభుత్వం భరించాలని కోరారు. ఈ ఘటనపై సమగ్ర న్యాయ విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు కార్యక్రమంలో వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, శెట్టూరు మండల అధ్యక్షులునవీన్ నాయకులు హరీష్,చరణ్,రెడ్డి సాహిద్, రఫీ, శేఖర్, గౌస్,రాఘవ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు

## పుట్లూరు మండల రెవెన్యూ శాఖలో సిబ్బంది కొరత - ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు.

**ప్రతి రెవెన్యూ పరిధిలో, సచివాలయంలో అధికారులు, సిబ్బందినినియమించాలి.**


**ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వి.టి. రామాంజనేయులు.**



ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండల రెవెన్యూ శాఖలో అవసరమైన సిబ్బంది లేకపోవడంతో మండల పరిధిలోని అనేక గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వి.టి. రామాంజనేయులు అన్నారు. ముఖ్యంగా గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వోల) కొరత అధికంగా ఉండటంతో ప్రజల రెవెన్యూ సంబంధిత పనులు, రైతుల భూమి సమస్యల పరిష్కారం ఆలస్యమవుతోందన్నారు. ప్రస్తుతం మండలంలోని గ్రామాలలో రీసర్వే కార్యక్రమం కూడా జరుగుతుండటంతో భూముల సర్వే, రికార్డులు, సరిహద్దులు తదితర సమస్యలు మరింతగా పెరుగుతున్నాయని తెలిపారు. రెవెన్యూ శాఖలో సిబ్బంది కొరత కారణంగా రైతులు, ప్రజలు తమ చిన్నచిన్న పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు సకాలంలో సేవలు అందాలంటే మండలంలోని ప్రతి రెవెన్యూ పరిధిలో తగిన సంఖ్యలో వీఆర్వోలను నియమించడంతో పాటు, ప్రతి గ్రామ సచివాలయంలో ఆయా శాఖలకు సంబంధించిన అధికారులను, సిబ్బందిని వెంటనే నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు పుట్లూరు మండల తహసీల్దార్ గారికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మరియు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తరఫున వినతిపత్రం అందజేసి, ప్రజలు మరియు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరడమైనది. ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పుట్లూరు మండల గౌరవ అధ్యక్షులు బుస గాని చిన్ని కృష్ణుడు యాదవ్, అధ్యక్షులు ఎన్. గోపాలకృష్ణ, కార్యదర్శి సత్తార్ గోపాల్ యాదవ్, రైతు సంఘం మండల కమిటీ నాయకులు బి.ఓబుల్ రెడ్డి, సత్తార్ రమణయ్య యాదవ్, రైతులు చిన్నఓబులపతి, మారుతి, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సింగనమల నియోజకవర్గం గార్లదిన్నె బస్టాండ్‌లో కీర్తిశేషులు ఎన్ టి రామారావు విగ్రహావిష్కరణ: ఎంపీ అంబిక



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలంలోని బస్టాండ్ ఆవరణంలో సోమవారం కీర్తిశేషులు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత నందమూరి తారక రామారావు సినీ రంగంలో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ఆయన, రాజకీయ రంగంలోకి ప్రవేశించి "తెలుగు వారి ఆత్మగౌరవం" నినాదంతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించి, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారు. ఆయన సేవలు, ఆశయాలు, సిద్ధాంతాలు నేటికీ తరతరాలకు స్ఫూర్తిదాయకం అని అన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేయడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు పూల నాగరాజు, పార్టీ ప్రధాన కార్యదర్శి కదదరకుంట శ్రీధర్ చౌదరి, ఎడిసిసి బ్యాంక్ చైర్మన్ ముంతిమడుగు కేశవరెడ్డి, టీడీపీ నాయకులు ఆలం నర్సానాయుడు, మండల కన్వీనర్ పండు, కృష్ణారెడ్డి, బుక్కరాయసముద్రం మాజీ జెడ్పిటిసి రామలింగారెడ్డి, రాయల మురళి, వెంకటేశ్వర్ రెడ్డి, బంధువుకు రాజా, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వినాయకుడిపై అభ్యంతరకర పోస్టులు -పోలీసులకు ఫిర్యాదు

### -కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందువుల ఆరాధ్యదైవమైన వినాయకుడి జన్మవృత్తాంతాన్ని అవహేళన చేస్తూ, హిందూ దేవతలు, మత విశ్వాసాలను కించపరిచే విధంగా రూపొందించిన సందేశాన్ని వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సోమవారం గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏఎస్పీ మహేష్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు మాట్లాడుతూ..సి. వెంకటేశప్ప అనే వ్యక్తి వివిధ వాట్సాప్ గ్రూపుల్లో వినాయకుడి జన్మకథను వ్యంగ్యంగా ప్రశ్నిస్తూ, పార్వతీదేవి, పరమశివుడు తదితర హిందూ దేవతలు, మత విశ్వాసాలను అవమానించేలా వ్యాఖ్యలతో కూడిన సందేశాన్ని ఫార్వర్డ్ చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మత విశ్వాసాలపై చర్చించడం, ప్రశ్నించడం వ్యక్తిగత స్వేచ్ఛలో భాగమైనప్పటికీ, ఒక మతానికి చెందిన ఆరాధ్యదైవాలను అవమానకరమైన రీతిలో చిత్రీకరిస్తూ, అలాంటి సందేశాలను ఉద్దేశపూర్వకంగా సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడం వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉందని సమితి ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గణేష్ ఉత్సవాల సందర్భంగా ప్రజలు వినాయకుడిని భక్తిశ్రద్ధలతో పూజించేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఇలాంటి అభ్యంతరకరమైన సందేశాలను ప్రచారం చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఇలాంటి పోస్టుల వల్ల మతపరమైన ఉద్రిక్తతలు ఏర్పడే అవకాశం ఉన్నందున పోలీసులు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలని కోరారు. సంబంధిత వాట్సాప్ సందేశాల స్క్రీన్‌షాట్లు, గ్రూప్ వివరాలు తదితర ఆధారాలను పోలీసులకు సమర్పించినట్లు తెలిపారు. సందేశం ఎక్కడి నుంచి వచ్చింది, ఎన్ని గ్రూపుల్లో ఫార్వర్డ్ చేశారు, నిజానిజాలను నిర్ధారించాలని కోరారు. వెంకటేశప్పపై వర్తించే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు ఏ మతానికి వ్యతిరేకంగా కాదని, అన్ని మతాల విశ్వాసాలను గౌరవిస్తూ మత సామరస్యం, ప్రజా శాంతి, పరస్పర గౌరవాన్ని కాపాడటమే తమ ఉద్దేశమని గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వైటిపి శ్రీనివాసులు, ప్రతినిధులు ఆదర్శ కుమార్, నిమ్మకాయల రాము, జేపీకె రాము, రాయల్ గోపాల్, వెంకటేష్, రామ్మూర్తి, టికె బాబు, నవీన్, బద్రి, నాగరాజు, ప్రాజెక్ట్, రమేష్, అశ్వర్థ, లోకేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను నిర్దేశిత సమయంలో, నాణ్యతతో పరిష్కరించాలి..


### - జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



ప్రజాభూమి ప్రతినిధి,కడప : ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారం నాణ్యత, పారదర్శకతతో పాటు ప్రజల్లో సంతృప్తి స్థాయి పెంపొందించేలా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనాతో కలిసి ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించి, వీటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంలో పెండెన్సీ పై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్న తర్వాతే తగిన పరిష్కారం చూపాలని సూచించారు. అలా పరిష్కరించినప్పుడే ప్రజల్లో అర్జీల పరిష్కారం పట్ల నమ్మకం కలుగుతుందన్నారు. జాప్యానికి తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పిజిఆర్ఎస్ వ్యవస్థపై అధికారులు పారదర్శకంగా వ్యవహరిస్తూ.. ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. ప్రజల్లో వీజీఆర్ఎస్ ద్వారా పరిష్కరించిన ఫిర్యాదులపై ప్రజల అభిప్రాయం ప్రభుత్వానికి ఎంతో ముఖ్య మని పేర్కొంటూ, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ క్యూఆర్ కోడ్‌లను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రజలు తమ ఫిర్యాదుల స్థితిగతులను టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. తహసీల్దార్లు, శాఖాధిపతులు, పీజీఆర్ఎస్ సిబ్బంది ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్ లో వచ్చిన అర్జీ తిరిగి ఓపెన్ కాకుండా సంబంధిత అధికారి ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదుల పట్ల పరిష్కార నివేదిక అందివ్వడంలో.. సంబంధిత అధికారి, ఫిర్యాదు దారులకు సరైన విధంగా స్పష్టంగా సమాధానం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో మల్లికార్జునుడు, జెడ్పీ సీఈవో సుబ్రహ్మణ్యం, డిప్యూటీ కలెక్టర్లు రంగస్వామి, జాన్ ఇర్విన్, సమగ్ర శిక్ష ఏపీసీ అనురాధ, డ్వామా పిడి ఆదిశేషా రెడ్డి, జిల్లా స్థాయి అధికారులు తదతరులు పాల్గొన్నారు.

# ఇంట్లో దూరిన కొండచిలువను పట్టిన మధుసూదన్ రెడ్డి

### పామును అడవిలో విడిచిపెట్టిన స్నేక్ క్యాచర్ మధుసూదన్ రెడ్డి



ప్రజాభూమి పులివెందుల

పులివెందుల పట్టణంలోని వైఎస్ మనోహర్ రెడ్డి ఇంటి సమీపంలో ఒకరి ఇంట్లోకి పెద్ద పాము దూరింది. దీంతో భయాందోళనకు గురైన ఇంటి యజమానులు పాములు పట్టే నేర్పరి మధుసూదన్ రెడ్డికి శర్వాణి ద్వారా సమాచారం అందించారు. వెంటనే స్పందించిన మధుసూదన్ రెడ్డి పులివెందుల చేరుకొని ఇంటి గోడల మధ్య దాగి ఉన్న పెద్ద పామును చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం దానిని సంచిలో పెట్టుకొని ఫారెస్ట్ ఆఫీసర్ గోపాలకృష్ణ ఆదేశాల మేరకు కదిరి రోడ్డులోని నామాలగుండు అటవీ ప్రాంతంలో సురక్షితంగా విడిచిపెట్టా రు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గం చుట్టుపక్కల 50 కిలోమీటర్ల పరిధిలో ఏ గ్రామంలో పాములు కనిపించినా తాను వచ్చి పట్టుకుంటానని తెలిపారు. పాములు కనిపిస్తే చంపవద్దని, తన సెల్ నెంబర్ 98666 60195 కు ఫోన్ చేయాలని కోరారు.

# మంత్రం పేరుతో మోసం.. బంగారు ఉంగరం చోరీ

### నిందితుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు



ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల మండలం ఈ.కొత్తపల్లి గ్రామంలో మంత్రం పేరుతో ఓ వ్యక్తిని నమ్మించి బంగారు ఉంగరం చోరీ చేసిన ఘటన సోమవారం కలకలం రేపింది. గ్రామానికి చెందిన అల్లా బాషా కుమారుడు ఆలీఫు వద్దకు వచ్చిన ఓ ఫకీరు, తంత్రం వేసి ఆరోగ్య సమస్యలు తగ్గిస్తానంటూ నమ్మించాడు. అనంతరం ఆలీఫుకు మత్తుమందు ఇచ్చిఅతని వద్ద ఉన్న సుమారు రూ.80 వేల విలువైన బంగారు ఉంగరాన్ని చోరీ చేశాడు.కొద్దిసేపటి తర్వాత ఉంగరం కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన ఆలీఫు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అప్రమత్తమై ఫకీరును పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న సీఐ శ్రీరామ్ సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. నిందితుడు కర్ణాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:ఇలాంటి మోసగాళ్లను నమ్మవద్దని, , మంత్రం పేరుతో అమాయకులను నమ్మించి మోసాలకు పాల్పడే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ శ్రీరామ్ గ్రామస్తులకు సూచించారు.

## వార్డు సచివాలయ సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ తనూజ సమావేశం

### జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వహించాలని ఆదేశం



ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల మున్సిపల్ కమిషనర్ తనూజ వార్డు సచివాలయ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడు తూ ప్రతి వార్డు సచివాలయ ఉద్యోగి వారి వారి జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వహించాలని ఆదేశించారు. తమ సచివాలయ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.ప్రతి ఉద్యోగి ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సచివాలయ పరిధిలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అదేవిధంగా ప్రజలు కూడా తమ సమస్యలను మొదటగా వార్డు సచివాలయంలో తెలిపి పరిష్కరించు కోవాలని కమిషనర్ తనూజ సూచించారు.

## ర్యాష్ డ్రైవింగ్ విషయంలో యువకుల మధ్య ఘర్షణ

### -కత్తితో దాడి.. ఒకరికి తీవ్ర గాయాలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

మండల పరిధిలోని కొటిపి పంచాయతీ ఇస్లాంపురం వద్ద సోమవారం ర్యాష్ డ్రైవింగ్ విషయంలో యువకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో ఓ యువకుడిపై కత్తితో దాడి చేయడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు.. ఇస్లాంపురం వద్ద రోడ్డుపై వెళ్తున్న సమయంలో రాంగ్ డ్రైవింగ్ విషయమై యువకుల మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో అక్కడే ఉన్న సంతోష్ అనే యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న అబుబకర్‌ను దూషించినట్లు తెలుస్తోంది. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయిన సంతోష్ తన ఇద్దరు స్నేహితులతో కలిసి తిరిగి వచ్చి అబుబకర్‌పై కత్తితో దాడి చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కత్తితో దాడి చేయడంతో అబుబకర్‌కు గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తూ విచారణ చేపట్టారు. ర్యాష్ డ్రైవింగ్ విషయంలో ప్రారంభమైన చిన్నపాటి వాగ్వాదం కత్తి దాడికి దారితీయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. యువకులు సంయమనం పాటించకుండా ఘర్షణలకు దిగడం వల్ల పరిస్థితులు తీవ్రంగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# వెన్నుపోటు పార్టీ వంచన పై బీసీ గర్జన

### బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

### బీసీ గర్జనలో పాల్గొన్న బీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరప్రసాద్



ప్రజాభూమి,పులివెందుల

బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, వెన్నుపోటు పార్టీ వంచన పై అమరావతిలో బీసీ గర్జన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ మాజీ చైర్మన్, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడువరప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. 50 సంవత్సరాలకే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు పెన్షన్ అందజేస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వకపోవడం దారుణం అన్నారు. బీసీ భవనాలు కమ్యూనిటీ హాళ్ళు వెంటనే నిర్మించలన్నారు. మోసపూరిత మాటలు చెప్పి బీసీలను మోసం చేయడం సరికాదన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్ కల్పిస్తానని జీ ఓ 105 ఇవ్వడం జరిగిందని వెంటనే అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం బీసీల ప్రభుత్వమని చెప్పుకోవడమే తప్ప ఇంతవరకు బీసీలకు న్యాయం చేసిన దాఖలాలే లేవన్నారు. 105 జీవోపకారం 34 శాతం చేస్తే సుప్రీంకోర్టు గైడ్లైన్స్ ప్రకారం ఇవ్వడం జరగదన్నారు .ఇది బి సి లను మోసం చేయడమే. వైకాపా ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తే, అప్పుడు కోర్టుకు పోయి ఆపింది మీ పార్టీ అనుచరులు కాదా అన్నారు. ఐనా కూడా జగన్ మాట ఇచ్చిన ప్రకారం ఓసిల స్థానంలో బి సి లకు స్థానం కల్పించడం కల్పించి 34 శాతం రిజర్వేషన్లు కల్పించి బిసిల మీద ఉన్న ప్రేమను చిత్త శుద్ధితో నిరూపించు కున్నారు అలాగే మీరు కూడా బి సి లకు 34 శాతం ఇచ్చి మాట నిలుపుకోవాలన్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అన్నిటిని వెంటనే నెరవేర్చాలని ఆయన తెలిపారు.

# మిట్టమల్లేశ్వరునికి విశేష పూజలు



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని గుంత బజార్ సమీపంలో ఉన్న ఎంతో పురా తనమైన ప్రసిద్ధిగాంచిన శ్రీ మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం సోమవారాన్ని పురస్కరించుకొని శ్రీ మిట్టమ ల్లేశ్వరుని విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా తెల్లవారుజామున నుండి స్వామి వారికి ప్రధాన అర్చకులు రుద్ర, శివ స్వాముల ఆధ్వ ర్యంలో స్వామివారికి పంచా మృత అ భిషేకం, భస్మాభిషేకం, సహస్ర నామ అష్టోత్తర శతనామావళి, భీష్మాభిషేకం, లిం గా ష్టకం తదితర పూజా కైకర్యాల అనంతరం మిట్ట మల్లేశ్వరుడు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శ నమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు మాట్లాడుతూ శివాలయం లో ప్రతిరోజు విశేష పూజలు ధూప, దీప, నైవేద్యాలు, ఘనంగా నిర్వహించడం జరు గుతోందని అన్నారు. శ్రావణ మాసం సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పరమశివునికి ఎంతో నమ్మకంతో భక్తి శ్రద్ధలతో మొక్కలు చెల్లించి విశేష పూజలు నిర్వ హించడం జరిగిందన్నారు. అనంతరం అనంతరం ఆలయ నిర్వా హకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, భక్తులు, ఎండోమెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నరు.

## సమాజ సేవలో బ్రహ్మకుమారీస్ పాత్ర ప్రత్యేకం

### -రక్తదాన మహా శిబిరానికి విశేష స్పందన రావడం సంతోషంగా ఉంది -వైయస్ మనోహర్ రెడ్డి



ప్రజాభూమి,పులివెందుల

రక్తదానం మహాదానం అనే సందేశంతో పులివెందులలో నిర్వహించిన రక్తదాన మహా శిబిరానికి విశేష స్పందన లభించింది. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యం లో నిర్వహించిన ఈ శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి వైయస్ మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకుని ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాధిక బ్రహ్మకుమారీ, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, చాగలేటి రాయుడు, మానవతా కృష్ణారెడ్డి, డాక్టర్ కొండయ్య, యోగా గురువు వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొనిరక్తదానం చేసిన దాతలను వారు అభినందించారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా హరి, భాగ్యలక్ష్మి

### -శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా హిందూపురం పట్టణానికి చెందిన సీనియర్ బిజెపి నాయకులు మేడికుర్తి హరి, భాగ్యలక్ష్మిలు నియమితులయ్యారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ లో కొనసాగుతూ సిద్ధాంతాలకు లోబడి పని చేస్తున్న హరి, భాగ్యలక్ష్మి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులు కావడం పట్ల ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఈ సందర్భంగా హరి, భాగ్యలక్ష్మిలు మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ అధిష్టానం తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బిజెపి బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ బెస్త మనోహర్ హరిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సత్యసాయి జిల్లా లో హిందూపురంకు ప్రాముఖ్యత లభించడం చాలా సంతోషకరమన్నారు. హిందూపురం వాసులకు రాష్ట్ర కార్యవర్గంలో అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ , జిల్లా అధ్యక్షులు గోరంట్ల మోహన్ శేఖర్ లకు హరి, భాగ్యలక్ష్మి కృతజ్ఞతలు తెలియజేశారు.

## మానవత్వానికి నిలువుటద్దం - 786 రఫీ సేవా సంస్థ




ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.

సమాజంలో కష్టం ఉన్న చోట నేనున్నానంటూ ముందుకొచ్చి, బాధితులకు కొండంత అభయాన్ని ఇచ్చే అరుదైన వ్యక్తుల్లో 786 రఫీ ఒకరు. కేవలం సేవా కార్యక్రమాలు చేయడమే కాకుండా, పేదరికం కారణంగా ఏ ఒక్కరి చదువు, క్రీడా లలో భవిష్యత్తు లో ఏ ఒక్కరికి ఆగిపోకూడదనే ఉద్దేశంతో '786 సేవా సంస్థ' ద్వారా నిరంతరం శ్రమిస్తున్నారు.ఇటీవల నాయుడుపేట బిరదవాడ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల నుండి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన 20 మంది విద్యార్థినులకు 786 సేవా సంఘం ద్వారా రఫీ ప్రత్యేకంగా స్పోర్ట్స్ టీ-షర్టులు, షాట్లు, క్యాప్స్ మరియు షూస్ పంపిణీ చేశారు. క్రీడల్లో విద్యార్థినులు మరింత రాణించి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. పండుగల్లో చేయూత: ప్రతి పండుగ సందర్భంలోనూ పేదలకు, నిరుపేద కుటుంబాలకు కొత్త దుస్తులు పంపిణీ చేస్తూ పండుగ వెలుగులను పంచుతారు. స్వార్థం నిండిన ఈ రోజుల్లో రఫీ చేస్తున్న ఈ నిరంతర సామాజిక సేవ ఎందరికో ఆదర్శనీయం. నిలవాలని ఈ కార్యక్రమంలో పాఠశాల పీ.ఈ.టీ.లు మరియు 786 సేవా సంఘం సభ్యులు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు.

# నేత్రదానం మహాదానం - అంధకారంలో వెలుగు నింపండి

### మరణం తర్వాత కూడా మన కళ్ళు బతకాలి

### నేటి నుండి జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభం



ప్రజాభూమి, పులివెందుల

నేత్రదానం మహాదానం అంటూ అంధకారంలో ఉన్నవారికి చూపును ప్రసాదించాలని వైద్యులు పిలుపునిచ్చారు. నేటి నుండి జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభం కానున్నాయి.సృష్టి అందాలను చూడలేని నిస్సహాయుల జీవితాల్లో వెలుగులు నింపే లక్ష్యంతో ప్రతి ఏటా ఈ పక్షోత్సవాలను నిర్వహిస్తున్నారు. నేత్రదానంపై ఉన్న అపోహలను తొలగించి అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశం. మరణం తర్వాత కళ్లను దానం చేస్తే ముఖం వికృతం అవుతుందనే అపోహను వైద్యులు ఖండిస్తున్నారు. మరణించిన 6 గంటల లోపు సేకరించిన నేత్రాలు ఇద్దరు అంధుల జీవితాలకు వెలుగునిస్తాయని స్పష్టం చేస్తున్నారు.ఈ పక్షోత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ర్యాలీలు, మానవహారాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. లింగ, వయసుతో సంబంధం లేకుండా కంటి శుక్లం, కళ్లద్దాలు వాడేవారు, బీపీ, షుగర్ ఉన్నవారు కూడా నేత్రదానానికి అర్హులే. అయితే ఎయిడ్స్, జాండిస్, రేబిస్ వంటి ప్రాణాంతక వ్యాధులతో మరణించిన వారి నేత్రాలను సేకరించరు.ఆసక్తి గలవారు ఆన్‌లైన్ లేదా స్థానిక కంటి ఆసుపత్రుల ద్వారా నేత్రదాన ప్రతిజ్ఞ చేసి దాన పత్రాలు పొందాలని వైద్యులు కోరుతున్నారు.మనం మరణించినా మన కళ్ళు ఈ లోకాన్ని చూస్తూనే ఉండాలి" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, బంధువులు మరణించినప్పుడు కుటుంబ సభ్యులు చొరవ తీసుకుని నేత్రదానానికి అంగీకరించాలని పిలుపునిచ్చారు.

## హైవే రోడ్డు ఆనుకుని మురుగు కంపు

### డ్రైనేజీ స్తంభించడంతో దుర్వాసన -- దోమల బెడదతో స్థానికుల ఆందోళన



ప్రజాభూమి, సిద్ధవటం: మాధవరం-1 గ్రామం రోడ్ నంబర్ 18 సమీపంలోని జాతీయ రహదారి పక్కన డ్రైనేజీ స్తంభించడంతో మురుగునీరు నిలిచిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో స్థానికులు, అటుగా కాలినడకన ఒంటిమిట్ట కోదండరామయ్య దర్శనానికి వెళ్లే భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు, మురుగునీరు పారేందుకు లక్షల రూపాయలతో నిర్మించిన కాలువలను కొందరు పూడ్చివేయడంతో నీరు ముందుకు వెళ్లే మార్గం లేక స్తంభించిందని స్థానికులు తెలిపారు. మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి డ్రైనేజీని శుభ్రం చేసి, మురుగునీరు సాఫీగా పారేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో మెహతాబ్ యాస్మిన్‌ను వివరణ కోరగా, మాధవరం-1లో స్తంభించిన మురుగునీటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మురుగునీరు పారే కాలువను కొందరు పూడ్చివేసిన విషయం తమ దృష్టికి వచ్చిందని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల పట్టణంలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది.పట్టణంలోని 33/11 కెవి కోతి సమాధి విద్యుత్ ఉపకేంద్రపరిధిలో రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్న కారణంగా లైన్ షిఫ్టింగ్ పనులు చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈఈ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు.ఈ పనుల కారణంగా 11 కెవి పార్లపల్లి రోడ్డు ఫీడర్ మరియు 11 కెవి రాజీవ్ నగర్ ఫీడర్ పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు.కావున ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈఈ జగదీశ్వర్ రెడ్డి కోరారు.

## మంగళ గౌరీ సమేత అమరలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని మాధవరం-1 గ్రామంలో వెలసిన శ్రీ మంగళ గౌరీ సమేత శ్రీ అమరలింగేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణమాస సోమవారం సందర్భంగా మూలవిరాట్ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి సాంబయ్య మాట్లాడుతూ సకాలంలో వరుణదేవుని అనుగ్రహంతో వర్షాలు కురిసి రైతులకు పంటల్లో అధిక దిగుబడులు రావాలని ఆకాంక్షిస్తూ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## పులివెందులలో వినాయక చవితి సందడి షురూ

### నాగలకట్ట వద్ద వినాయక విగ్రహాలు సిద్ధం-విక్రయానికి సిద్ధమైన గణనాథులు



ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల పట్టణంలో వినాయక చవితి సందడి మొదలైంది. పట్టణంలోని నాగలకట్ట వద్ద వినాయక విగ్రహాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. చిన్న, పెద్ద, వివిధ రకాల రంగులు, డిజైన్లతో గణనాథుల విగ్రహాలను నిర్వాహకులు సిద్ధం చేశారు.వినాయక చవితి సమీపిస్తుం డటంతో భక్తులు విగ్రహాల కొనుగోలుకు నాగలకట్టకు చేరుకుంటున్నారు. ధరలు కూడా అందుబాటులో ఉన్నాయని విక్రయదారులు తెలిపారు.

## పొలిటికల్ సైన్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

### - ఆగస్టు 25, 26న దరఖాస్తుల స్వీకరణ.. 27న ఇంటర్వ్యూ



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ తెలిపారు. అర్హులైన అభ్యర్థుల నుంచి ఆగస్టు 25, 26 తేదీల్లో కళాశాలలో దరఖాస్తులు, రిజ్యూమ్‌లు స్వీకరించనున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం ఆగస్టు 27న కళాశాలలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పొలిటికల్ సైన్స్‌లో ఎం.ఏ. 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీ శ్రీనివాస అధ్యక్షునిగా ఆవుల ఈశ్వర్ రెడ్డి




ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

సోమవారం ఉదయం 10 గంటలకు తిరుపతి టిపి ఏరియా నందలి హోటల్ ఐరిష్ నందు లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీ శ్రీనివాస నూతన అధ్యక్షునిగా ఆవుల ఈశ్వర్ రెడ్డి గారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు విజయభాస్కర రెడ్డి, రాజారెడ్డి నేతృత్వంలో నూతన అధ్యక్షునిగా ఆవుల ఈశ్వర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం లయన్స్ పిన్ మరియు గావెల్ , హామర్ ను జోన్ ఇంచార్జ్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ అందజేశారు. అంతకుముందు లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీనివాస కార్యవర్గ సభ్యులచే ప్రమాణం చేయించారు. నూతన అధ్యక్షునిగా ఆవుల ఈశ్వర్ రెడ్డి,కార్యదర్శి బెల్లంకొండ సురేష్ ,కోశాధికారిగా జగన్నాథం, ఉపాధ్యక్షులుగా శాంతి, కే ఆర్ శంకర్ సభ్యులుగా రఘు ,శేషాద్రి, వరప్రసాద్, వెంకటేశ్వర్లు, ఆముదాల వెంకటేష్ లను నియమించారు. ఈ సందర్భంగా లయన్ ఇంటర్నేషనల్ ప్రతినిధి రాజారెడ్డి మాట్లాడుతూ నూతన సభ్యత్వం పొందిన సభ్యులను పరిచయం చేసి వారి యొక్క విధివిధానాలను తెలియజేశారు. తర్వాత విజయ్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కార్యవర్గంచే ప్రమాణస్వీకారం చేయించి వారి యొక్క బాధ్యతలను తెలియజేశారు. తర్వాత నూతన అధ్యక్షులు ఆవుల ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనకు ఈ బాధ్యతను అప్పజెప్పిన లయన్స్ క్లబ్ ప్రతినిధులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. లైన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నో నూతన కార్యకలాపాలు నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్,రామచంద్ర రెడ్డి , మక్కెన భాస్కర్ ,ప్రభాకర్ రాజు,మోహన సుందరం,సోమయ్య , చిట్టిబాబు ,తదితరులు పాల్గొన్నారు.

## ఆకస్మిక తనిఖీలు చేపట్టిన గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రెడ్డి వారి గురువారెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

సోమవారం తిరుపతిలోని తిరుచానూరు శాఖ గ్రంథాలయం ఆకస్మికంగా సందర్శించి అటెండెన్స్ రిజిస్టర్ రీడర్స్ హాజరు రిజిస్టర్లు బుక్ రిజిస్టర్ల పత్రికలకు సంబంధించిన రిజిస్టర్లు గ్రంథాలయానికి సంబంధించిన అన్ని రికార్డులను అక్కడ ఉన్న పుస్తకాలను పరిశీలించిన పంచాయితీ భవనంలో ఉన్న గ్రంథాలయాన్ని పరిశీలించి ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రెడ్డి వారి గురువారెడ్డి రీడర్స్ గ్రంథాల అధికారి ఈ భవనాన్ని మరమ్మత్తులు చేయాలని చైర్మన్ ను కోరారు అనంతరం చైర్మన్ డాక్టర్ రెడ్డివారి గురవారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో గ్రంథాలయాల అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తా ఉందని అన్నారు దానికి నిదర్శనమే నిరంతరం కూడా గ్రంథాలయాల అభివృద్ధి మూలిక వసతులు కల్పన తదితర అంశాలపై విద్యాశాఖ మంత్రి వర్యులు నారా లోకేష్ పర్యవేక్షించడం జరుగుతా ఉంది అని అన్నారు ఈరోజు తిరుచానూరు శాఖ గ్రంథాలయంలో 7 వేల పుస్తకాల పైన అందుబాటులో ఉన్నాయి వాటిని పాఠకులు కాంపిటేటివ్ ఎగ్జామ్స్ ప్రిపేర్ అయ్యే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు అదేవిధంగా విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం వైపు మగ్గుచూపి సరస్వతి దేవి నిలయాలైనటువంటి గ్రంథాలయాల ను ఉపయోగించుకోవాలని అదేవిధంగా విజ్ఞాన జ్ఞాన బాండాగారలైన గ్రంథాలయాల నుంచి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చైర్మన్ కోరారు తిరుచానూరు గ్రంథాలయ భవనం పాడై ఉన్నది మరి దాన్ని మరమ్మత్తు చేయడమా మరోచోటికి తరలించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి స్థానిక శాసనసభ్యులు నాని దృష్టికి తీసుకువెళ్లి త్వరలో పరిష్కరిస్తాంఅని చైర్మన్ అన్నారు అదేవిధంగా స్థానిక గ్రంథాలయ అధికారి శ్రీముఖి ని రీడర్స్ సంఖ్యను పెంచాలని చైర్మన్ ఆదేశించారు.

## గ్రామ కమిటీ సమావేశంలో పాల్గొన్న జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్



ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.

వన్నెరెడ్డి యువత సేవా సంఘం తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ రోజు (24/08/2026) ఏర్పడు మండలం కొత్త వీరాపురం గ్రామం లో జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ వినోద్ అధ్యక్షతన గ్రామ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అధితిగా జిల్లా అధ్యక్షులు యం. మునిశేఖర్. ఉపాధ్యక్షులు కేశువులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మునిశేఖర్ మాట్లాడుతూ యువత అందరూ కలిసి కట్టుగా ఉండాలని ప్రతీ ఒక్కరు బాగా చదుకొని ఆర్థికంగా. రాజకీయంగా ఎదగాలని తెలిపారు. ఈ సందర్బంగా కొత్త వీరాపురం గ్రామ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

కమిటీ : అధ్యక్షులు :. ముని రెడ్డి అధ్యక్షులు :×. ఆనంద రెడ్డి ఉపాధ్యక్షులు :. గురువారెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ :×. సురేష్ కార్యదర్శి : మునినాథరెడ్డి సహాయ కార్యదర్శి :.సుబ్రహ్మణ్యం సహాయ కార్యనిర్వాహ అధికారి : చంద్రశేఖర్ కోశాధికారి :×. లోకేష్ ఎగ్జిక్యూటివ్ నెంబర్:. మురళి లను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం లో తిరుపతి జిల్లా సహాయ కార్యనిర్వాహ అధికారి జగదీష్, మండల యువ నాయకులు ఉపేంద్ర, సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 786 సేవా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు నాయుడుపేట బిరదవాడ డా. బి.ఆర్. అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల నుంచి ఎంపికైన 20 మంది విద్యార్థినులకు 786 సేవా సంఘం ఆధ్వర్యంలో స్పోర్ట్స్ టీ-షర్టు, షార్ట్స్, క్యాప్స్ మరియు షూస్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 786 రఫీ గారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువు తో పాటు క్రీడల్లోనూ రాణించాలని, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలను పెంపొందిస్తాయని అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు అవసరమైన క్రీడా సామగ్రిని అందించడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో కూడా విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు 786 సేవా సంఘం తన వంతు సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీ.ఈ.టీలు, ఉపాధ్యాయులు, 786 సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు. విద్యార్థినులు మరియు పాఠశాల సిబ్బంది 786 సేవా సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.




# శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఓటుకే రక్షణ కరువు

### ఇక సామాన్యుడు పరిస్థితి ఏంటి ......?

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.

సోమవారం శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి "సర్" వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కి శ్రీకాళహస్తిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై అర్జీని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... స్థానిక మున్సిపల్ కార్యాలయంలో తన కుటుంబ సభ్యుల ఓటర్ల జాబితాను పరిశీలించగా లోపాలు బయటపడ్డాయని, తనలాంటి మాజీ ఎమ్మెల్యే ఓటుకే రక్షణ లేకపోతే ఇక సామాన్యులు, దివ్యాంగుల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఇటీవల కాలంలో పెరిగిపోతున్న గంజాయి సంస్కృతి, రౌడీయిజం మరియు అసాంఘిక కార్యకలాపాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, పోలీస్ యంత్రాంగం నిరంతరం తనిఖీలు చేపట్టి నేరాలను శాశ్వతంగా అరికట్టాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే నేనే ఆరు నెలల నుంచి స్ట్రీట్ లైట్లు వెయ్యమంటే వేయడం లేదు ఇంకా సామాన్యుల పరిస్థితి ఏమిటి?. గతంలో మా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కక్ష సాధింపు చర్యలు ఏవీ లేవు కానీ



నేడు ఇంటి వద్ద చెత్త కూడా ఎత్తకుండా ఓ కొత్త సాంప్రదాయానికి శ్రీకారం చుట్టారు దీనికి తగిన మూల్యం చెల్లించుకుంటారు. మున్సిపల్ పరిధిలో ఉన్న స్థలాలలో టెండర్ లేకుండా దుకాణాలు పెట్టించి అక్రమ వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోండి. చిరు వ్యాపారస్తులు బుట్టలలో రోడ్డు సైడ్ వ్యాపారం చేస్తున్న వారి దగ్గర అక్రమ వసూలు చేస్తున్నారు వాటిని అరికట్టండి. నాడు జగనన్న ప్రభుత్వంలో గ్రేడ్ 1 లో ఉన్న శ్రీకాళహస్తి మున్సిపాలిటీ నేడు గ్రేడ్ 2 కి పడిపోవడానికి కారకులు ఎవరు?. అంతేకాకుండా, శ్రీరాములవారికి సంబంధించిన సుమారు రూ. 150 కోట్ల విలువైన దేవస్థానం భూములను నకిలీ పత్రాలతో ఆక్రమించేందుకు పెద్ద ఎత్తున స్కామ్ జరుగుతోందని ఆరోపిస్తూ, ప్రజలు ఎవరూ కూడా ఇటువంటి



వివాదాస్పద భూములను కొనుగోలు చేసి మోస పోవద్దని హెచ్చరించారు. శ్రీరాములవారికి సంబంధించిన దేవుడి భూములు, మాతమ్మ భూములు మరియు ఎస్సీలకు కేటాయించిన స్థలాలను నకిలీ పత్రాలతో ఆక్రమించి సుమారు రూ. 150 కోట్ల భూ కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. కాళహస్తిలో ప్రారంభమైన ఈ పెద్ద స్కామ్ లో విజయవాడలోని మినిస్టర్లు, సెంట్రల్‌లోని ఢిల్లీ దాకా ఉన్నాయని, దీనికి సంబంధించిన అన్ని ఆధారాలు మరియు ప్రూఫ్‌లు తన వద్ద ఉన్నాయని త్వరలోనే వాటన్నింటినీ బయటపెడతానని తెలిపారు. ఈ భూ అక్రమాలపై వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారిని కలిసి చర్చించి, పార్టీ అండతో అలాగే శ్రీకాళహస్తి ప్రజలు, స్వామీజీల భాగస్వామ్యంతో గట్టిగా పోరాడుతామని చెప్పారు. తిరుపతిలో ప్రెస్ మీట్ పెట్టి, విజయవాడలో ధర్నా చేపట్టి, అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఇంటి ముందు స్వామీజీలతో కలిసి న్యాయం జరిగే వరకు ధర్నా చేస్తానని హెచ్చరించారు. అక్రమార్కులు నిర్మించే భవనాలు భవిష్యత్తులో ప్రజలకే చెందుతాయని,కాబట్టి ప్రజలెవరూ ఈ వివాదాస్పద భూముల్లో ఒక్క సెంట్ కూడా కొనుగోలు చేసి మోసపోవద్దని, అలా కొంటే రేపు జరిగే పరిణామాలకు తాము బాధ్యులం కామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు,ఉత్తరాజి శరవణ,మున్నా రాయల్,బులెట్ జయశ్యాం,పంతులు,గోరా,సూర సురేష్, పఠాన్ ఫరీద్, కంట ఉదయ్,పులి రామ చంద్ర, ఆర్కాడు ముత్తు,కామి వెంకటేశ్వరులు, మునీకృష్ణ రెడ్డి, అస్లాం, కొట్టే శరవణ, జుంలేష, పసల కృష్ణయ్య, మహబూబ్ బాషా, జీలాని, బాబు దూదేలకుల, జయ కృష్ణారెడ్డి,బావాజీ, అబ్దుల్ ఆరీఫ్, షరీఫ్, గౌస్ బాషా, సాదిక్, పసల సుమతి, షర్మిల ఠాగూర్, మాధవి, షబ్బీర్, సాగిర బీ, సునీత సింగ్, ప్రకాష్, అప్పిని సుధాకర్, విజయ కుమార్ రెడ్డి, పెరుమాళ్, తమీమ్, ఖాదర్ వల్లి, సతీష్, ఫిరోజ్, నారాయణ, మణి, భారతమ్మ, మణికంఠ, పసల యుగంధర్,నజీర్, వాసు, యాకుబ్, దినేష్ రెడ్డి,శివ తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి ఛాంపియన్‌షిప్-2026 రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం

ప్రజా భూమి ప్రతినిధితిరుపతి,

తిరుపతి ఎన్టీఆర్ స్టేడియం వేదికగా అమరావతి ఛాంపియన్‌షిప్--2026 రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయని ఈ పోటీలు ఆగస్టు 27 వరకు కొనసాగానున్నాయని క్రీడా, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

క్రీడాకారులకు వెన్నుదన్నుగా ప్రభుత్వం.. రాష్ట్ర గౌరవాన్ని పెంచే బాధ్యత క్రీడాకారులది అనే సందేశంతో అమరావతి ఛాంపియన్‌షిప్--2026 రాష్ట్రస్థాయి పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి.

సోమవారం తిరుపతి వేదికగా ప్రారంభమైన అమరావతి ఛాంపియన్‌షిప్--2026 పోటీలను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ శాఖ మంత్రి, తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్, ఎం ఎల్ సి లు బల్లి కల్యాణ చక్రవర్తి, కంచర్ల శ్రీకాంత్, రాం భూపాల్ రెడ్డి, [illegible] ఛైర్మన్ అనిమిని రవి నాయుడు, తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, పూతలపట్టు, గూడూరు, కోడూరు, చిత్తూరు శాసన సభ్యులు అరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, ఆదిమూలం, బొజ్జల సుధీర్ రెడ్డి, నెలవల విజయశ్రీ, మురళి మోహన్, పాశం సునీల్, ఆరవ శ్రీధర్, గురజాల జగన్మోహన్, జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహా యాదవ్, క్లీన్ అండ్ గ్రీన్ బ్యూటిఫికేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, రాష్ట్ర హస్త కళలు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పసుపులేటి హరి ప్రసాద్, టిటిడి బోర్డు మెంబర్లు పానబాక లక్ష్మి, బాను ప్రకాష్, వన్నె కుల క్షత్రియ ఛైర్మన్ సి ఆర్ రాజన్, వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లు, జిల్లా కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, మున్సిపల్ కమీషనర్ ఎమ్. జయకృష్ణ, హాకీ క్రీడాకారిణి రజని, 26 జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులు, క్రీడాకారుల తల్లిదండ్రులు, కోచ్ లు, సిబ్బంది, కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి చేపట్టిన ప్రతిష్టాత్మక మల్టీ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ కార్యక్రమం నూతన రికార్డు సృష్టించింది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ క్రీడా పోటీల్లో భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడం ద్వారా ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అధికారికంగా స్థానం సంపాదించింది. ఈ సందర్భంగా క్రీడా, రవాణా శాఖ మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా అమరావతి ఛాంపియన్‌షిప్‌ను రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, తిరుపతి వేదికగా వేలాది మంది విద్యార్థులు, క్రీడాకారుల సమక్షంలో అమరావతి ఛాంపియన్‌షిప్ ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోని పాఠశాలలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మట్టిలో మాణిక్యాలైన క్రీడా ప్రతిభను వెలికితీసి రాష్ట్ర స్థాయికి తీసుకురావడంలో శాప్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. క్రీడలు మరుగున పడుతున్న పరిస్థితుల్లో విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతో అవసరమన్నారు. తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు విద్యార్థులను గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.

తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మాట్లాడుతూ, క్రీడలతో విద్య--విద్యతో ఉద్యోగం అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, స్పోర్ట్స్ స్కూల్స్ ఏర్పాటు ద్వారా గ్రామస్థాయి ప్రతిభను గుర్తించి అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు. క్రీడాకారుల కుటుంబాలకు కూడా ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

శాప్ ఛైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ, గతంలో తిరుపతి అంటే శ్రీవారి దర్శనం గుర్తుకు వచ్చేదని, ఇప్పుడు తిరుపతి అంటే స్పోర్ట్స్ తిరుపతి అంటే స్పోర్ట్స్ హబ్ అనే స్థాయికి తీసుకెళ్లే దిశగా చర్యలు జరుగుతున్నాయని అన్నారు. తిరుపతిలో గొల్లవానికుంట క్రీడా ప్రాంగణం, మహిళా విశ్వవిద్యాలయంలో ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియం, ఎస్వీ యూనివర్సిటీ గ్రౌండ్స్ పునరుద్ధరణ, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధి వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అమరావతి ఛాంపియన్‌షిప్--2026లో 175 నియోజకవర్గాల నుంచి క్రీడాకారులు పాల్గొని, వివిధ దశలను దాటి రాష్ట్రస్థాయికి చేరుకున్నారని తెలిపారు. నిజమైన క్రీడా ప్రతిభను వెలికితీయడమే ఈ ఛాంపియన్‌షిప్ ప్రధాన లక్ష్యమన్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్‌ను తిరుపతి ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడా కోటా రిజర్వేషన్‌ను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచడం ద్వారా క్రీడాకారులకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అమరావతి ఛాంపియన్‌షిప్--2026లో పాల్గొంటున్న క్రీడాకారులకు ప్రజాప్రతినిధులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని, ప్రతిభను నిరూపించుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌కు పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఎం ఎల్ సి రామ్ భూపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలను మరింతగా ప్రోత్సహించి విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, మానసిక ఉల్లాసం పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇంత పెద్ద ఎత్తున క్రీడా సంబరాలను నిర్వహించడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది విద్యార్థులు పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అంతరించిపోతున్న క్రీడలను తిరిగి ప్రోత్సహించడంతో పాటు, క్రీడా రిజర్వేషన్‌ను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచి మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు విద్య, ఉద్యోగ రంగాల్లో అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. క్రీడలు విద్యార్థుల శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలకమని, తల్లిదండ్రులు పిల్లలను చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి ఛాంపియన్‌షిప్‌లో వేలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని, ఈ భారీ స్థాయి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అధికారులు, పీఈటీలు, కోచ్‌లు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపుతూ, క్రీడలను విద్యలో భాగంగా ప్రోత్సహిస్తూ ప్రతిభావంతులైన క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.








> ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆంధ్రప్రదేశ్ మల్టీ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ నమోదు
>
> - రాష్ట్రవ్యాప్తంగా క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : క్రీడా, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి
> - క్రీడలతో క్రమశిక్షణ, క్రీడలతో విద్య--ఉద్యోగ అవకాశాలు : రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత
> - క్రీడలు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసానికి మూలం : జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్
> - నిజమైన క్రీడా ప్రతిభను వెలికితీయడమే మా లక్ష్యం :- శాప్ ఛైర్మన్ ఎ. రవి నాయుడు
> - అమరావతి ఛాంపియన్‌షిప్ - రాష్ట్రస్థాయి పోటీలకు సమగ్ర వసతి, సౌకర్యాలు: జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

## మేర్లపాక పంచాయతీలో సర్ ఈ రింగ్స్ ప్రోగ్రాం.... ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీడీవో డాక్టర్ సౌభాగ్యమ్మ

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.

మేర్లపాక గ్రామంలో సర్ ప్రోగ్రాం ఈరింగ్స్ ప్రోగ్రాం జరిగింది. ఈ ఈ ప్రోగ్రాం లో పంచాయతీలో కొంతమంది ఓటర్ల జాబితాలో కొన్ని సవరణలు ఉండడం వల్ల సంబంధించినటువంటి అధికారులు మళ్లీ ఒకసారి వారి యొక్క దరఖాస్తులను ధ్రువపత్రాలను వెరిఫికేషన్ చేసి తదుపరి అన్ని ధూపత్రాలు సక్రమంగా పరిశీలించడం జరిగింది. కార్యక్రమానికి ఎంపిడిఓ సౌభాగ్యమ్మ పంచాయతీ ఇంచార్జ్ కేకే రమణ పంచాయతీ కార్యదర్శి ఝాన్సీ రాణి సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



## నగరపాలక సంస్థకు 31 వినతులు-అదనపు కమిషనర్ శారదా దేవి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 31 వినతులు వచ్చాయని అదనపు కమిషనర్ శారదా దేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 9 మంది, కార్యాలయంకు నేరుగా వచ్చి 22 మంది వినతులు సమర్పించి తమ సమస్యలు తెలిపారు. కాగా భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కరించాలని, వాటర్ కనెక్షన్ లేకున్నా బిల్ వస్తోంది సరిచేయాలని, అనారోగ్యం వలన విధులకు హాజరు కాలేక పోయాను, ఆరోగ్యం కుదుటపడినందున విధుల్లోకి తీసుకోవాలని, రవీంద్ర నగర్ లో తెలుగుగంగ పైప్ లైన్ మరమ్మతులకు తవ్వారు పూడ్చలేదని, ఆగిపోయిన సిసి రోడ్డు పూర్తి చేయాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, సింగాల గుంటలో మా ఇంటికి దారిలేకుండా చేశారని, మాస్థలం ఆక్రమించి నిర్మాణాలు చేశారు సర్వే చేసి అక్రమ నిర్మాణాలు తొలగించాలని, తిలక్ రోడ్ నాగాలమ్మ గుడి వద్ద గుంతలు పూడ్చాలని, పాత మునిసిపల్ ఆఫీస్ వద్ద సిగ్నల్స్ మరమ్మతులు చేయించాలని, లక్ష్మీపురం వద్ద ఉన్న ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ శుభ్రం చేయించాలని, శ్రీనివాస నగర్ ఎస్బిఐ కాలనీలో ప్లాట్ పామ్ ఆక్రమించారు పరిశీలించాలని, చేపల మార్కెట్ వినాయక స్వామీ గుడి వద్ద కుళాయి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్లు తులసి కుమార్, గోమతి, ఏసీపీ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో నూతన మహిళా పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభం

### మహిళల భద్రతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత- రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత





ప్రజా భూమి ప్రతినిధితిరుపతి,

తిరుపతి నగరంలో నూతనంగా నిర్మించిన మహిళా పోలీస్ స్టేషన్ భవనాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత, జిల్లా ఇంచార్జి మంత్రి మరియు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, తిరుపతి చంద్రగిరి, సత్యవేడు, శ్రీ కాళహస్తి,సూళ్లూరుపేట కోడూరు, శాసన సభ్యులు అరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, ఆదిమూలం, బొజ్జల సుధీర్ రెడ్డి, నెలవల విజయశ్రీ, ఆరవ శ్రీధర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్. పి ఎల్ సుబ్బారాయుడులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళల భద్రతకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తిరుపతి నిత్యం దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులతో రద్దీగా ఉండే ప్రముఖ ఆధ్యాత్మిక నగరమని, ఇక్కడ మహిళా పోలీస్ స్టేషన్‌కు సొంత భవనం ఉండాల్సిన అవసరాన్ని గుర్తించి గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసినప్పటికీ, నిధుల కొరత కారణంగా పనులు మధ్యలో నిలిచిపోయాయని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతి పర్యటన సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించడంతో, పోలీసు శాఖ, జిల్లా యంత్రాంగం చొరవతో అవసరమైన నిధులు సమకూర్చి భవన నిర్మాణాన్ని పూర్తి చేసామన్నారు. సుమారు రూ. 2.70 కోట్ల వ్యయంతో 8,480 చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన మహిళా పోలీస్ స్టేషన్ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. మహిళా పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సమస్యలు, మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసులు ఎక్కువగా వచ్చే నేపథ్యంలో వారికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గర్భిణులు, చిన్నారులతో వచ్చే మహిళలకు ప్రత్యేక వసతులతో పాటు కౌన్సెలింగ్ సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కుటుంబ సమస్యల పరిష్కారంలో కౌన్సెలింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన సందర్భాల్లో నిపుణులైన మానసిక వైద్యులను కూడా రప్పించి కౌన్సెలింగ్ అందించేలా చర్యలు చేపట్టడం మంచి పరిణామమన్నారు. వారానికి రెండు సార్లు మానసిక వైద్య నిపుణులతో కౌన్సెలింగ్ నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అవగాహన బోర్డులు కూడా ప్రజల్లో సామాజిక బాధ్యతను పెంపొందించేలా ఉన్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రుల మధ్య జరిగే గొడవల ప్రభావం పిల్లలపై ఎలా ఉంటుందో, తల్లిదండ్రులు, పెద్దలను గౌరవించాల్సిన ఆవశ్యకత వంటి అంశాలను సందేశాత్మకంగా ప్రదర్శించడం అభినందనీయమన్నారు. కుటుంబ సమస్యలకు సంబంధించి ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేయడమే కాకుండా, సాధ్యమైనంత వరకు కౌన్సెలింగ్ ద్వారా సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించాలని సూచించారు. అవసరమైతే ఇరుపక్షాలను పిలిపించి చర్చించి కుటుంబాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.మహిళా పోలీస్ స్టేషన్ పనితీరును మెరుగుపరచడంలో అడిషనల్ ఎస్పీ శ్రీలత చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినందించారు. మహిళా పోలీస్ స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల సంఖ్య కూడా తగ్గుముఖం పట్టిందని తెలిపారు. గత ఏడాది 94 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 58 కేసులకు తగ్గినట్లు వివరించారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న నేరాలతో పాటు మొత్తం నేరాల రేటు కూడా తగ్గుముఖం పట్టిందని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం క్రైమ్ రేట్ సుమారు 14 శాతం తగ్గిందని పేర్కొన్నారు. విజిబుల్ పోలీసింగ్, ఇన్విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడం, పోలీస్ శాఖకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, పోలీసుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా నేర నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రిపవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలో నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.అమరావతి ఛాంపియన్‌షిప్‌లో 10,000 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనగా, వారిలో సుమారు 4,500 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విశ్వాసంతో తమ పిల్లలను కార్యక్రమానికి పంపించడం ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. విద్యార్థినుల భద్రతకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు, కలెక్టర్, ఎస్పీ ప్రత్యేకంగా వేదికను వినియోగించుకుని గంజాయి నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించడం అభినందనీయమన్నారు. గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి జిల్లా కేంద్రంలో మహిళా పోలీస్ స్టేషన్ ఉండేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల్లో ఇప్పటికే మహిళా పోలీస్ స్టేషన్లు ఉన్నాయని, కొత్త జిల్లాల్లో కూడా మహిళా పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. ప్రస్తుతం చాలా జిల్లాల్లో మహిళా పోలీస్ స్టేషన్లు పనిచేస్తున్నప్పటికీ, అన్ని చోట్ల సొంత భవనాలు లేవని, ప్రతి జిల్లా కేంద్రంలో మహిళా పోలీస్ స్టేషన్‌కు సొంత భవనం ఉండేలా దశలవారీగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.తిరుపతికి పోలీస్ కమిషనరేట్ అవసరం ఉందని, దీనికి సంబంధించిన ప్రతిపాదన పరిశీలనలో ఉందని తెలిపారు. తిరుపతిలో పోలీసు సిబ్బంది కొరతతో పని ఒత్తిడి అధికంగా ఉందని, ఈ అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని పేర్కొన్నారు. మహిళల భద్రత, పోలీస్ శాఖకు మౌలిక వసతుల కల్పన, పోలీసుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు రవి మనోహరాచారి శ్రీలత, శ్రీనివాస్, శ్రీనివాసులు, డీఎస్పీలు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఎస్ఐఆర్ ప్రక్రియ సామాన్యుడికి శాపమా?.. తప్పులు అధికారులవి.. శిక్ష ఓటర్లకా..?

### నిబంధనల పేరుతో తిప్పలు.. ఓటు హక్కుపై పౌరుల్లో నైరాశ్యం..-పత్రాల సేకరణ పేరుతో గందరగోళం.. అసలైన ఓటర్లలో ఆందోళన..

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:
ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (సర్ ) ప్రక్రియ క్షేత్రస్థాయిలో సామాన్య ప్రజలకు తీవ్ర మానసిక క్షోభగా మారిందనే తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలనే ఉన్నతాధికారుల తొందరపాటు మరియు ఒత్తిడితో సిబ్బంది ఎలా పడితే అలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏకరూప మార్గదర్శకాలు లేకపోవడంతో ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన నిబంధనలతో ప్రజలను తీవ్ర గందరగోళానికి గురిచేస్తున్నారు. గతంలో అధికారుల నిర్లక్ష్యంతో నమోదైన చిన్నపాటి అక్షర దోషాలను సైతం భూతద్దంలో చూపిస్తూ, ఇప్పుడు మూడు రకాల గుర్తింపు కార్డులు, పాత రికార్డులు సమర్పించాలని హుకుం జారీ చేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ఇవి చాలవన్నట్లుగా ఫోటోలు, వీడియో కాల్ ధ్రువీకరణల పేరుతో ఇబ్బందులు పెడుతుండటంతో సామాన్యులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. దొంగ ఓట్ల ఏరివేత ముసుగులో నిజమైన ఓటర్ల హక్కులకే ఎసరు పెడుతున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో పౌరుడికి అత్యంత కీలకమైన ఓటు హక్కు కోసం ఇంతలా అవస్థలు పడాల్సి రావడంపై “ఈ ఓటు కార్డు మాకొద్దు బాబోయ్” అనే స్థాయికి ప్రజలు విసిగిపోతున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం మొండివైఖరి వీడి, సరళమైన మరియు పారదర్శకమైన పద్ధతులను అమలు చేయాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి.

# 80 ఏళ్ల స్వాతంత్ర్యంలోనూ దళిత -గిరిజన కాలనీలపై వివక్ష ఎందుకీ?


### 36 మండలాల నుంచి కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చిన దళిత-గిరిజనులు



ప్రజా భూమి ప్రతినిధి
తిరుపతి రూరల్

దళిత, గిరిజన, యానాది కాలనీల్లో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం మహాధర్నా నిర్వహించారు. జిల్లాలోని 36 మండలాల నుంచి వందలాది మంది ప్రజలు వ్యక్తిగత అర్జీలతో తరలివచ్చారు. కెవిపిఎస్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాధర్నాకు కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కంకణాల ఆంజనేయులు, వందవాసి నాగరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా, రైతు సంఘం, సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దళిత, గిరిజన కాలనీల్లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్యం, విద్య, ఉపాధి వంటి కనీస సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. శ్మశానాలకు స్థలాలు కేటాయించి, వాటికి దారులు, ప్రహరీ గోడలు, కర్మకాండల కోసం మండపాలు నిర్మించాలని కోరారు. భూమిలేని దళితులకు సాగుభూములు, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ--ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించకుండా దళిత, గిరిజన కాలనీల అభివృద్ధికే వినియోగించాలని కోరారు. కుల వివక్ష, అంటరానితనాన్ని పూర్తిగా నిర్మూలించి దళిత, గిరిజనులకు సామాజిక గౌరవం, సమాన హక్కులు కల్పించాలని నాయకులు అన్నారు. దయ కాదు.. హక్కులు కావాలని, హామీలు కాదు.. అమలు కావాలని స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు ప్రజా పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు, దళిత, గిరిజన ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేణిగుంటలో హోం మంత్రి అనితకు సాదర వీడ్కోలు



ప్రజా భూమిప్రతినిధి రేణిగుంట.
రేణిగుంట: అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న అనంతరం హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం రేణిగుంట రైల్వే జంక్షన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి రైలులో విజయవాడకు బయలుదేరారు. హోం మంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ రవి మనోహర్‌చారి, డీఎస్పీ శ్రీనివాసరావు, రైల్వే డీఎస్పీ శ్రీనివాసాచారి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించి హోం మంత్రికి సాదర వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సీఐ జయచంద్ర, రైల్వే సీఐ యతేంద్ర, ఎస్సై మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అనిత రైలులో విజయవాడకు బయలుదేరారు.

# మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

### చిత్తూరులో మట్టి వినాయక విగ్రహాలను పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యేలు



ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు
వినాయక చవితి పర్వదినం సందర్భంగా చిత్తూరు నగరంలో మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను సోమవారం చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు, శాసనసభ్యులు గురజాల జగన్మోహన్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, జాయింట్ కలెక్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక కాలంలో పెరుగుతున్న కాలుష్యం నుంచి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు, పర్యావరణానికి నష్టం కలిగే అవకాశం ఉన్నందున మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలని సూచించారు. ఈ ఏడాది వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని చిత్తూరు నగర ప్రజలకు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పిలుపునిచ్చారు.

# క్రీడా విప్లవంఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తిరుపతి క్రీడా సంబరాలు పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి
శ్రీకాళహస్తి టౌన్

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి రంగాన్నీ అభివృద్ధి పథం వైపు నడిపిస్తోంది. గ్రామీణ స్థాయి నుంచే యువతలోని ప్రతిభను గుర్తించి వారికి సరైన వేదిక కల్పించాలనే సంకల్పంతో తిరుపతి తారకరామా స్టేడియంలో ‘అమరావతి ఛాంపియన్‌షిప్ 2026’ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను అట్టహాసంగా ప్రారంభించాం. మంత్రులు, తోటి ఎమ్మెల్యేలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, ఆకాశంలోకి బెలూన్లు ఎగురవేసి ఈ క్రీడా సంబరాలకు శ్రీకారం చుట్టడం ఎంతో సంతోషాన్నిచ్చింది.రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి దాదాపు 9 వేల మందికి పైగా అండర్-17, అండర్-23 విభాగాల బాలబాలికా క్రీడాకారులు తరలిరావడంతో తిరుపతి పురవీధులన్నీ క్రీడా శోభతో కళకళలాడుతున్నాయి. ఇంత భారీ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ అమరావతి ఛాంపియన్‌షిప్ ఏకంగా ‘ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్’లో స్థానం దక్కించుకోవడం మన కూటమి ప్రభుత్వ సమర్థవంతమైన పాలనా తీరుకు నిదర్శనం. ఈ రికార్డుకు సంబంధించిన గుర్తింపు పత్రాన్ని ఆ సంస్థ ప్రతినిధి హరీష్ చేతుల మీదుగా క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అందుకోవడం మనందరికీ గర్వకారణం.క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల ప్రోత్సాహకాలు అందిస్తూ వారి ఉజ్జ్వల భవిష్యత్తుకు బాటలు వేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.ఇందుకు నిదర్శనంగా తిరుపతి గొల్లవానిగుంట ప్రాంతంలో నూతనంగా నిర్మించిన అత్యాధునిక క్రీడా ప్రాంగణమే ప్రత్యక్ష ఉదాహరణ. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోం మంత్రి వంగలపూడి అనిత, క్రీడల మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి , జిల్లా ఉన్నతాధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పాల్గొనడం జరిగింది.

# పాకాల మండలంలోని గ్రామ పంచాయతీలలో పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రచురణ..!

### వీటి పై అభ్యంతరాలు ఉంటే ఈనెల 26వ తేదీ లోగా తెలియజేస్తే,వాటిని పరిశీలించి పరిష్కరిస్తాం: ఎంపీడీవో వాసుదేవరావు..



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:
తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజక వర్గం, పాకాల మండలం, పాకాల పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ వాసుదేవరావు మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పాకాల ఎంపీడీఓ వాసుదేవరావు మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాతో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా పంచాయతీ అధికారి వారి ఆదేశాల మేరకు రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా గ్రామ పంచాయతీ కార్యాలయాలలో 23వ తేది పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రచురణ చేశామని చెప్పారు.వీటి పై అభ్యంతరాలు ఉంటే ఈనెల 26వ తేదీ లోగా ఎంపీడీఓ కార్యాలయంలో తెలియజేస్తే,వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు.తర్వాత జిల్లా కలెక్టర్ అనుమతితో 31వ తేదీ ఫైనల్ లిస్టును పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రచురించడం జరుగుతుందని చెప్పారు.పాకాల మండలంలో 22 పంచాయతీలు ఉన్నాయి.వీటిలో ఆదెనపల్లి,బైనపల్లి,కొత్త వడ్డేపల్లి మూడు పంచాయతీలు కోర్ట్ స్టేలో ఉన్నందువలన వీటిలో ఎన్నికలు నిర్వహించడం లేదని చెప్పారు.మిగిలిన 19 గ్రామ పంచాయతీలలో,192వార్డులలో ఎన్నికల నిర్వహించబడతాయని చెప్పారు.ఈ సమాచారాన్ని పాకాల మండల ప్రజలు గుర్తించవలసిందిగా కోరారు.కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ శశిరేఖ,ఈ.ఓ అబిద్ పాల్గొన్నారు.

# శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న జడ్జి'లు...!

### జడ్జి'లకు పూర్ణకుంభం,మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికిన ఆలయ కమిటీ చైర్మన్,సిబ్బంది..



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:
నియోజకవర్గం పరిధిలోని, పాకాల మండలం, ఊట్లవారిపల్లి సమీపంలో ఆనందగిరి పై వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి పద్మజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి,పాకాల జూనియర్ సివిల్ జడ్జి పి.పూర్ణిమదేవి కుటుంబ సభ్యులు,సిబ్బందితో కలిసి ఆదివారం దర్శించుకున్నారు.వీరికి ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు,సిబ్బంది కలిసి పూర్ణకుంభం,మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు.స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.వీరికి ఆలయ మర్యాదలతో సత్కరించారు.ఈకార్యక్రమంలో న్యాయవాదులు గురుస్వామి నాయుడు,చిన్న రెడ్డప్ప నాయుడు,సలీమ్,పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రమౌళి,ఆలయ సిబ్బంది కోరా ప్రకాష్ నాయుడు,తేనెపల్లి మణి,భాస్కర్,తదితరులు పాల్గొన్నారు.

# బయోఫార్మాస్యూటికల్స్ లో అభివృద్ధి, విస్తరణ మరియు జిపిఎం అంశంపై సెమినార్







ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం
రామచంద్రాపురం మండలంలోని వెంకట్రామాపురం లో ఉన్న సెవెన్ హిల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో పరిశోధన నుండి వాణిజ్య ఔషధాల వరకు: బయోఫార్మాస్యూటికల్స్ లో ప్రక్రియ అభివృద్ధి, విస్తరణ మరియు జిఎంపి అంశంపై సోమవారం సెమినార్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిపుణుడు డా. శ్రీనివాసులు బండి, ప్రెసిడెంట్ & ప్రిన్సిపల్ కన్సల్టెంట్, బిఎస్ఎల్ బయోలాబ్స్ ఐ ఎన్ సి., కెనడా, మాట్లాడుతు ప్రయోగశాలలో కనుగొన్న ఔషధాన్ని పెద్ద స్థాయిలో తయారు చేయడానికి సరైన విధానాన్ని రూపొందించడం, ప్రయోగశాల స్థాయి నుండి పరిశ్రమ స్థాయి వరకు ఉత్పత్తి విస్తరించడం, ఔషధ తయారీకి సంబంధించిన అంతర్జాతీయ ప్రమాణాలు ఎలా అనుసరించాలి గురించి వివరాలు అందించారు. అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మయ్య, బయోఫార్మాస్యూటికల్స్ లో ప్రాసెస్ డెవలప్ మెంట్, స్కేల్-అప్ మరియు జిఎంపి అంశాలపై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అలాగే, వాటిని ప్రామాణిక నాణ్యతతో అందించే నైపుణ్యాలను నేర్చుకోవాలని సూచించారు. మెరుగైన ప్రమాణాలతో మందుల తయారీకి సంబంధించి అభివృద్ధి చేయబడిన తాజా పోకడలు, పురోగతి మరియు సాంకేతికతలపై వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. ప్రసన్న రాజు ప్రసంగించారు. ఈ సాంకేతిక సమావేశాన్ని నిర్వహిస్తున్నందుకు కరస్పాండెంట్ శ్రీమతి ఎం. సుమలత మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. నిరంజన్ బాబు తమ శుభాకాంక్షలను తెలియజేశారు.ఈ సమావేశంలో విద్యార్థులు, బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై బీఆర్సీ పాయింట్ పర్సన్స్‌కు శిక్షణ



ప్రజా భూమి ప్రతినిధి
తిరుపతి రూరల్

తిరుపతి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముగం ఆదేశాల మేరకు, అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి రూరల్, రేణిగుంట మండలాలకు చెందిన బీఆర్సీ పాయింట్ పర్సన్స్‌కు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి రూరల్ మండలం వేమూరు గ్రామంలోని జిల్లా నోడల్ బీఆర్సీ కేంద్రంలో ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది. ప్రతి వీవోకు బీఆర్సీ పాయింట్ పర్సన్ ఉండేలా చర్యలు తీసుకుంటూ, వారికి ప్రకృతి వ్యవసాయంపై మెరుగైన అవగాహన, శిక్షణ కల్పించేందుకు ఈ కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే జీవ ఉత్ప్రేరకాలు, గ్రోత్ ప్రమోటర్లు, కషాయాలు, వివిధ రకాల తెగుళ్ల నివారణ పద్ధతులపై ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ దామా అయ్యప్ప నాయుడు శిక్షణ అందించారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఎంటీ ఉషారాణితో పాటు 20 మంది బీఆర్సీ పాయింట్ పర్సన్స్ పాల్గొన్నారు.



# వివాదాస్పదంగా మారిన దేవాలయ భూముల కేటాయింపు

- ఒక డిప్యూటీ కమిషనర్ కేటాయింపు మరో డిసి రద్దు చేస్తూ ఆదేశాలు
- నిబంధనలు పాటించలేదని ఈవో పై డిప్యూటీ కమిషనర్ ఆగ్రహం
- ఏక పక్షంగా వేలం పాట నిర్వహించారని ఆగ్రహం వ్యక్తం చేసిన డీసీ
- నిబంధనల ప్రకారమే -వేలంపాటలో భూమిని దక్కించుకున్నాం
- డిసి, ఏసీల సమక్షంలోనే వేలంపాట నిర్వహణ జరిగింది
- ధ్రువీకరణ పత్రాలతో మట్టం మురళి ఆవేదన





ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,

గూడూరు పట్టణంలోని శ్రీ ధర్మరాజు స్వామి దేవస్థానం, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానాలకు సంబంధించిన భూముల వేలం పాటల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. దేవాదాయ శాఖ నిబంధనలకు అనుగుణంగా బహిరంగ వేలంపాట నిర్వహించకుండా కొంతమంది వ్యక్తులకే ఆలయ భూములు కేటాయించినట్లు ఆరోపణలు రావడంతో, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఆ కేటాయింపులను రద్దు చేసి సెప్టెంబర్ 9వ తేదీన బహిరంగ వేలం ప్రకటిస్తామని తెలిపారు. ముఖ్యంగా ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా గూడూరు మండలం వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం చెందిన గూడూరు మండలం చెన్నూరు గ్రామం నందు గల సర్వే నంబర్ 1720 లో 0. 31 సెంట్లు, 323-1, ఏ.1-19,,323-2లో 1 ఏ.1.19 లో సెంట్లు భూమి ఉంది. చెన్నూరు గ్రామ పరిధిలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన భూమిని మట్టం మురళికి 2026 -2027 నుండి 2036-37 వరకు అంటే 11 సంవత్సరాల కాలానికి లీజుకు కేటాయిస్తూ 9-4-2026 న డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాణ అధికారి నిర్వహించిన వేలం పాటలో హెచ్చు పాట దక్కించుకున్న మట్టం మురళి కి అప్పగిస్తూ ధ్రువీకరణ పత్రం ఇచ్చినట్లు తెలిసింది. అయితే ఉన్నతాధికారుల నుంచి అవసరమైన అనుమతులు లేకుండానే ఈ కేటాయింపు జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇచ్చిన దృవీకరణ కేటాయింపు ఆధారంగా మురళి లక్షల రూపాయలు ఖర్చు చేసి భూమికి మట్టి తోలించి చదును చేసినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం (21వ తేదీ) గూడూరు శ్రీ ధర్మరాజు స్వామి ఆలయంలో దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో భూముల వేలంపాటకు ఏర్పాట్లు జరుగుతుండగా, ఎలాంటి ముందస్తు పత్రికా ప్రకటనలు ఇవ్వకుండా, ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా వేలంపాట నిర్వహించడం సరికాదంటూ కొంతమంది స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం..ఫిర్యాదుపై స్పందించిన దేవాదాయ శాఖ అధికారులు దేవాలయ భూము లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారి పరిశీలనలో శాఖాపరమైన అనుమతులు లేకుండా భూమిని ఎలా స్వాధీనం చేసుకు న్నారని ప్రశ్నించినట్లు తెలిసింది. తాము నిర్ణయించిన మొత్తాన్ని చెల్లించి భూమిని స్వాధీనం చేసుకున్నామని మట్టం మురళి అధికారులకు వివరించినట్లు సమాచారం. అయితే సంబంధిత కేటాయింపు నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని , దానికి కారణమైన ఈవో రవి కృష్ణపై కేసు నమోదు చేయాలని డిప్యూటీ కమిషనర్ వేలంపాట తగ్గించుకున్న మట్టం మురళికి సూచించడంతో కంగుతున్నాడు. వివాదాస్పదంగా మారిన దేవాలయ భూముల కేటాయింపులు అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# ఫిన్లాండ్ విద్యా అధ్యయనంలో బాలు



ప్రజాభూమి ప్రతినిధి తొట్టంబేడు

దిగువ సాంబయ్య పాళెం ఫౌండేషన్ స్కూల్ లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కయ్యూరు బాలసుబ్రమణ్యం ఈ నెల 16లో తేది విద్యా అధ్యయన పర్యటనకు ఫిన్లాండ్ కి బయలుదేరిన విషయం విదితమే. టుర్కు విశ్వవిద్యాలయం అనుబంధ విద్యా సంస్థలలో బాలు వారి విద్యావిధానం ను పరిశీలించారు. అనేక విషయాల పై చర్చించారు. ఈ నెల 28 వరకు టుర్కు, రౌమా నగరంలో వివిధ విద్యాసంస్థలు పర్యటించి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నారు.

# ఎంజీఎం హాస్పిటల్స్ నందు మెగా రక్త దాన శిబిరం




ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి ఎంజీఎం గ్రూప్ చైర్మన్ గుడ్లూరు మల్లికార్జున నాయుడు జన్మదినం సందర్భంగా ఎంజీఎం హాస్పిటల్స్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రేపు అనగా బుధవారం ఉదయం 9 గంటల నుండి ఎంజీఎం హాస్పిటల్స్ ఆవరణలో మెగా రక్త దాన శిబిరం నిర్వహించబడునని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ మరియు ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ గుడ్లూరు మయూర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా రక్తదాన శిబిరం జరిగే బుధవారం రోజు ప్రత్యేకశీ గా ఎంజీఎం హాస్పిటల్స్ నందు సందర్శించు ప్రజలకు డాక్టర్ కన్సల్టెన్సీ ఫీజు పూర్తి ఉచితం అని అలాగే దాదాపు 2500 రూపాయలు విలువ చేసే ఎముకల పటుత్వ పరీక్ష (బీఎండ్)పూర్తి ఉచితం గా చేస్తారని తెలిపారు. ఈ రక్త దాన శిబిరం లో శ్రీకాళహస్తి ఎంజీఎం గ్రూప్ కుటుంబ సభ్యులు మరియు శ్రీకాళహస్తి పుర ప్రజలు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకొనగలరని తెలిపారు.

# రామచంద్రపురంలో శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి ఆరాధన ఉత్సవాలు ముఖ్య అతిథిగా హాజరైన ఆలయ మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు



ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు

మండలంలోని రామచంద్రపురం గ్రామంలో శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి వారి ఆరాధనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ఆయన భగవాన్ వెంకయ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు పీజె చంద్రయ్య శెట్టి కుమారుడు పీజీ తులసి కృష్ణహొహొహొఆయనకు శేషవస్త్రం సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. పూజా కార్యక్రమాల అనంతరం శ్రీనివాసులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, భక్తులకు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వయంగా వితరణ చేశారు. ఈ సందర్భంగా మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన కాలంగి గ్రామానికి చెందిన భత్తీ రెడ్డి నీ అభినందించినారు. అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పది. ఈ విధమైన అన్నదాన కార్యక్రమాన్ని ఇంత గొప్పగా నిర్వహించినందుకు మీకు, మీ కుటుంబ సభ్యులకు కూడా ఆ వెంకటేశ్వరస్వామి వారి ఆశీస్సులు ఉంటాయని ఈ సందర్భంగా తెలియజేశారు. గతంలో పి.జె చంద్రయ్య అనేక వెంకటేశ్వరస్వామి ఉత్సవాలు జరిపినారు. ఆయన యొక్క ఆఖరి కోరిక నవగ్రహాలు దంపతుల సమేతంగా అంటే తొమ్మిది గ్రహాలు సతీసమేతంగా విగ్రహాలు ఏర్పాటు చేయాలని వాటన్నింటినీ కూడా తొందరలోనే గ్రామ పెద్దలతో చర్చించి, కుంభాభిషేకానికి కూడా నిర్వహించే ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు , శ్రీవారి సురేష్, మొగరాల గణేష్, దాము, గిరి గౌడ్, గ్రామ ప్రజలు మరియు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పాపానాయుడుపేటలో వైభవంగా శ్రీ ధర్మరాజుల స్వామి అగ్నిగుండ బ్రహ్మోత్సవం పాల్గొన్నలో పాల్గొన్న: దండి నరేంద్ర


**– భక్తిశ్రద్ధలతో శ్రీ ధర్మరాజుల స్వామిని దర్శించుకున్న దండి నరేంద్ర భక్తి, ఆధ్యాత్మికత, ప్రశాంతతకు ప్రతీకగా శ్రీ ధర్మరాజుల స్వామి అగ్నిగుండ బ్రహ్మోత్సవం**



ప్రజాభూమి ప్రతినిధి -శ్రీకాళహస్తి టౌన్

ఏర్పేడు మండల జనసేన పార్టీ అధ్యక్షులు, గుడిమల్లం ఆలయ బోర్డు సభ్యులు కిరణ్ రామిశెట్టి ప్రత్యేక ఆహ్వానం మేరకు పాపా నాయుడుపేటలో జరిగిన శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజు స్వామి అగ్ని గుండ మహోత్సవంలో పాల్గొని తొలుత శ్రీ వినాయక స్వామి, అనంతరం శ్రీ ధర్మరాజు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించాను. పవన్ కళ్యాణ్, రైతులు, సామాన్య ప్రజలు, పశుపక్ష్యాదులు, ప్రకృతి--పర్యావరణం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించాను. ఆలయ ఈఓ, స్థానిక ఎన్డీఏ నాయకులతో మాట్లాడి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించాను. అనంతరం భక్తులకు అన్నదాన సేవలో పాల్గొని స్వయంగా అన్న ప్రసాదం వడ్డించడం ఎంతో సంతృప్తినిచ్చింది. ఈ సందర్భంగా నన్ను ఆత్మీయంగా ఆదరించి, కార్యక్రమం మొత్తం ఎంతో చక్కగా చూసుకున్న ఏర్పేడు మండల జనసేన అధ్యక్షులు కిరణ్ రామిశెట్టి కి, జనసేన నాయకులు పి. వంశీకృష్ణ, యం. భానుచంద్ర, ఎస్. వరదరాజులు, సి. తేజ, వి. మోహన్ తదితరులకు హృదయపూర్వక ధన్యవాదాలు. నా వెంట శ్రీకాళహస్తి జనసేన నాయకులు బొక్కిసం రాజశేఖర్, తొన్నాటి సుబ్రహ్మణ్యం, రాజేష్ పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# చిత్తూరు టీడీపీ సీనియర్ నాయకుడు చెరుకూరి వసంత్ కుమార్ మృతి



ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు

చిత్తూరుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చెరుకూరి వసంత్ కుమార్ బెంగళూరులో గుండెపోటుతో మృతి చెందారు. బెంగళూరులో ఓ ఫంక్షన్‌కు హాజరైన వసంత్ కుమార్ భోజనం చేస్తుండగా అకస్మాత్తుగా గుండె నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు, సన్నిహితులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఆసుపత్రి నుంచి బయటకు వచ్చిన కొద్దిసేపటికే మరోసారి తీవ్ర గుండె నొప్పి రావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సన్నిహితులు తెలిపారు. వసంత్ కుమార్ మృతి చిత్తూరు రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తూ, కార్యకర్తలకు అండగా నిలిచిన ఆయన సౌమ్య స్వభావం, ఆత్మీయత, సేవా దృక్పథంతో అందరి మన్ననలు పొందారు. తనను ఆశ్రయించిన వారికి సాధ్యమైనంత వరకు సహాయం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేసిన వ్యక్తిగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తూ, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలిచి, ప్రజా సేవలో తనదైన ముద్ర వేసిన చెరుకూరి వసంత్ కుమార్ ఆకస్మిక మరణం చిత్తూరు టీడీపీకి, ఆయనను అభిమానించే ప్రజలకు తీరని లోటు కాదా? ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయనకు ఘన నివాళులు అర్పిద్దాం అని సన్నిహితులు తెలిపారు.

# గూడూరులో వరద ప్రవాహ మార్గాలను కాపాడాలి - సర్వే నంబర్ 476 - 477లో లే-అవుట్‌పై తక్షణ విచారణ జరపాలి

### మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు - విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని హామీ





ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,

గూడూరు పట్టణానికి సమీపంలోని తాళ్లమ్మ ఆలయం ఎదురుగా ఉన్న 476 - 477 ప్రాంతంలో భారీ స్థాయిలో లే-అవుట్ అభివృద్ధి జరుగుతున్నట్లు, భూమిని సుమారు 20--30 అడుగుల మేర మట్టి/గ్రావెల్‌తో నింపి ఎత్తు పెంచుతున్నట్లు వస్తున్న ఫిర్యాదులపై జిల్లా యంత్రాంగం తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ – జిల్లా మేజిస్ట్రేట్‌కు సమగ్ర ఫిర్యాదు సమర్పించినట్లు ఆయన తెలిపారు.

**మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు -- విచారణకు హామీ**

ఈ అంశంపై గూడూరు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి ప్రత్యేకంగా ఫిర్యాదు చేసినట్లు పంటా శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. సర్వేనెంబర్ 476 ☐ 477లలో జరుగుతున్న లే-అవుట్ అభివృద్ధి, భారీగా మట్టి/గ్రావెల్ నింపడం, సమీపంలోని సర్వే నంబర్ 475/2 చల్లకాలువ సహజ వరద ప్రవాహానికి ఏర్పడే అవకాశం ఉన్న ఆటంకం, అలాగే భవిష్యత్తులో పరిసర ప్రాంతాలకు ఏర్పడే ముంపు ప్రమాదంపై మున్సిపల్ కమిషనర్‌కు వివరించినట్లు తెలిపారు. ఫిర్యాదును పరిశీలించిన గూడూరు మున్సిపల్ కమిషనర్, ఈ అంశంపై విచారణ చేపట్టి, సంబంధిత రికార్డులు మరియు స్థల పరిస్థితులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పంటా శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. మున్సిపల్ కమిషనర్ స్పందనను స్వాగతిస్తున్నామని, విచారణ పారదర్శకంగా నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

**చల్లకాలువకు ఆటంకం ఏర్పడితే గూడూరుకు ముంపు ప్రమాదం**

సర్వేనెంబర్ 475/2లోని చల్లకాలువ సహజ వరద నీటి ప్రవాహానికి కీలకమైన మార్గం అని, సర్వేనెంబర్ 476 ☐ 477లు దానికి సమీపంలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. చల్లకాలువ బ్రిడ్జి వద్ద 9 క్లియర్ స్పాన్లు ఉన్న నేపథ్యంలో, వరద సమయంలో వాటి ద్వారా వెళ్లే నీటి ప్రవాహ సామర్థ్యాన్ని అధికారులు సాంకేతికంగా పరిశీలించాలని కోరారు. భూమిని 20--30 అడుగుల మేర ఎత్తు పెంచడం వల్ల సహజ వరద నీటి ప్రవాహానికి ఏమైనా ఆటంకం ఏర్పడుతుందా, నీరు వెనక్కి మళ్లే ప్రమాదం ఉందా అనే అంశాన్ని ఇరిగేషన్, రెవెన్యూ, సర్వే మరియు విపత్తు నిర్వహణ శాఖల నిపుణులతో పరిశీలించాలని ఆయన అన్నారు.

**2015 భారీ వరదను అధికారులు మర్చిపోవద్దు**

గూడూరు ప్రాంతంలో 2015లో భారీ వరద పరిస్థితి ఏర్పడిందని, గత రికార్డుల ప్రకారం సుమారు 2.5 లక్షల క్యూసెక్కుల భారీ వరద ప్రవాహం నమోదైనట్లు పేర్కొనబడుతున్నందున, దానికి సంబంధించిన అధికారిక రికార్డులను జిల్లా యంత్రాంగం పరిశీలించి వాస్తవ ప్రవాహ పరిమాణాన్ని నిర్ధారించాలని పంటా శ్రీనివాసులు రెడ్డి కోరారు. అలాగే సంబంధిత రైల్వే బ్రిడ్జి ప్రాంతంలోని హెచ్ ఎఫ్ ఎల్ 11--15 వివరాలను పరిశీలించి, ప్రస్తుత లే-అవుట్ స్థాయి మరియు గతంలో నమోదైన గరిష్ఠ వరద స్థాయిని సాంకేతికంగా పోల్చాలని సూచించారు. వ్యవసాయ భూములు, నివాస ప్రాంతాలు, రైల్వేకు ప్రమాదం ఉండకూడదు. వరద నీటి సహజ ప్రవాహానికి ఆటంకం ఏర్పడితే నీరు వెనక్కి మళ్లి తాళ్లమ్మ ఆలయం పరిసర ప్రాంతాలు, బనికె సాహెబ్ పేట, నరసింగరావు పేట, జనార్దన్ రెడ్డి కాలనీ, నారాయణ కాలేజీ పరిసర ప్రాంతాలు, సర్వే నెంబర్. 473 ☐ 474 వ్యవసాయ భూములు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందా అనే అంశాన్ని అధికారులు ముందుగానే అధ్యయనం చేయాలని ఆయన అన్నారు.

అదేవిధంగా రైల్వే ట్రాక్‌కు సమీపంలోని సర్వే నెంబర్. 480 ☐ 481/1 ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని, లే-అవుట్ అభివృద్ధి వల్ల రైల్వే భద్రతకు ఎటువంటి ప్రమాదం లేదని సంబంధిత రైల్వే అధికారులు ధృవీకరించాల్సిన అవసరం ఉ ందన్నారు.

**అనుమతులపై పూర్తి విచారణ జరపాలి**

సర్వే నెంబర్. 476 ☐ 477లకు సంబంధించిన లే-అవుట్ అనుమతులు, ల్యాండ్ కన్వర్షన్ పత్రాలు, రెవెన్యూ రికార్డులు, సర్వే/ ఎఫ్ఎంబి వివరాలు, ఇరిగేషన్ మరియు మున్సిపల్ అనుమతులు, అవసరమైన ఎన్ఓసిలను అధికారులు పరిశీలించాలని పంటా శ్రీనివాసులు రెడ్డి కోరారు. అలాగే భారీగా నింపుతున్న మట్టి/గ్రావెల్ ఎక్కడి నుంచి వచ్చింది, ఎంత పరిమాణంలో తరలించారు, సంబంధిత అనుమతులు ఉన్నాయా అనే అంశంపై మైన్స్ ☐ జియాలజీ మరియు రెవెన్యూ శాఖలు విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

**అన్ని శాఖలతో సంయుక్త స్థల పరిశీలన జరపాలి**

ఈ అంశాన్ని సాధారణ లే-అవుట్ వివాదంగా కాకుండా ప్రజా భద్రత మరియు భవిష్యత్ వరద ముప్పుకు సంబంధించిన అత్యవసర అంశంగా పరిగణించాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, సర్వే, ఇరిగేషన్, రైల్వే, గూడూరు మున్సిపాలిటీ, ఏపీపీసీబీ, మైన్స్ ☐ జియాలజీ, విపత్తు నిర్వహణ, ఎలక్ట్రికల్ మరియు సంబంధిత సాంకేతిక శాఖల అధికారులతో తక్షణం సంయుక్త స్థల పరిశీలన నిర్వహించి, సాంకేతిక నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**"ప్రజల భద్రతే మొదటి ప్రాధాన్యత"**

"ఒక లే-అవుట్ అభివృద్ధి కోసం గూడూరు పట్టణ ప్రజల భద్రతను, చల్లకాలువ సహజ వరద ప్రవాహాన్ని, వ్యవసాయ భూములను మరియు చెన్నై--విజయవాడ రైల్వే మార్గ భద్రతను పణంగా పెట్టే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే పనులను తక్షణమే నిలిపివేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ప్రజా భద్రతకు సంబంధించిన అంశంలో అధికారులు వేగంగా స్పందించి, పారదర్శకంగా విచారణ నిర్వహించాలని" పంటా శ్రీనివాసులు రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ రామకృష్ణయ్య,సర్వేపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ మరియు ఐఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పూల చంద్ర శేఖర్, ,బిసి జిల్లా నాయుకులు గుంటమడుగు సుబరామరాజు ,మైనారిటీ జిల్లా అధ్యక్షుడు ఫయాజ్,చిలకూరు మండలం కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుకూరి వేమయ,పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్ కుమార్ ,సైదాపురం మండల అధ్యక్షుడు మురారి కిష్టయ్య,గూడూరు మండల అధ్యక్షుడు సుబ్బారావు ,అంకయ తదితరులు పాల్గొన్నారు

# విలువలతో కూడిన విద్యే ఉత్తమ సమాజానికి పునాది

### విద్యార్థుల్లో నైతిక విలువలు, సత్ప్రవర్తన, ఆధ్యాత్మికతను పెంపొందించడమే "సద్గమయ" లక్ష్యం - డీపీపీ కార్యదర్శి డా. మేడసాని మోహన్



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

విద్యార్థుల్లో నైతిక విలువలు, సత్ప్రవర్తన, ఆధ్యాత్మిక అవగాహనతో పాటు సనాతన ధర్మంపై జ్ఞానాన్ని పెంపొందించడమే "సద్గమయ" కార్యక్రమం ప్రధాన లక్ష్యమని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి డా. మేడసాని మోహన్ తెలిపారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఉన్నత పాఠశాలలో సోమవారం "సద్గమయ" కార్యక్రమాన్ని డా. మేడసాని మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యతో పాటు విలువలు, సంస్కారం, ఆధ్యాత్మిక చైతన్యం అందించినప్పుడే ఉత్తమ వ్యక్తిత్వం, బాధ్యతాయుత పౌరసమాజం నిర్మాణమవుతుందని అన్నారు. వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురాణాలు, భగవద్గీతతో పాటు మహనీయుల జీవితాలు, వారి బోధనల ద్వారా విద్యార్థులకు విలువాధారిత విద్యను అందించనున్నట్లు తెలిపారు. "సద్గమయ" ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, భక్తి, సత్యనిష్ఠ, సత్ప్రవర్తన, దేశభక్తి, భారతీయ సంస్కృతిపై గౌరవం వంటి సద్గుణాలను విద్యార్థుల్లో పెంపొందిస్తామని చెప్పారు. నీతి పద్యాలు, సుభాషితాలు, ఎంపిక చేసిన పద్యాలను విద్యార్థులు నేర్చుకుని, వాటి భావాలను అర్థం చేసుకుని జీవితంలో ఆచరించేలా ప్రోత్సహిస్తామన్నారు. దీనివల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, వ్యక్తీకరణ సామర్థ్యంతో పాటు నైతిక వ్యక్తిత్వం కూడా వికసిస్తుందని వివరించారు. ప్రహ్లాదుడు, ధ్రువుడు, నచికేతుడు వంటి బాల భక్తుల అచంచల భక్తి, ధైర్యం, ఏకాగ్రత, పట్టుదలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. భక్తి, జ్ఞానం, సత్ప్రవర్తనతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సాధారణ విద్యతో పాటు విలువాధారిత, ఆధ్యాత్మిక విద్యను అందించి సంస్కారవంతమైన, క్రమశిక్షణ కలిగిన, బాధ్యతాయుత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే "సద్గమయ" ధ్యేయమని డా. మేడసాని మోహన్ స్పష్టం చేశారు.

**టీటీడీ పాఠశాలల్లో 1,678 మంది విద్యార్థులకు "సద్గమయ"**

ఆగస్టు 24 నుంచి 27వ తేదీ వరకు తిరుపతి, తిరుమలలోని 7 టీటీడీ పాఠశాలల్లో 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు "సద్గమయ" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో మొత్తం 1,678 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. కార్యక్రమంలో వేద ఆశీర్వచనం, క్విజ్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేయడంతో పాటు విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు తదితర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీపీపీ అదనపు కార్యదర్శి కల్యాణి, ఏఈవో సత్యనారాయణ, శ్రీ గోవిందరాజస్వామి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దోషులను కఠినంగా శిక్షించాలి బిజెపి చంద్రారెడ్డి ఆదేశాలతో




ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

వాకాడు మండల తాసిల్దార్ కు వాకాడు పోలీస్టేషన్లో, జిల్లా బీజేపీ పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కాల వల్లి ప్రసాద్,ఓ బీసి మోర్చా అధ్యక్షుడు ఐ శ్రీనివాసులు సోమవారం తాసిల్దార్ సయ్యద్ ఇక్బాల్ కు, వినతి పత్రం అందించారు, బిజెపి పార్టీ ఆదేశాల మేరకు తహశీల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాల వల్లి ప్రసాద్ మాట్లాడుతూ కాకినాడలో చోటుచేసుకున్న నుకరాజు ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఈ,నుకరాజు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, ఘటనకు కారణమైన వారితో పాటు వారికి సహకరించిన లేదా అండగా నిలిచిన వ్యక్తులపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. అంతర్జాతీయ పాఠశాలలో రైఫిల్ షూటింగ్ శిక్షకుడుగ పనిచేస్తున్న సాదిక్ ఖాన్‌కు సంబంధించిన అంశాలపై కూడా సమగ్ర దర్యాప్తు జరిపించాలని అన్నారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా పోలీసు శాఖ, ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

ప్రజాభూమి

జనరల్ 11

మంగళవారం 25 ఆగష్టు 2026

# కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

కర్ణాటక రాష్ట్రం శివమొగ్గలోని నెహ్రూ స్టేడియంలో ఈనెల 22, 23 తేదీల్లో శివమొగ్గ సిటీ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 7వ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో హిందూపురం కరాటే విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ అంతర్జాతీయ పోటీల్లో హిందూపురంలోని కరాటే మాస్టర్ సెన్సేయి ఎస్. ఫైరోజ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న నలుగురు విద్యార్థులు పాల్గొని పలు విభాగాల్లో పతకాలు సాధించారు. షోటోకాన్ వరల్డ్ కరాటే, అమెరికా గ్రాండ్ మాస్టర్ పెర్రీ యఫ్. మౌలే ముఖ్య అతిథిగా హాజరైన ఈ పోటీల్లో జాన్ విక్టర్ కటా, ఫైట్ విభాగాల్లో ప్రథమ స్థానాలు సాధించాడు. రిషి రామ్ కటా విభాగంలో ప్రథమ స్థానం పొందగా, సజ్జద్ కటా విభాగంలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. నేహా కటా, ఫైట్ విభాగాల్లో తృతీయ స్థానాలు సాధించి ప్రతిభ కనబరిచింది. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో హిందూపురం విద్యార్థులు విజయాలు సాధించడం పట్ల సెన్సేయి ఎస్. ఫైరోజ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పోటీల్లో తాను, సీనియర్ ఉసమ ఖాన్ ఉత్తమ రెఫరీలుగా ఎంపికైనట్లు ఆయన తెలిపారు. విజేతలకు ప్రముఖులు మెడల్స్, మొమెంటోలు అందజేసి అభినందించినట్లు ఫైరోజ్ పేర్కొన్నారు. విద్యార్థుల విజయాల పట్ల వారి తల్లిదండ్రులు, కరాటే శిక్షకులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

## ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను విడుదల చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల వివరాలను ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచారు. హిందూపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి దామోదరమ్మ ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాను విడుదల చేసి, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ప్రజల పరిశీలన కోసం ఏర్పాటు చేశారు. అదేవిధంగా అన్ని సచివాలయాల జాబితాను ప్రచురించారు. మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో, ఆయా గ్రామాల్లోని ప్రముఖ ప్రదేశాల్లో కూడా పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను ప్రజల అవగాహన, పరిశీలన కోసం అందుబాటులో ఉంచారు. ప్రజలు తమ గ్రామానికి సంబంధించిన పోలింగ్ కేంద్రాల వివరాలను పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలు లేదా సూచనలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్‌తో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డివైడర్ల మధ్య ఉన్న ప్రచార హోర్డింగ్స్ తొలగింపు-"ప్రజాభూమి"కి స్పందన



ప్రజాభూమి, హిందూపురం టౌన్

డివైడర్ల మధ్య ఏర్పాటు చేసిన ప్రచార హోర్డింగ్స్‌పై ప్రజాభూమిలో ప్రచురితమైన కథనానికి పురపాలక అధికారులు స్పందించారు. టౌన్ ప్లానింగ్ అధికారి (టీపీఓ) అబ్దుల్ సత్తార్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది పట్టణంలోని డివైడర్ల మధ్య ఏర్పాటు చేసిన ప్రచార హోర్డింగ్స్‌ను తొలగించారు. తొలగించిన హోర్డింగ్స్‌ను సిబ్బంది మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. పురపాలక సంఘ పరిధిలో ప్రకటన పన్ను చెల్లించి, నిబంధనల మేరకు అనుమతి పొందిన అనంతరం మాత్రమే ఫ్లెక్సీలు, ప్రచార హోర్డింగ్స్ ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ప్రచార సామగ్రిని తొలగించడంతో పాటు సంబంధిత వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని టీపీఓ అబ్దుల్ సత్తార్ స్పష్టం చేశారు. ప్రజా ఆస్తులైన డివైడర్లను అనధికారికంగా ప్రచారానికి వినియోగించకుండా చర్యలు కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

# త్రాగునీటి సమస్య త్వరలోనే పరిష్కరిస్తాం

### -స్పందించిన పంచాయతీ అధికారులు



ప్రజా భూమి శింగనమల

శింగనమల మండలం నాగుల గుడ్డం తండాలో తాగునీటి సమస్య ఎక్కువైంది సమస్య తెలుసుకున్న జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ నాయక్ అధికారులకు సమాచారం ఇచ్చారు సమస్య తెలుసుకొని అధికారులు వెంటనే నాగులగుడ్డం దేవుల చెరువు లో ఉన్న బోరును పరిశీలించారు ఆ బోరులో నీరు పాతాళంలోకి వెళ్లిపోవడంతో నీటి సమస్య ఎక్కువైంది అందుకు అధికారులు స్పందిస్తూ త్వరలో కొత్త బోరు వేస్తామని హామీ ఇచ్చారు తండాకు త్రాగునీటి సమస్య లేకుండా చేస్తామని అధికారులు చెప్పారు ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ అక్బర్ వలి పంచాయతీ సెక్రెటరీ సాయి చరణ్ అసిస్టెంట్ ఇంజనీర్ పుండరీకాక్ష ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ సీన తదితరులు పాల్గొన్నారు

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి: పెళ్లకూరు పిహెచ్‌సిని తనిఖీ చేసిన డిఎమ్‌హెచ్‌ఓ




ప్రజా భూమి ప్రతినిధి పెళ్లకూరు.

గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్యం మరింత చేరువకావాలని, ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని తిరుపతి జిల్లా వైద్యాధికారి డాక్టర్ శాంతకుమారి సూచించారు. శనివారం పెళ్లకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించి, పలు విభాగాలను తనిఖీ చేశారు.

రిజిస్టర్లు, మందుల నిల్వల పరిశీలన : సందర్శనలో భాగంగా ఆస్పత్రిలోని మందుల గది , ఇన్‌పేషెంట్ వార్డులు మరియు ప్రయోగశాలను జిల్లా వైద్యాధికారి పరిశీలించారు. ల్యాబ్‌లో రికార్డులను, రోగుల వివరాలను పొందుపరిచిన రిజిస్టర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆస్పత్రికి అవసరమైన మందుల నిల్వలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సుజాత, సిహెచ్ శివారెడ్డి మరియు ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్సీపురంలో ముమ్మరంగా సర్ విచారణ కార్యక్రమం

### 143 మంది ఓటర్లు సర్ విచారణకు హాజరు




ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం

స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ -2026 భాగంగా బిఎల్ఓ ల ద్వారా నోటీసులు అందుకున్న 143 మంది ఓటర్లు ఒరిజినల్ ధృవపత్రాలతో విచారణకు హాజరైనట్లు మండల సహాయ ఎన్నికల అధికారి యు మధుసూదన్ రావు తెలిపారు. సోమవారం మండలంలోని సి కె పల్లి ఏ ఈ ఆర్ఓ యు మధుసూదన్ రావు, నెత్త కుప్పంలో ఏఈఆర్ ఓ పులిరాం సింగ్, సొరకాయల పాళ్యం కేంద్రాలలో ఏఈఆర్ఓ తేజోతులు విచారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 156 మంది ఓటర్లకు బిఎల్‌వోలు విచారణకు హాజరుకావాలని నోటీసులు అందజేశారు అందులో 143 మంది విచారణకు హాజరై ఆధారాలను విచారణ అధికారులకు సమర్పించడంతో పరిశీలించి 143 మందికి ఓటు హక్కును పునరుద్ధరించామని ఎన్నికల అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సూపర్వైజర్లు అమృత, తరుణ్, బి ఎల్ ఓ హేమంత్ కుమార్ , వీఆర్ఏ బాల,బి ఎల్ వో లు, ఓటర్లు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు

# "న్వార్వి ప్రతిభ-2026" ప్రతిభా పరీక్ష



ప్రజాభూమి, పుట్లూరు.

లివిద్యార్థుల్లో పోటీ పరీక్షలపై ఆసక్తిని పెంపొందించి, వారి ప్రతిభను ప్రోత్సహించాలనే లక్ష్యంతో లాభాపేక్షలేని సంస్థ న్వార్వి గ్రాటిట్యూడ్ ఆధ్వర్యంలో ఆగస్టు 24న లిన్వార్వి ప్రతిభ--2026 ప్రతిభా పరీక్షను నిర్వహించారు. తాడిపత్రి సమీపంలోని వెరాసిటీ, గంగాదేవిపల్లి కేంద్రంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న న్వార్వి గ్రాటిట్యూడ్ సంస్థ వ్యవస్థాపకులు శ్రీ క్రిస్టిపాటి వెంకటరామిరెడ్డి, శ్రీమతి వీర నారాయణమ్మ దంపతుల 50వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గంగాదేవిపల్లి, చుక్కలూరు, ఇగుడూరు, బ్రాహ్మణపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ ప్రతిభా పరీక్షలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ తరగతుల విద్యార్థుల స్థాయికి అనుగుణంగా నాలుగు గ్రూపులుగా పరీక్ష నిర్వహించారు.




విద్యార్థుల సాధారణ పరిజ్ఞానం, గణితం, భాషా నైపుణ్యాలు, తార్కిక ఆలోచన, విజ్ఞానశాస్త్రం, పర్యావరణ అవగాహన, స్థానిక పరిజ్ఞానం తదితర అంశాలపై సులభమైన ప్రశ్నలను రూపొందించారు. పరీక్ష అనంతరం ఫలితాలను ప్రకటించి, ప్రతి గ్రూపులో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులను అందజేశారు. గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని పోటీ పరీక్షల్లో ధైర్యంగా పాల్గొనేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని న్వార్వి గ్రాటిట్యూడ్ ప్రతినిధి వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన లిగంగాదేవిపల్లి, చుక్కలూరు, ఇగుడూరు మరియు బ్రాహ్మణపల్లి ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులకు న్వార్వి గ్రాటిట్యూడ్ తరపున వంశీ కృష్ణారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ గ్రామీణ విద్యార్థుల విద్యా వికాసం, ప్రతిభా ప్రోత్సాహం మరియు పోటీ పరీక్షలపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

## ఈనెల 30న 'చేయూత' ఉచిత కృత్రిమ చేతుల పంపిణీ

### - : అర్హులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అనంతపురము జిల్లా శాఖ, రోటరీ క్లబ్ అనంతపురం సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 30వ తేదీన నిర్వహించనున్న 'చేయూత' ఉచిత ఫంక్షనల్ ప్రోస్తెటిక్ హ్యాండ్స్ (పని చేయగలిగే కృత్రిమ చేతులు) పంపిణీ కార్యక్రమం కరపత్రాలను సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా అధికారులు, అర్జీదారులకు పంపిణీ చేసి కార్యక్రమ వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యుడు దాసరి భరత్, ట్రెజరర్ సుంకర రమేష్, బిసితి భరత్ మాట్లాడుతూ, రాయలసీమ ప్రాంతంలోని ఆరు జిల్లాలకు చెందిన, మోచేతి కింది భాగంలో చేయి కోల్పోయిన దివ్యాంగులకు రోటరీ క్లబ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా ఫంక్షనల్ ప్రోస్తెటిక్ హ్యాండ్స్ అందజేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ముందుగా తమ వివరాలను 'చేయూత' కాల్ సెంటర్ నంబర్ 8866306969 ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 30వ తేదీన అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో నిర్వహించే పంపిణీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కృత్రిమ చేతుల సహాయంతో దివ్యాంగులు రోజువారీ పనులను సులభంగా చేసుకోవడంతో పాటు వ్యవసాయ పనులు కూడా నిర్వహించగలుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐదవ రోడ్డు ప్రభుత్వ యునాని డాక్టర్ రఫిక్, యూత్ రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.జయమారుతి, అంబరీష్, బాలాజీ, మంజునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించడమే లక్ష్యం- ఎస్ ఈ చంద్రశేఖర రావు

### ఆర్ సి పురం లో నూతన 33/11 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్ కు భూమి పూజ.



ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం

విద్యుత్ వినియోగదారులకు, రైతులకు, ప్రభుత్వ కార్యాలయాలకు నాణ్యమైన విద్యుత్తును అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ చంద్రశేఖ ర రావు అన్నారు. సోమవారం మండలంలో ని కమ్మ కండ్రిగ సమీపంలో ఉన్న తోక గుట్ట వద్ద 33/11 కేవీ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా 24 గంటలు విద్యుత్తు సరఫరాను అందించేందుకు విద్యుత్తు సబ్ స్టేషన్ లో నిర్మిస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఆర్ సి పురంలో రూ. 3కోట్ల 20 లక్షల రూపాయలతో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ను నిర్మిస్తున్నామన్నారు. త్వరితగతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని పూర్తిచేసి రైతులకు ప్రజలకు నిరంతరం విద్యుత్ సరఫరా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కన్స్ట్రక్షన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలాజీ, ఏ డి ఈ లు హరి ప్రసాద్, ముని రవిచంద్ర, సతీష్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ వి ఎస్ గిరి, రవి, లక్ష్మీపతి, వెంకట ముణి, చిన్నబ్బ,, సురేష్, శివ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అమావాస్ రెడ్డి కండ్రిగ ఎస్టీలు,దళితులకు ఇంటి స్థలాలు కేటాయించాలి

### ఆందోళన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి.





ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.

తిరుపతి జిల్లా సత్యవేడు మండలం కొత్తమారికుప్పం పంచాయతీ అమావాస్ రెడ్డి కండ్రిగ ఎస్టీలకు, దళితులకు ఇంటి స్థలాలు కేటాయించడంతోపాటు స్మశానానికి స్థలం చూపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి కోరారు. ఇంటి స్థలాల కోసం సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిపిఐ ఆధ్వర్యంలో ఎస్టీలు, దళితులు పలువురు ఆందోళన చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఐ నాయకుడు మురళి మాట్లాడుతూ కొత్తమారి కుప్పంలో సర్వే నెంబరు 320 నుంచి 350 వరకు ఉన్న ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. ఇంటి స్థలాలు లేని వారికి ఈ భూములను కేటాయించాలని ఆయన కోరారు. పైగా స్మశాన వాటికకు స్థలం లేకపోవడం వల్ల మృతి చెందుతున్న మృతదేహాలను పూడ్చడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాల్సింది పోయి,దానికి తూట్లు పొడిచే విధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నట్టు ఆయన ఆరోపించారు. సత్యవేడు నియోజకవర్గంలో ఊతుకోట నుంచి సత్యవేడు వరకు,నాగలాపురం నుంచి చిన్నపాండూరు వరకు రహదారులు గుంతలమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు,ఎమ్మెల్యే పేదల పక్షాన నిలబడి ఆయా రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని మురళి డిమాండ్ చేశారు. తదనంతరం రెవెన్యూ డిటి వెంకటేశ్వరకు దీనిపై వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ నాయకులు నాగార్జున,మురళి పాపయ్య,చిరంజీవి, సురేష్,సదమయ్య,జోసెఫ్. వెంకటమ్మ,ఆశ,మారి,స్వప్న. తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ - 2026 కోసం రూ. 3 లక్షల విలువైన టీషర్టులను అందించడం అభినందనీయం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ - 2026 కోసం తాడిపత్రి అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ వారు రూ. 3 లక్షల విలువైన టీషర్టులను అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ - 2026 కోసం తాడిపత్రి ఆదిత్య బిర్లా, అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ వారు సిఎస్ఆర్ కింద మూడు లక్షల రూపాయల విలువైన టీషర్టులను అందజేయగా, వాటిని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాడిపత్రి అల్ట్రాటెక్ సిమెంట్ సిఎస్ఆర్ అధికారి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ - 2026 కోసం జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు మూడు లక్షల రూపాయల విలువైన టీషర్టులను అందజేయడం జరిగిందని తెలిపారు. అలాగే జిల్లా ఫైర్ ఆఫీసర్ కి రెండు లక్షల రూపాయలు విలువైన హోసెస్ పైప్స్ అందజేశామని తెలిపారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కే.బసవనపల్లి విద్యార్థులు-హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

రాష్ట్ర స్థాయి అమరావతి ఛాంపియన్ షిప్ పోటీలకు హిందూపురం రూరల్ మండల పరిధిలోని కే.బసవనపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రవీంద్రారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్ కుమార్, అరుణ తెలిపారు.



11వ తేదీన కే.బసవనపల్లి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన జిల్లా స్థాయి అమరావతి ఛాంపియన్ షిప్ కప్ 2026 వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరిచి అండర్- 17 బాలికల విభాగంలో ప్రవస్థి, ఇంటర్ సెవెంటీన్ బాలుర విభాగంలో పదవ తరగతి విద్యార్థి సమీర్ లు ఎంపికైన తెలిపారు. వీరిద్దరూ తిరుపతిలో జరుగుతున్న రాష్ట్రస్థాయిలో పాల్గొనడానికి వెళ్లినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు తెలియజేశారు. గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులు అభినందించారు.

## అనారోగ్యంతో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి అండగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

**-సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 4.53లక్షల సాయం**

**-మృతుని భార్యకు చెక్కు అందజేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి**



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

అనారోగ్యంతో మరణించిన వ్యక్తి కుటుంబానికి అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అండగా నిలిచారు. అనంతపురం నగరంలోని 37వ డివిజన్ కు చెందిన శ్రీధర్ ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. లక్షలకు లక్షలు ఖర్చు పెట్టినప్పటికీ ఆయన చివరకు మరణించాడు. స్థానిక టీడీపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సీఎంఆర్ఎఫ్ ద్వారా దరఖాస్తు చేయించారు. దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించి మృతుని కుటుంబానికి రూ 4.53 లక్షలు వచ్చేలా చేశారు. ఈ చెక్కును మృతుడు శ్రీధర్ భార్య అరుణ కుమారికి అందజేశారు. అనంతపురం క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఈ చెక్కును అందుకున్న అరుణకుమారి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పేదల వైద్య విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంత ఖర్చు అయినప్పటికీ సాయం చేస్తున్నారని ఇప్పటికే అర్బన్ నియోజకవర్గంలో 7 కోట్లకుపైగా సాయం చేసినట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# అవక తవకలు వెలికి తీయాలి

### చేనేత కార్మిక సంఘం కలెక్టర్ కు అర్జీ



ప్రజా భూమి శింగనమల

అనంతపురం కలెక్టరేట్ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమంలో నేతన్న నేస్తం పథకం అవకతవకలపై అర్జీ ఇవ్వడం జరిగింది చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్ శ్రీరాములు జిల్లా ప్రధాన కార్యదర్శి పామిశెట్టి గోవింద్ చేతి వృత్తుల సంఘం లింగమయ్య జాయింట్ కలెక్టర్ కి నేతన్న సేవ పథకం ఆగస్టు 7న అమలు జరిగింది అనంతపురం జిల్లా మొత్తం 1190 మంది చేనేత కార్మికులు ఖాతాలో డబ్బులు జమ కాలేదు నేతన్న నేస్తం అవకతవకల పై పూర్తి విచారణ జరిపి అర్హులైన 1190 మందికి 25 వేల రూపాయలు వారి ఖాతాలో డబ్బులు జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం డిమాండ్ చేస్తున్నాము ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యక్షులు నీలూరు లక్ష్మయ్య జిల్లా ఉపాధ్యక్షులు చేనేత మధు వెంకటరాముడు రామ్మోహన్ పాల్గొన్నారు

## గ్రామాలకు వెళ్లే రహదారులను వైపు చూడండి

### అధ్వానంగా ఉన్న రోడ్లను చూడండి

### బిజెపి నాయకులు డిమాండ్ -తహసిల్దార్ కు వినతి పత్రం



ప్రజా భూమి శింగనమల

మండలం పరిధి పల్లెలకు వెళ్లే ప్రధాన రహదారులు వైపు ఒకసారి చూడండి శింగనమల నుంచి తరిమెల వెళ్లే రహదారి కళ్ళుమడి పాపినేపాల్యం వెళ్లే రహదారి సలకం చెరువు కొరివి పల్లి రహదారులను మరమ్మత్తులు చేయాలి నాయకులు డిమాండ్ చేశారు బస్సుల్లో ఆటోల్లో ద్విచక్ర వాహనంలో ట్రాక్టర్ల లో ప్రయాణం చేసే వాహనదారులు ఎంత నరకయాతన పడుతున్నారో ఒకసారి చూడండి ప్రతిరోజు స్కూల్స్ కి వచ్చే విద్యార్థులు విద్యార్థినిలు గుంతల రహదారుల లో ప్రయాణం చేయలేక చాలా అవస్థలు పడుతున్నారు గుంతల రోడ్లలో ప్రయాణం చేయాలంటే విసుగెత్తిపోతున్నారు బిజెపి నాయకులు ప్రజలు అధికారులను అధ్వానంగా ఉన్న రోడ్ల వైపు చూసి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని బిజెపి నాయకులు డిమాండ్ చేస్తున్నారు

# శాఖల్లో సమర్ధత – సేవల్లో నాణ్యత



## సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం డేటా ఇంటిగ్రేషన్

### డెంగీ, మలేరియా నివారణకు హాట్‌స్పాట్‌ల గుర్తింపు

### ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశం

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:
ఏఐ అసిస్టెంట్, డిజి వెరిఫై, డేటా లేక్, బ్లాక్ చెయిన్... వంటి సాంకేతికతను వినియోగించుకుని ఆన్‌లైన్ సేవలు మరింత సులభతరం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఏ ఒక్కరూ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే పని లేకుండా సేవలు అందించాలన్నారు. ప్రస్తుతం వాట్సప్ గవర్నెన్స్ మనమిత్ర ద్వారా అందిస్తున్న 1,204 సేవలకు సంబంధించి డేటా ఎంట్రీ సమాచారాన్ని మరింత సంక్షిప్తం చేయాలన్నారు. సర్టిఫికేట్స్ అప్‌లోడ్ చేసే పని లేకుండా డేటా ఇంటిగ్రేషన్ జరగాలని సీఎం స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ సమీక్షలో వివిధ శాఖల పనితీరు, పురోగతి గురించి ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అన్ని శాఖలు మరింత సమర్థత పెంచుకోవాలని, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.
క్రాప్ అలర్ట్‌లపై పర్యవేక్షణఎల్‌నినో నేప థ్యంలో రాష్ట్రంలో పంటల పరిస్థితిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈసారి వ్యవసాయ దిగుబడులు సాధారణం కన్నా 20 శాతం తగ్గే అవకాశం ఉందని తెలిపారు. అదే విధంగా కృష్ణా డెల్టాకు సెప్టెంబర్ నెలాఖరు వరకు పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు అందించగలమని చెప్పారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు సమృద్ధిగా నీరందించేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే సాగు మొదలు పెట్టని చోట వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు ప్రోత్సహించాలని నిర్దేశించారు. రైతులకు ఎప్పటికప్పుడు క్రాప్ అలర్ట్ పంపడంతో పాటు దానిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఇందుకోసం ఏపీటీ ఎస్ అనలిటిక్స్ కూడా వినియోగించుకుని... అవేర్‌తో సమన్వయం చేసుకోవాలని సీఎం అన్నారు. తాగునీటి వరకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని చెప్పారు. అటు మలేరియా, డెంగీ కేసుల నివారణకు హాట్ స్పాట్ లు గుర్తించి, నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. అయితే గత ఏడాది ఇదే సమయానికి 1,361 డెంగీ కేసులు నమోదైతే... ఈ ఏడాది ఇప్పటికి 401 కేసులు నమోదైనట్టు అధికారులు తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో కార్బన్ న్యూట్రల్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే రెన్యువబుల్ ఎనర్జీపై ఎక్కువ దృష్టి పెట్టాలని అధికారులకు సీఎం సూచించారు. సోలార్ రూఫ్ టాప్‌లు పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు.

# 29వ రోజూ విజయవంతంగా కొనసాగిన 'ఇంటింటికీ తెలుగుదేశం-2026'




### 81.64 లక్షల ఇళ్లకు చేరుకున్న 'ఇంటింటికీ తెలుగుదేశం'

### 80 లక్షల మైలురాయిని దాటిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం

### నేడు 2,32,568 ఇళ్లను సందర్శించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

### ప్రజా భాగస్వామ్యంతో మరింత విస్తృతంగా కొనసాగుతున్న 'ఇంటింటికీ తెలుగుదేశం'

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:
కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు... ప్రభుత్వ పనితీరుపై ప్రజల స్పందనను నేరుగా తెలుసుకునేందుకు తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం – 2 ఏళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం 29వ రోజూ రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగింది. 80 లక్షల ఇళ్ల మైలురాయిని దాటి... 81.64 లక్షల ఇళ్లకు చేరుకున్న 'ఇంటింటికీ తెలుగుదేశం' 29వ రోజు రాష్ట్రవ్యాప్తంగా 2,32,568 ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. దీంతో కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 81.64 లక్షల ఇళ్లను పార్టీ శ్రేణులు సందర్శించాయి. ఇప్పటికే 80 లక్షల ఇళ్ల మైలురాయిని అధిగమించి, ప్రజల గడప గడపకు 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం మరింత వేగంగా విస్తరిస్తోంది. ప్రతి గడపకు వెళ్లి ప్రతి కుటుంబాన్ని ప్రత్యక్షంగా కలిసి... వారికి అందుతున్న ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరిస్తూ రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఆయా కుటుంబాలకు తెలియజేస్తున్నారు. అదే సమయంలో ప్రజల సమస్యలు, అభిప్రాయాలను నేరుగా తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం మరింత ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు కూడా పెద్ద ఎత్తున భాగస్వామ్యమవుతున్నారు.

# తడలో విజృంభించిన కాంగ్రెస్ శ్రేణులు



### ఘనంగా కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ డి. కిరణ్ కుమార్ జన్మదిన వేడుకలు

### తడ మండల పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

### పార్టీ బలోపేతానికి డైనమిక్ లీడర్‌గా కృషి చేస్తున్నారని కొనియాడిన నేతలు

### తిరుపతి జిల్లా డీసీసీ అధ్యక్షులు బాలగురువం బాబు ఆదేశాలతో నిర్వహణ

ప్రజాభూమి ప్రతినిధి తడ
తిరుపతి జిల్లా డీసీసీ అధ్యక్షులు బాలగురువం బాబు ఆదేశాల మేరకు సూళ్లూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ డి. కిరణ్ కుమార్ జన్మదిన వేడుకలను సోమవారం తడ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.శాలువాతో సన్మానం – కేక్ కట్ చేసిన నాయకులుఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి గండవరం రమేష్ రెడ్డి అధ్యక్షత వహించారు. ముందుగా డి. కిరణ్ కుమార్ ను నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించి, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. యంగ్ అండ్ డైనమిక్ లీడర్‌గా కిరణ్ కుమార్ సూళ్లూరుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతున్నారని ప్రశంసించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ తుమ్మ దేవదానం, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ చైర్మన్ దాసరి రత్నం, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కన్నంబాకం హరికృష్ణ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు శ్వేత, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆవుల రమణ పాల్గొన్నారు. అలాగే తడ మండల అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, ఓబీసీ అధ్యక్షులు మహేంద్ర, సూళ్లూరుపేట టౌన్ ప్రెసిడెంట్ సునీల్ రెడ్డి, టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు ప్రవీణ్ తో పాటు పలువురు మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# వ్యాపార సంస్థల భద్రతపై ప్రత్యేక దృష్టి

### తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి.



తిరుపతి నగరంలోని వ్యాపార సంస్థల్లో దొంగతనాల నివారణకు బహుళస్థాయి భద్రతా చర్యలు చేపట్టాలని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశించారు. గోల్డ్ షాపులు, పాన్ బ్రోకర్లు, బ్యాంకులు, ఎలక్ట్రానిక్ షాపులు మరియు ఆటో డీలర్ల ప్రతినిధులతో ఒక ముఖ్యమైన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, వ్యాపారులు తమ సంస్థల రక్షణ కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కేవలం సాధారణ నిఘానే కాకుండా, కింది జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు.
ఆధునిక నిఘా:సాధారణ సీసీటీవీలతో పాటు నైట్ విజన్ కెమెరాలను ఏర్పాటు చేయాలి. అత్యవసర సమయాల్లో హెచ్చరించే అలారాలు, సెన్సార్లు మరియు వాటికి నిరంతర పవర్ బ్యాకప్ వ్యవస్థలను అమర్చుకోవాలి.సైబర్ అప్రమత్తత భౌతిక దొంగతనాలతో పాటు, ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల వ్యాపారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి అని అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ సుబ్బారాయుడు ఈ సమావేశంలో పిలుపునిచ్చారు.



# సర్ ప్రోగ్రాం హిరింగ్ కార్యక్రమంలో పాల్గొన్న ఏర్పేడు మండల తాసిల్దార్ రాజశేఖర్

ప్రజాభూమి ప్రతినిధి ఏర్పేడు
ఈరోజు ఏర్పేడు మండలం సదాశివపురం గ్రామంలో సర్ హియరింగ్ ప్రోగ్రాం లో సరైన పత్రమును లేక ముందు నమోదు కాకుండా ఉన్న ప్రజలు కొంతమందికి నోటీసులు అందించడం జరిగింది. అందులో భాగంగా ఈరోజు సదాశివపురంలో జరిగిన హియరింగ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మార్వో రాజశేఖర్ మరియు ఏర్పేడు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు , డిఎల్ఓ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వార్డు సచివాలయ సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ తనూజ సమావేశం

### జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వహించాలని ఆదేశం



ప్రజాభూమి, పులివెందుల
పులివెందుల మున్సిపల్ కమిషనర్ తనూజ వార్డు సచివాలయ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ.ప్రతి వార్డు సచివాలయ ఉద్యోగి వారి వారి జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వహించాలని ఆదేశించారు. తమ సచివాలయ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.ప్రతి ఉద్యోగి ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సచివాలయ పరిధిలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అదేవిధంగా ప్రజలు కూడా తమ సమస్యలను మొదటగా వార్డు సచివాలయంలో తెలిపి పరిష్కరించు కోవాలని కమిషనర్ తనూజ సూచించారు.

# మద్యం కుంభకోణం కి కేరాఫ్ అడ్రస్ తాడేపల్లి ప్యాలెస్

### ఎన్నికల్లో మద్యపాన నిషేధం అని చెప్పి, అధికారంలోకి వచ్చాక వేల కోట్ల దోపిడీ కోసమే మద్యం పాలసీని మార్చారు :మంత్రి కొలుసు పార్థసారథి



ప్రజాభూమి ప్రతినిధి, మంగళగిరి:
గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మద్యం కుంభకోణం దేశంలోనే జరిగిన అతిపెద్ద స్కామ్‌లలో ఒకటని గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టడానికి 'మద్యపాన నిషేధం' చేస్తామని ఊరూరా ప్రచారం చేసి, అధికారంలోకి వచ్చాక వేల కోట్ల రూపా యలు దోచుకోవడానికి వీలుగా మద్యం పాలసీని రూపొందించారని మంత్రి విమర్శించారు. మద్యం తయారీ డిస్టిలరీల నుంచి డీలర్ల నియామకం, రవాణా, హోలోగ్రామ్స్ వరకు ప్రతి దశలోనూ వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టారని, ఆ డబ్బును రహస్య స్థావరాల్లో (డెన్స్‌లో) దాచిన తీరును ఆధారాలతో సహా ప్రజలంతా చూశారని స్పష్టం చేశారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రూ. 3,500 కోట్ల మద్యం కుంభకోణం బయటపడినా వైఎస్సార్‌సీపీ నాయకుల్లో పశ్చాత్తాపం లేదని మంత్రి మండిపడ్డారు. తమ హయాంలో జరిగిన దోపిడీపై ఎవరూ మాట్లాడకూడదని, ఎంక్వైరీ జరిగితే ప్రభుత్వం తమపై కక్ష సాధింపులకు పాల్పడుతోందంటూ కులాలు, మతాలు, రాజకీయాలను అడ్డం పెట్టుకుని ఎదురుదాడి చేయడం వారికి సిద్ధాంతంగా మారిందన్నారు. తమకు అనుకూలంగా ఉంటే సీబీఐ విచారణ కావాలని కోరడం, అదే సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు ఆధారాలతో సహా దోపిడీని బయటపెడితే రాజకీయ కక్ష అని గగ్గోలు పెట్టడం గొడ్డలి పార్టీ రెండు నాల్కల ధోరణికి నిదర్శన మని ఎద్దేవా చేశారు. సాధారణంగా ఏ ప్రభుత్వమైనా పాలనను మెరుగుపరచడానికి, సాంకేతిక సలహాల కోసం నిపుణులను నియమించుకుంటుందని, కానీ గత ప్రభుత్వంలో దోపిడీకి మాత్రమే సలహాదారులను పెట్టుకున్నారని విమర్శించారు. మద్యం, ఇసుక దోపిడీ కోసం రాజ్ కసిరెడ్డి లాంటి వ్యక్తులను వినియోగించి, ఇతర ప్రాంతాల నుంచి అధికారులను డెప్యుటేషన్‌పై తెచ్చి అక్రమాలు చేయించారని ఆరోపించారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుటుంబం మద్యం వ్యాపారంలో, రవాణా కాంట్రాక్టుల్లో ఉన్నట్లు స్వయంగా అంగీకరించారని గుర్తుచేశారు. వ్యాపారం చేయడం తప్పు కాదని, కానీ ప్రభుత్వ అండదండలతో, అధికారుల సహకారంతో దోపిడీకి పాల్పడటమే అసలు నేరమని స్పష్టం చేశారు. ఒక బాక్స్ రవాణాకు రూ. 13 ఉండాల్సిన ఖర్చును ఏకంగా రూ. 35కి పెంచి, సుమారు రూ. 400 కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థలు పక్కా ఆధారాలతో వెలుగులోకి తెచ్చాయన్నారు. ఆధారాలతో చర్యలు తీసుకుంటుంటే బలహీన వర్గాలపై దాడి అని ప్రచారం చేయడం శోచనీయమని, భవిష్యత్తులో చేసిన పాపాలు బయటకు వచ్చినప్పుడు తమను తాము కాపాడుకోవడానికే గత ప్రభుత్వం బలహీన వర్గాల నాయకులను ఇలాంటి అవినీతి కార్యక్రమాల్లోకి లాగిందా అని ప్రజలు అనుమానిస్తున్నారని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. అవినీతికి పాల్పడింది బలహీన వర్గాల వారైనా, మరెవరైనా సరే చట్టం ముందు అందరూ సమానమేనని మంత్రి స్పష్టం చేశారు. సమాజానికి, రాష్ట్రానికి ఆర్థికంగా నష్టం జరిగిందా లేదా, చట్టవ్యతిరేక పనులు జరిగాయా లేదా అనే అంశాల ఆధారంగానే దర్యాప్తులు జరుగుతాయని జగన్మోహన్ రెడ్డి తెలుసుకోవాలన్నారు. కులాలు, మతాల ముసుగులో పాపాలను కడుక్కోవాలని చూడటం దారుణ మని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఫేక్ కంపెనీలను సృష్టించి, దోచుకున్న ప్రజాధనాన్ని పంపిణీ చేశారని ఆరోపించారు. మద్యం దోపిడీ ద్వారా వచ్చిన నల్లధనాన్ని రవాణా చేసిన డ్రైవర్ల నుంచి, రహస్య స్థావరాల (డెన్‌ల) వరకు దర్యాప్తులో అన్నీ బయటపడ్డాయని, ఈ సొమ్మును గత ఎన్నికల్లో ఏ విధంగా వినియోగించారో సాక్ష్యాలు స్పష్టంగా ఉన్నాయని చెప్పారు. ఇంత జరిగినా కూడా 'బలహీన వర్గాలపై దాడి' అని తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. రాజ్ కసి రెడ్డి ద్వారా కేంద్ర ప్రభుత్వ అధికారి వాసుదేవరెడ్డిని రాష్ట్రానికి తీసుకొచ్చి, వారిద్దరి ద్వారా మద్యం పాలసీలో భారీ దోపిడీ నడిపించిన తీరు సాక్ష్యాధారాలతో రుజువైందని తెలిపారు. అవినీతి సొమ్ము సంపాదించేందుకు వీరిని అడ్డం పెట్టుకుని, కేసులు రాగానే 'ఏరు దాటాక తెప్ప తగలేసే' రీతిలో వారిని వదిలేసి రాజకీయ లబ్ధి కోసం కుల ముద్ర వేస్తున్నారని విమర్శించారు.




# విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అందుకునేలా ప్రోత్సహించాలి

### జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం
ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు తమ వంతు బాధ్యతగా విద్యార్థులను విలువలతో కూడిన విద్యను అందుకునేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో 8 లీప్ (LEAP) పాఠశాలలకు చెందిన హెడ్మాస్టర్లు, మండల విద్యాశాఖ అధికారులు, ఉన్న ఎక్స్పర్ట్ టీచర్లకు బెంగళూరు నుంచి వచ్చిన ILP ప్రతినిధులు, విలువల బడి ప్రతినిధి లెనిన్ బాబు అవగాహన కల్పించారు. లీప్ పాఠశాలలకు ఎలాంటి ఇన్ఫ్రా సౌకర్యాలు కావాలి, ల్యాబ్ లు, సాంకేతిక పరికరాలు, ఆధునిక సౌకర్యాలు, క్రీడా సౌకర్యాలు, సాంకేతిక విద్యను బోధించడానికి కావలసిన పరికరాలు వంటి వివరాలు హెడ్మాస్టర్లను అడిగి తెలుసుకోవడం జరిగింది. విద్యార్థుల్లో చదువుపట్ల అవగాహన పెంపొందించడం, సాంకేతిక అంశాలను విద్యార్థులకు పరిచయం చేయడం, సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించడం, మినిమం లెవెల్స్ విద్యార్థుల్లో పెంపొందించడం ఎలా వంటి అంశాల మీద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హెడ్మాస్టర్లు మరియు మండల విద్యాశాఖ అధికారులు తమ పాఠశాలగా భావించి విద్యార్థులను తీర్చిదిద్దాలని, లీప్ పాఠశాలలు అంతర్జాతీయ ప్రమాణాలతో మంగళగిరి నియోజకవర్గంలోని నిడమానూరులో తయారుచేసిన విధంగా మన జిల్లాలో 8 లీప్ స్కూల్స్ అత్యుత్తమంగా తయారు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని తెలియజేశారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు తమ వంతు బాధ్యతగా విద్యార్థులను విలువలతో కూడిన విద్యను అందుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. అనంతపురం జిల్లాలో LEAP పాఠశాలలు అనంతపురం నియోజకవర్గం - గవర్నమెంట్ హై స్కూల్ న్యూ టౌన్ బాయ్స్, అనంతపురం. రాప్తాడు నియోజకవర్గం - జిల్లా పరిషత్ హై స్కూల్, ఆత్మకూరు. ఉరవకొండ నియోజకవర్గం - S.K గవర్నమెంట్ హై స్కూల్, ఉరవకొండ. కళ్యాణదుర్గం నియోజకవర్గం - జిల్లా పరిషత్ హై స్కూల్ గర్ల్స్, కళ్యాణదుర్గం. రాయదుర్గం నియోజకవర్గం - జిల్లా పరిషత్ హై స్కూల్, డి.హీరేహాల్. సింగనమల నియోజకవర్గం - గవర్నమెంట్ హై స్కూల్ బాయ్స్, నార్పల. తాడిపత్రి నియోజకవర్గం - జిల్లా పరిషత్ హై స్కూల్, యాడికి, గుంతకల్లు నియోజకవర్గం- SJP గవర్నమెంట్ హై స్కూల్, గుంతకల్లు. మంగళగిరి నియోజకవర్గంలోని నిడమానూరు లీప్ పాఠశాలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దిన విధంగా మన అనంతపురం జిల్లాల్లో పైన పేర్కొన్న ఎనిమిది లీప్ పాఠశాలలను తీర్చిదిద్దుతామని డీఈఓ ఆయుబ్ హుస్సేన్, ఏపిసి శైలజ తెలియజేశారు. అంతర్జాతీయ పాఠశాలల్లో ఉన్న అన్ని అంశాలను ఈ పాఠశాలల్లో తీసుకువస్తున్నామని తెలిపారు. ఆస్ట్రో ల్యాబ్స్ కోసం ఆర్కిటెక్ట్ డిజైన్లు కంప్లీట్ అయ్యాయని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో అదనపు తరగతి గదుల నిర్మాణం, ల్యాబ్స్, వాకింగ్ పాత్ లు రన్నింగ్ పాత్ లు, క్రీడా మైదానాలు వంటివి నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఈఓలు శ్రీనివాస రావు, లక్ష్మన్న, సమగ్ర శిక్ష సీఎంవో చంద్రశేఖర్, అలెస్కో రామచంద్ర, ఏపీవో నారాయణస్వామి, 8 మండలాల 1, 2 ఎంఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

# జోగి రమేష్ నీతివాక్యాలు హాస్యాస్పదం

### కుటుంబంపై విమర్శలు తట్టుకోలేక ధర్మం, న్యాయం అంటూ మాట్లాడటం విడ్డూరం:కొమర వెంకట నరసయ్య



ప్రజాభూమి, ఒంటిమిట్ట:
మాజీ మంత్రి జోగి రమేష్ గతంలో అధికారంలో ఉన్న సమయంలో చేసిన వ్యాఖ్యలు, చర్యలను ప్రజలు మరచిపోలేదని రాష్ట్ర కల్లుగీత కార్మికుల సహకార ఆర్థిక సంస్థ మాజీ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య అన్నారు. ప్రస్తుతం తన కుటుంబ సభ్యులపై వస్తున్న విమర్శలను తట్టుకోలేక న్యాయం, ధర్మం అంటూ నీతివాక్యాలు వల్లించడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులపై జోగి రమేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రజలు గుర్తుంచుకున్నారని అన్నారు.
ప్రస్తుతం కుల రాజకీయాలు, బీసీ కార్డుతో లబ్ధి పొందే ప్రయత్నం విఫలమవడంతో కుటుంబంపై దాడి అంటూ మరో అంశాన్ని తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. గతంలో చేసిన తప్పులను అంగీకరించి బహిరంగంగా పశ్చాత్తాపం వ్యక్తం చేస్తే ప్రజలు కొంతమేర విశ్వసించే అవకాశం ఉంటుందని నరసయ్య సూచించారు.
చంద్రబాబు నాయుడికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో జోగి రమేష్‌పై వచ్చిన ఆరోపణలపై చట్ట ప్రకారం సమగ్ర విచారణ జరుగుతుందని, అప్పటి వరకు వేచి చూడాలని సూచించారు.

Printed by MOHANEESWARPUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at East Godavari and published at d.no.70-7-28/1A, KRISHNA NAGAR, SBI COLONY PARK RAMANAYYA PETA KAKINADA editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1470.cell:9502116677.